# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 21 ఏప్రిల్ 2026 | సంపుటి: 10 | సంచిక: 105 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## చిన్నారిని పీక్కుతిన్న ఊరకుక్కలు



2

## ఆమె సహకారం.. ఆప్యాయత వల్లే

తన సతీమణి భువనేశ్వరితో కలిసి పుట్టినరోజు కేక్ కట్ చేసిన ఏపీ సీఎం చంద్రబాబు





2

# కేసీఆర్.. నువ్వో నేనో తేల్చుకుందాం

## నీ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే పేరు మార్చుకుంట



- ఫామ్‌హౌస్‌లో పండుకునే పాపాల భైరవుడు మళ్ల రావాల్నా
- జీవన్‌రెడ్డి చరిత్ర.. ఆయన వెనకున్న మచ్చలన్నీ తెలుసు
- ఏడాది పదవి లేకుంటే శత్రువు పంచన చేరిండు
- కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి రానియ్య
- కాటారం బహిరంగ సభలో సీఎం రేవంత్ ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 20 (మనం బ్యూరో): కేసీఆర్...నీ ప్రతిపక్ష హోదా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంట. కార్యకర్తల సాక్షిగా ఇదే నా సవాల్. 2029లో నువ్వో...నేనో తేల్చుకుందామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫామ్‌హౌస్‌లో పండుకునే పాపాల భైరవుడు మళ్లీ రావాలని ఒక పెద్ద మనిషి అంటున్నడు. ఆ పాపాల భైరవుడు మళ్లీ ఎందుకు రావాలె. లక్షలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్ జెండా మోస్తే ఈ ప్రభుత్వం వచ్చింది. పాపాల భైరవుడు ఎందుకు రావాలో ఆ పెద్ద మనిషి చెప్పాలని పరోక్షంగా జీవన్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి ఇల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ కేసీఆర్, జీవన్ రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. జీవన్ రెడ్డి చరిత్ర, ఆయన వెనకున్న మచ్చలన్నీ నాకు తెలుసనీ, 40 ఏళ్ల పాటు తన కుటుంబానికి ఎన్నో పదవులు ఇచ్చుకున్నారని విమర్శించారు. 14 సార్లు కాంగ్రెస్ పార్టీ బీ ఫాం ఇస్తే మోసం చేసి వెళ్లిపోయారనీ, ఓడిపోయినప్పటికీ ఎన్నోసార్లు పదవులు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అయనను గౌరవించిందని పేర్కొన్నారు. ఏడాది పాటు పదవి లేకపోతే జీవన్ రెడ్డి కార్యకర్తల గుండెల మీద తన్ని శత్రువు పంచన చేరాడని తీవ్రంగా మండిపడ్డారు. 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు

...మిగతా 2లో

## కాళేశ్వరం ప్రాజెక్టునూ వదలం.. దోషులనూ వదలం

రిపేర్లు చేసి రైతులకు నీరు అందిస్తం, దోషులను శిక్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ

కుంగిన మేడిగడ్డ బ్యారేజీ సందర్శన, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష

కాళేశ్వరం ముక్తేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన





హైదరాబాద్, ఏప్రిల్ 20, (మనం బ్యూరో): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దక్షిణ కాశీగా పేరొందిన శ్రీకాళేశ్వర ముక్తేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రూ.198 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికే దీనికి సంబంధించి దేవాదాయ శాఖ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించింది. భక్తుల సౌకర్యార్థం కాళేశ్వరం క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేలోగా ముక్తేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు మొదటి విడత పూర్తి కావాలని అధికారులను ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. అనంతరం నేరుగా మేడిగడ్డ బ్యారేజ్ చేరుకున్న సీఎం రేవంత్ గత కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన మేడిగడ్డ బ్యారెజ్ కుంగుబాటు,

...మిగతా 2లో

## 4 ప్రధాన ప్రాజెక్టులకు స్పెషల్ ఆఫీసర్లు

- మెయిన్ కెనాల్స్, బ్రాంచ్ కెనాల్స్, పంప్ హౌస్‌ల నిర్వహణ
- ప్రభుత్వం, సెంట్రల్ వాటర్ కమిషన్‌కు వారధిగా..
- అధికారుల పునర్వ్యవస్థీకరణ



హైదరాబాద్, ఏప్రిల్ 20, (మనం బ్యూరో): రాష్ట్రంలో ఇరిగేషన్ శాఖ ప్రక్షాళనకు ప్రభుత్వం నడుం బిగించింది. మెరుగైన ఇరిగేషన్ వ్యవస్థతో రైతులకు మరింత మేలు చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని నాలుగు ప్రధాన ప్రాజెక్టులపై దృష్టి సారించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలతో కాళేశ్వరం ప్రాజెక్టుకు వచ్చిన దుస్థితి మరే ప్రాజెక్టుకూ రాకూడదన్న సంకల్పంతో ప్రధాన ప్రాజెక్టులకు ప్రత్యేకంగా సీఈ స్థాయి అధికారిని నియమించాలని

...మిగతా 2లో

## కేసీఆర్ చావాలని ఆ ఎదవలంటే.. నేను చస్తనా?

నువ్వు వెయ్యి జన్మలెత్తినా నేను చావను

రేవంత్ రెడ్డికి స్ట్రాంగ్ కౌంటర్

కండువా కప్పి జీవన్ రెడ్డిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన కేసీఆర్

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటన

జగిత్యాల బహిరంగ సభలో కేసీఆర్



హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నాశనం.. ఉద్యోగస్తులు ఆగం.. రిటైర్డ్ ఉద్యోగస్తులు ఆగం.. విద్యార్థుల జీవితం ఆగం.. ఆటో కార్మికుల జీవితాలు ఆగం.. ఎవరు సక్కగున్నరు? సంతృప్తిగా ఎవరున్నరు?.. ఈ అందానికి బోడి హైడ్రాను తీసుకొచ్చిండు?.. హైదరాబాద్‌లో హైడ్రా ఉందని.. నిజామాబాద్‌కు నిడ్రా తీసుకొస్తామని పీసీసీ ప్రెసిడెంట్ ఒకరు చెబుతున్నరు... రేపు జగిత్యాలకు జిడ్రా అంటాడని సెటైర్ వేశారు. మీకేం కావాలి.. పేదోళ్ల కొంపలు కూల్చడమేనా? అంటూ తాజా సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ సీఎం కేసీఆర్ జగిత్యాల సభ వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే టి. జీవన్‌రెడ్డి ఎట్టకేలకు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సుమారు 40 మంది తన ముఖ్య అనుచరులతో కలిసి ఆయన 'కారు' ఎక్కారు. ఈ సభకు జగిత్యాల నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలంతా తనపై చేస్తున్న విమర్శలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పొద్దున లేస్తే కేసీఆర్ చావాలని అంటున్నారని.. నువ్వు వెయ్యి జన్మలెత్తినా నేను చావ.. ఏం అనుకుంటున్నావ్ అని మండిపడ్డారు. జగిత్యాలలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడుతూ.. ఈ ఎదవలు

...మిగతా 2లో

## ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ?

సీఎం సూత్రప్రాయ అంగీకారం

త్వరలో నిషేధం ఎత్తివేత... రెండేళ్ల సర్వీసు పూర్తి కాకుంటే నో

స్పౌజ్ కేటగిరీ, దివ్యాంగులు, మానవీయ కోణంలో బదిలీలకు ప్రాధాన్యం

హైదరాబాద్, ఏప్రిల్ 20, ( మనం బ్యూరో): రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలపై సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ఫైల్‌పై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించడంతో బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. 2024లో చివరిసారిగా బదిలీలు చేపట్టిన ప్రభుత్వం ప్రస్తుతం పాలనలో మరింత పారదర్శకత, వేగం పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జనగణన విధుల్లో

...మిగతా 2లో

## జేఈఈ మెయిన్ 2026 సెషన్-2 ఫలితాలు విడుదల

100 పర్సంటైల్ సాధించిన 10 మంది తెలుగు విద్యార్థులు

3

## జాగృతి...ఆకృతిపై వ్యూహాలు

కీలక నేతలతో కవిత వరుస సమావేశాలు

ఒకవైపు భేటీలు..మరోవైపు చేరికలు



హైదరాబాద్,ఏప్రిల్ 20(మనం,ప్రత్యేక ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో పురుడుపోసుకోనున్న కొత్త పార్టీ విధి విధానాలపై కల్వకుంట్ల కవిత కీలక నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఒకవైపు చేరికలు, మరోవైపు నేతలతో భేటిలతో కవిత సరికొత్త రాజకీయ వ్యూహాలతో

...మిగతా 2లో

## ఉధంపూర్ వద్ద లోయలో పడ్డ బస్సు 21 మంది మృతి

మరో 20 మందికి గాయాలు



9

## మలి విడత శాంతి చర్చలకు రావడం లేదు

అమెరికా వైఖరి వల్లనే.. అని ఇరాన్ వెల్లడి

ప్రతీకారం తీర్చుకుని తీరుతామని ఐఆర్‌జీసీ ప్రకటన



టెహ్రాన్, ఏప్రిల్ 20: ఇస్లామాబాద్ వేదికగా నిర్వహించ తలపెట్టిన మలివిడత శాంతి చర్చలకు తాము హాజరు కావడం లేదని ఇరాన్ వెల్లడించింది. కాల్పుల విరమణ ఒప్పందం గడువు ముగిసే లోపు అమెరికా-ఇరాన్ మధ్య ఇస్లామాబాద్ వేదికగా శాంతి నెలకొంటుందని చాలా దేశాలు భావించాయి. అయితే ప్రపంచ దేశాల ఆశలు ఫలించలేదు. అమెరికా వైఖరి కారణంగానే శాంతి చర్చలకు వెళ్లడం లేదని టెహ్రాన్ పేర్కొంది. ఇరాన్ జెండాతో

...మిగతా 2లో

### ఐఆర్జీసీ నాయకుల చేతుల్లోకి ఇరాన్

పరిపాలనను.. యుద్ధాన్ని వారే నడిపిస్తున్నారు

అమెరికాకు మరింత గడ్డు కాలం

2

## జపాన్లో భూకంపం.. సునామీ హెచ్చరికలు జారీ

టోక్యో, ఏప్రిల్ 20: జపాన్ ఉత్తర తీరంలో రిక్టర్ 7.4 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంతంలో మూడు మీటర్ల (10 అడుగులు) మేర అలలు ఎగసి పడొచ్చని జపాన్ మెట్రోలాజికల్ ఏజెన్సీ వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 4.54 గంటలకు ఉత్తర జపాన్లో సన్రికు ప్రాంతంలో భూంకంపం సంభవించింది. సముద్రమట్టం నుంచి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. దీంతో తీర ప్రాంత ప్రజలకు



...మిగతా 2లో

## పాపం.. ట్రంపునకు అన్నీ చెప్పడం లేదట

ఇరాన్‌లో ఆర్మీ ఆపరేషన్‌కు ఆయన్ను దూరంగా ఉంచిన సైనికాధికారులు

వాషింగ్టన్, ఏప్రిల్ 20: ఆయన దేశాధ్యక్షుడు.. సైనిక బలగాలకు సుప్రీం కమాండర్ ఆయనే.. అయినా, ఆయనకు తెలియకుండానే సైనికాధికారులు కొన్ని యుద్ధ కార్యకలాపాలు చేపడుతున్నారట. ఈ విచిత్ర పరిస్థితి ఎదురయ్యింది ట్రంపు గారికే..నట. ఆయన వైఖరి వల్లనే ఆయనకు కొన్ని రహస్యాలు తెలియజేయడం లేదని సమాచారం. ఇరాన్ భూభాగంలో ఇటీవల అమెరికా ఎయిర్మన్ రెస్క్యూ ఆపరేషన్ విషయంలో అధికారులు గోప్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో దేశాధ్యక్షుడు ట్రంప్‌నకూ అధికారులు పూర్తి వివరాలు వెల్లడించలేదని అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. ట్రంప్ గతంలో వ్యవహరించిన తీరును దృష్టిలో ఉంచుకొని వారు ఆయనకు పరిమిత సమాచారం మాత్రమే అందుబాటులో ఉంచారట. ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్ ఇరాన్ భూభాగంపై కూలడంతో అమెరికాకు కంటిమీద

...మిగతా 2లో

# కేసీఆర్.. నువ్వో నేనో తేల్చుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చినందుకు ప్రజా ప్రభుత్వం పోవాల్నా, ఒక్కాయనకు పదవి రాకపోతే ప్రజా ప్రభుత్వం పోవాల్నా ? నేరెళ్లలో ఎస్సీలను ఇసుక లారీలతో తొక్కించినందుకు పాపాల భైరవుడు మళ్లీ రావాల్నా ? అని ప్రశ్నించారు. వాస్తు బాగా లేదని బాగున్న సచివాలయం కూల్చి కొత్తగా కట్టుకున్నరు. బిడ్డ, కొడుకు, తండ్రి ఇలా తలో ఫామ్‌హౌస్ కట్టుకున్నరు. పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలనే ఆలోచన ఏనాడైనా వచ్చిందా ? పేదలు దొరల గడీల ముందు ఊడిగం చేస్తూ అలాగే ఉండాలని భావించారని విమర్శించారు. పేదలు కట్టుకోవడానికి పనికిరాన్ని బతుకమ్మ చీరలు పంచారనీ, వేములవాడకు రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించి పదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. కరీంనగర్‌లో ఒక మాదిగ బిడ్డ అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి ఇస్తే ఓర్వలేక జీవన్ రెడ్డి పార్టీ మారారని దుయ్యబట్టారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్న భ్రమల్లో కేసీఆర్ ఉన్నారనీ, ఆ కుటుంబాన్ని ఎప్పటికీ అధికారంలోకి రానివ్వనని శపథం చేశారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గోరీ కట్టామనీ, 2029లోనూ అదే పునరావృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి, డి.శ్రీనివాస్ కలిసి కాంగ్రెస్‌ను ఎలా అధికారంలోకి తెచ్చారో...ఇప్పుడు నేను, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కలిసి రెండోసారి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# మలి విడత శాంతి చర్చలకు రావడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న వాణిజ్య నౌక తౌస్కాను అమెరికా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. నౌకపై తొలుత కాల్పులు జరిపి ఆపై అదుపులోకి తీసుకున్నాయి.అమెరికా తమ నౌకను స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్యను ఇరాన్ పై దాడిగా భావిస్తూ త్వరలోనే ప్రతీకారం తీసుకుంటామని హెచ్చరించింది. అమెరికా చర్యలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, ఇస్లామాబాద్లో మలి విడత చర్చలకు రావడం లేదని ఇరాన్ తెలిపింది. అలాగే ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా దిగ్బంధనం కొనసాగించడం, శాంతి చర్చల నేపథ్యంలో అగ్రరాజ్యం పెట్టిన డిమాండ్లు కూడా ఇరాన్ కు రుచించడం లేదు. ఈ నేపథ్యంలో రెండో దఫా శాంతి చర్చలు ప్రారంభం కాకుండానే విఫలమైనట్లు కనిపిస్తోంది.

**అమెరికాకు ఇరాన్ హెచ్చరిక..**

కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటి నుంచి దాన్ని అమెరికా ఉల్లంఘిస్తూనే ఉందని విదేశాంగ శాఖ అధికారప్రతినిధి ఇస్మాయిల్ పేర్కొన్నారు. హర్మూజ్ వద్ద నౌకలను దిగ్బంధించడం, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి ఇరాన్కు చెందిన కార్గో షిప్పు పట్టుకోవడం వంటి ఉదంతాలను ప్రస్తావించారు. ఒకవేళ అమెరికా దుందుడుకు చర్యలకు పాల్పడితే అదే స్థాయిలో తమ నుంచి బదులుంటుందని హెచ్చరించారు. మరోవైపు రెండో విడత చర్చల కోసం ఇప్పటికే తమ ప్రతినిధులను పాకిస్థాన్ పంపిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. బుధవారంతో కాల్పుల విరమణ ఒప్పందం ముగియనున్న వేళ ఇరాన్ నుంచి ఈ ప్రకటన రావడంతో జరగబోయే పరిణామాల పట్ల ఉత్కంఠ నెలకొన్నది. న్తో శాంతి చర్చలకు హర్మూజ్ దిగ్బంధనం అడ్డంకిగా మారిన వేళ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దీనిపై తన నిర్ణయం వెనక్కి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. శాంతి చర్చలకు హర్మూజ్ వద్ద అమెరికా దిగ్బంధనం విఘాతం కలిగిస్తోందని పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్ మార్షల్ అసిమ్ మునీర్ ట్రంప్నకు ఫోన్లో తెలిపినట్లు పలు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీంతో ఈ అంశాన్ని అధ్యక్షుడు పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.



## ఆమె సహకారం, ఆప్యాయత వల్లే..

### తన సతీమణి భువనేశ్వరితో కలిసి పుట్టిన రోజు కేక్ కట్ చేసిన చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 20:** ఏపీ సీఎం చంద్రబాబు తన పుట్టిన రోజు సందర్భంగా సతీమణి భువనేశ్వరితో కలిసి కేక్ కట్ చేశారు. 'జీవితంలో మరో ఏడాది పూర్తి చేసుకుంటున్న వేళ.. ఎప్పటికీ అండగా నిలిచే జీవిత భాగస్వామితో కలిసి నా ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటున్నా. ఆమె సహకారం, ఆప్యాయత వల్లే జీవితం మరింత అర్థవంతంగా మారుతోంది' అని చంద్రబాబు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

భారత్లో డోపింగ్ సమస్య తీవ్రం..

## కేటగిరీ బీ నుంచి ఏ కేటగిరీకి మారిన వైనం

### జాగ్రత్త అంటూ హెచ్చరించిన వరల్డ్ యాంటి డోపింగ్ ఏజెన్సీ

**ఢిల్లీ, ఏప్రిల్ 20:** డోపింగ్ సమస్య తీవ్రంగా ఉన్న దేశాల జాబితాలోకి భారత్ చేరిందని అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ) సోమవారం తెలిపింది. ఇప్పటి దాకా కేటగిరీ బిలో ఉన్న భారత్ కేటగిరీ ఎకు మారిందని వివరించింది. ఇండియా ఈ జాబితాలోకి చేరడంతో ఇక నుంచి భారత అథ్లెట్లు మరింత కఠినమైన డోపింగ్ నిరోధక నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. కేటగిరీ-ఎలో రష్యా, బెలారస్, ఇథియోపియా, కెన్యా, నైజీరియా, ఉక్రెయిన్ వంటి దేశాలున్నాయి. అథ్లెటిక్స్ అత్యధిక డోపింగ్ ఉల్లంఘనల విషయంలో భారత్ గత మూడేళ్లలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిందని ఏఐయూ తెలిపింది. 'భారత్ లో డోపింగ్ పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉంది. డొమెస్టిక్ డోపింగ్ నిరోధక కార్యక్రమం డోపింగ్ ముప్పు స్థాయికి తగినట్లుగా లేదు. దేశంలో డోపింగ్ వ్యతిరేక సంస్కరణల కోసం అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) కృషి చేసినప్పటికీ తగినంత మార్పు రాలేదు. అథ్లెటిక్స్ సమగ్రతను పరిరక్షించే సంస్కరణలను సాధించేందుకు కేటగిరీ-ఎలో ఉన్న ఇతర దేశాల ఫెడరేషన్లతో వ్యవహరించిన రీతిలోనే ఏఐయూ ఇప్పుడు ఏఎఫ్ఐతో కలిసి పనిచేస్తుంది' అని ఏఐయూ చైర్మన్ డేవిడ్ హౌమన్ తెలిపారు. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) అధ్యక్షుడు విటోల్ బాంకా ఇటీవల ఢిల్లీలో పర్యటించారు. 'నిషేధిత ఉత్ప్రేరకాలు, స్టెరాయిడ్ల ఉత్పత్తి భారత్లో అధికంగా ఉంది. ఇదొక తీవ్రమైన సమస్య. దీనిని ఎవరూ ఉపేక్షించడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జరుగుతున్న కృషి సత్ఫలితాలను ఇస్తుందని నమ్ముతున్నా''అని విటోల్ చెప్పారు.

## కాళేశ్వరం ప్రాజెక్టునూ వదలం..

# దోషులనూ వదలం



(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత స్థితిగతులు, పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్యారేజ్ మరమ్మత్తు పనులు ఎంతవరకు వచ్చాయి ? వర్షాకాలం లోపు చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు భద్రత, భవిష్యత్తు కార్యాచరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాలలతో ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయాలని 1975లో నాటి సీఎం జలగం వెంగళరావు ఆనాటి మహారాష్ట్ర సీఎంతో ఒప్పందం చేసుకున్నారనీ, ఆ తరువాత వైఎస్ హయాంలో 2009లో రూ.38,063 కోట్లతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులు మొదలు పెట్టారని గుర్తు చేశారు. అయితే, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు ఆర్థిక, రాజకీయ ప్రయోజనం లేదని కేసీఆర్ రీ డిజైనింగ్ పేరుతో పేరు, ఊరు మార్చారనీ, అంచనాలను రూ.లక్షా 50 వేల కోట్లకు పెంచారని విమర్శించారు. 2016లో ప్రారంభించిన మేడిగడ్డను 2019లో పూర్తి చేశామని ప్రారంభించారనీ, ఇది అద్భుతమని భ్రమలు కల్పించి 2018 ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందారని పేర్కొన్నారు. 2023లో మేడిగడ్డ కుప్పకూలితే దానిని దాచిపెట్టి 2023 ఎన్నికల్లో ప్రయోజనం పొందాలనుకున్నారనీ, అయినా దాచినా దాగని నిజాలను ప్రకృతి బయటపెట్టిందన్నారు.

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే నవంబర్ 1న ఎన్డీఎస్ఏ ప్రాథమిక రిపోర్టును పట్టించుకోలేదనీ, ఈ దోపిడీపై పీసీ ఘోష్ కమిటీ సంపూర్ణ నివేదిక ఇచ్చిందన్నారు. కాళేశ్వరంలో దోషులను వదిలేది లేదు, దోషులను శిక్షించేందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకు వెళతాం. ప్రాజెక్టును కూడా ఊరికే వదలం రిపేర్లు చేసి నీరు అందిస్తామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఐఆర్జీసీ నాయకుల చేతుల్లోకి ఇరాన్

**టెహ్రాన్, ఏప్రిల్ 20:** అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తాబా ఖమేనీ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో దేశ నాయకత్వ బాధ్యతలు ఐఆర్జీసీ లోని అతివాదుల చేతుల్లోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ సైన్యాన్ని, దౌత్యపరమైన నిర్ణయాలను వారే నియంత్రిస్తున్నారని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఐఆర్జీసీ మేజర్ జనరల్ అహ్మద్ వహిద్, అతడి సన్నిహితులు కీలక పదవులను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ఈ క్రమంలో మితవాద నేతలు పాలన నుంచి పక్కకు జరిగారని రాసుకొచ్చింది. హర్మూజ్ను అమెరికా దిగ్బంధించిన నేపథ్యంలో వారాంతంలో ఈ మార్పు జరిగిందని తెలుస్తోంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వంటి మితవాదులను పక్కనపెట్టిన సూచనలు కనిపిస్తున్నాయని ఆ కథనం పేర్కొంది. శాంతిచర్చల వేళ హర్మూజ్ను తెరిచేందుకు అరాగ్చీ అంగీకరించారు. అయితే, ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనాన్ని ఎదుర్కోవడానికి హర్మూజ్ను మూసే ఉంచాలని ఐఆర్జీసీ భావిస్తోందని వాషింగ్టన్లోని ఇనిస్టిట్యూట్ ఫర్ ద స్టడీ ఆఫ్ వార్ అంచనాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు అహ్మద్ వహిద్కు సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మహమ్మద్ బఘేర్ నుంచి మద్దతు లభించిందని, అది ఆయన అధికారాన్ని సుస్థిరం చేసిందని తెలుస్తోంది. ఈ పరిణామం అమెరికాకు మరింత చేటు.. ఓటమి కలిగించే అవకాశాలున్నాయని యుద్ధ నిపుణులు చెబుతున్నారు.

## చిన్నారిని పీక్కుతిన్న ఊరకుక్కలు

**సుల్తానాబాద్, ఏప్రిల్ 20:** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో దారుణం చోటు చేసుకుంది. వీధికుక్కలు పీక్కుతినడంతో మూడేండ్ల చిన్నారి మృతి చెందింది. ఇంటిముందు ఆడుకుంటున్న దివ్యా బెహ్రా అనే బాలికపై కుక్కలు దాడి చేశాయి. పాపను నోట కరుచుకుని పొలాల్లోకి ఈడ్చుకెళ్లాయి. ఈక్రమంలో కుక్కలు పీక్కుతినడంతో తీవ్రగాయాలతో మృతి చెందింది. చిన్నారి తల్లిదండ్రులు ఒడిశా నుంచి వచ్చి ఇటుకబట్టీల్లో పనిచేస్తున్నారు.

## జపాన్లో భూకంపం.. సునామీ హెచ్చరికలు జారీ

(మొదటి పేజీ తరువాయి)

సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎత్తైన ప్రదేశాల్లోనే ఉండాలని అధికారులు పౌరులకు సూచించారు.

**పలు చోట్ల ఎగిసి పడ్డ అలలు..**

భూకంపం అనంతరం ఉత్తర జపాన్ తీర ప్రాంతంలో పలు చోట్ల చిన్న స్థాయిలో సునామీ అలలు ఎగిసిపడ్డాయి. ఇవాటే ప్రిఫెక్చర్లోని (రాష్ట్రం) కుజి పోర్ట్ వద్ద 80 సెంటీమీటర్ల ఎత్తులో సునామీ అలలు ఎగిసిపడినట్లు జపాన్ మీడియా వెల్లడించింది. మియాకో పోర్ట్లో 40 సెంటిమీటర్లు, మరికొన్ని పోర్టుల వద్ద 20-30 సెంటిమీటర్ల మేర అలలు ఎగిశాయి. ఇవాటే, హొక్కైడో, అమోరి ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు తెలియరాలేదు.



**మన దేశంపై ప్రభావం**

**ఉండదు: ఇంకాయిస్**

జపాన్లో భూకంపం కారణంగా జారీ చేసిన సునామీ హెచ్చరికల ప్రభావం మన దేశంపై ఉండబోదని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ వెల్లడించింది. సునామీ ఏర్పడిన కేంద్రం నుంచి 300 కిలోమీటర్ల వరకే దాని ప్రభావం ఉంటుందని తెలిపింది. సముద్ర మార్పులను గమనిస్తున్నామని, ఒకవేళ తీవ్రతలో మార్పులు వస్తే ప్రకటన విడుదల చేస్తామని ఇంకాయిస్ తెలియజేసింది.

# 4 ప్రధాన ప్రాజెక్టులకు స్పెషల్ ఆఫీసర్లు

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నది. రాష్ట్రంలోని నాలుగు ప్రధాన ప్రాజెక్టులైన కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకం, నాగార్జున సాగర్, శ్రీరాంసాగర్‌ను ఈ జాబితాలో చేర్చింది. ఆయా ప్రాజెక్టులకు ప్రత్యేకంగా ప్రభుత్వం ఒక సీఈని నియమించనుంది. ఈ అదికారులు ఆయా ప్రాజెక్టులకు సంబందించిన అంశాలు మెయిన్ కెనాల్స్, బ్రాంచ్ కెనాల్స్, పంప్ హౌస్‌లకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నిర్వహించాల్సి ఉంటుంది. అవసరం అనుకుంటే ప్రభుత్వానికి, సెంట్రల్ వాటర్ కమిషనర్‌ను వివరించాల్సి ఉంటుంది. దానికి అదనంగా లిఫ్టులకు ఇద్దరు డీఈఈలు, ఇద్దరు ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల ఏఈఈలనూ నియమించాలని పేర్కొంది. లిఫ్టుల ఆపరేషన్‌కు సంబంధించి ఆయా అధకారులకు సమగ్రమైన శిక్షణ ఇవ్వాలనీ ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, ఇరిగేషన్ శాఖలోని అధికార వ్యవస్థనూ ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించనుంది. ఈఎన్సీ జనరల్, ఈఎన్సీ అడ్మిన్‌ను యధావిధిగానే ఉంచి కొన్ని టెరిటోరియల్ ఈఎన్సీ పదవులను తొలగించడంతో పాటు మరికొన్ని విభాగాలకూ ఈఎన్సీలను నియమించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇక అంతర్రాష్ట్ర జల వివాదాలు అత్యంత కీలక దశలో ఉన్నందున దానినీ ఓ ప్రత్యేకమైన విభాగంగా మార్చాలని ప్రతిపాదించారు. డ్యాముల భద్రత, అంతర్రాష్ట్ర జల వివాదాలు, హైడ్రాలజీ సంబంధిత విభాగాలకు ఒక్కో ఈఎన్సీని ప్రభుత్వం నియమించనుంది. శాఖలోని ప్రధాన అంశాలను పై స్థాయి అధికారులు ప్రభుత్వానికి నివేదించేలా సెక్రటేరియట్‌లో అడిషనల్ సెక్రటరీ స్థాయి అధికారిని ఈఎన్సీగా నియమించాలన్న ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. అదే సమయంలో ఆపరేషన్ అండ్ మెయిటెనెన్స్‌కు ఈఎన్సీని తొలగించే ప్రతిపాదనలనూ ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వం ముందు పెట్టారు.

## పాపం.. ట్రంపునకు అన్నీ చెప్పడం లేదట

(మొదటి పేజీ తరువాయి)

కునుకులేకుండా పోయింది. ఒక పైలట్ను వెంటనే కాపాడినా.. అదే విమానంలో మరో పైలట్ (వెపన్ ఆఫీసర్) జాడ మాత్రం తెలియలేదు. ఇక ఆ సైనికుడిని కాపాడేందుకు అమెరికా భారీ ఆపరేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే. అమెరికా మిలిటరీ, నేషనల్ సెక్యూరిటీ అధికారులు 24 గంటలపాటు ఈ ఆపరేషన్ను నేరుగా పర్యవేక్షించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దాని వివరాలు ఆయనకు ఇచ్చినప్పటికీ.. అసలు అది ఎలా సాగుతోందనే దానిపై ప్రతి విషయాన్ని ఆయనకు క్షుణ్ణంగా తెలియజేయలేదట. ఆ వివరాల ఆధారంగా ట్రంప్ ఏవైనా మాటలు మాట్లాడితే, ఆపరేషన్కే ఎసరు తేవచ్చనే ఆందోళనతోనే ఆయనకు పరిమిత సమాచారమే ఇచ్చారు.

**గట్టిగా అరిచిన ట్రంప్..!**

ఆపరేషన్ను పర్యవేక్షించేవారు రెస్క్యూ బృందాలతో మాట్లాడాలి.. ఇరాన్ బలగాల కదలికలను గమనించాలి. పరిస్థితులు చేయిదాటితే ఎలా ఎదుర్కోవాలో అంచనా వేయాలి. మామూలుగా ఈ ప్రక్రియ అంతా జరిగే సిట్యుయేషన్ రూమ్లో అధ్యక్షుడి పర్యవేక్షణ ఉంటుంది. అయితే, ఇరాన్లో విమానం కూలడంతో ఆయన సహాయకులపై గట్టిగా కేకలు వేశారట. ఆ ఘటనపై ఆయన తీవ్ర ఆందోళన చెందారని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఇరాన్ భూభాగంలోకి వెళ్లి, ఆ సైనికుడిని తీసుకురావడం ఎంత క్లిష్టమైందో తెలిసినప్పటికీ.. వెంటనే అతడిని తీసుకురావాలని ఒత్తిడి తీసుకువచ్చారట. ఇది తన రాజకీయ జీవితంలో అతిపెద్ద విపత్తుగా మిగిలిపోతుందేమోనన్న భయం ట్రంపులో కనిపించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన అసహనం ఆపరేషన్ ప్లానింగ్నే దెబ్బతీయొచ్చని అధికారులు భావించారట.

దాంతో ఆపరేషన్ నిర్వహించే రూమ్కు ఆయన్ను కొన్ని గంటల పాటు దూరంగా ఉంచారట. ఫోన్లోనే ఆయనకు వివరాలు చెప్పారట. అయితే దానిని పర్యవేక్షించిన వారిలో ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, వైట్హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్, పెంటగాన్, నిఘా సంస్థల అధికారులు, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ స్టాఫ్ ఉన్నారు. ఇక ఆ రెండో సైనికుడిని కూడా కాపాడినట్లు సమాచారం ఇవ్వగానే ట్రంప్ దూకుడుగా సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. హర్మూజ్ గురించి ఇరాన్ను హెచ్చరిస్తూ అభ్యంతరకర భాష వాడిన సంగతి తెలిసిందే.

# ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఉద్యోగులకు బదిలీలు కల్పించినా, వారు ఆ విధులను పూర్తి చేసిన తరువాతనే కొత్త ప్రాంతాల్లో బాధ్యతలు చేపట్టేలా రిలీవింగ్ ఆప్షన్స్ ఇచ్చే లేదా వారిని బదిలీల నుంచి మినహాయించి తరువాత అవకాశం ఇవ్వాలా ? అనే యోచనలో ప్రభుత్వం ఉంది. జూన్ 9 నాటికి మొదటి దశ జనగణన ముగియనున్న నేపథ్యంలో ఈలోపే బదిలీల మార్గదర్శకాలను ప్రభుత్వం వెలువరించే అవకాశాలు ఉన్నాయి. ఎప్పటిలాగే బదిలీల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ప్రభుత్వం ఈసారి కఠినమైన మార్గదర్శకాలను రూపొందించనుంది. అయితే, రెండేళ్ల సర్వీసు కూడా పూర్తి కాని ఉద్యోగులను ఈ దఫా బదిలీ చేయరాదనీ, ఒకే కేడర్‌లో గరిష్టంగా 40 శాతానికి మించి బదిలీలు ఉండకూడదని ప్రభుత్వం భావిస్తోంది. మానవీయ కోణంలో పలు కేటగిరీలకు ఈ బదిలీల్లో పెద్దపీట వేయనున్నారు. ముఖ్యంగా స్పౌజ్ కేటగిరి, వితంతువు, 70 శాతానికి మించి దివ్యాంగులు, మానసిక సమస్యలున్న పిల్లల తల్లిదండ్రులకు ఈ బదిలీల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. అలాగే, క్యాన్సర్, న్యూరో సర్జరీ, కిడ్నీ లేదా లివర్ ట్రాన్స్‌ప్లాంట్, ఓపెన్ హార్ట్ సర్జరీ వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా పోస్టింగ్ ఇచ్చేలా ప్రభుత్వ నిబంధనలు ఉండనున్నాయి. కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆదేశాల ప్రకారం...2027 వరకు బదిలీలపై ఆంక్షలు ఉన్నప్పటికీ రాజ్యాంగబద్ధమైన విధులకు ఆటంకం కలుగకుండా రాష్ట్ర అవసరాల దృష్ట్యా ఈ వెసులుబాటు కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా కుటుంబ వివరాల నమోదు, ఇంటింటికీ వెళ్లి సమాచార సేకరణ వంటి కీలక బాధ్యతలు ఉన్నందున బదిలీ అయిన ఉద్యోగులు ఆయా జిల్లాల్లోనే తమ విధులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది.

# జాగృతి...ఆకృతిపై వ్యూహాలు

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు సాగుతోంది. కవిత పార్టీతో తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలున్నాయని రాజకీయ పండితులు సైతం జోస్యం చెబుతున్నారు.

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించడానికి ముహూర్తం ఖరారు చేయడంతో, రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాల నేతలు ఆమె వైపు మొగ్గు చూపుతున్నారు.ఇటీవల కాలంలో తెలంగాణ జాగృతిలోకి వివిధ పార్టీరటీలకు చెందిన కీలక నేతలు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. తాజాగా తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ సహకార సంఘం అధ్యక్షుడు తాటికొండ శ్రీనివాసచారి తన అనుచరులతో కలిసి సోమవారం తెలంగాణ జాగృతిలో చేరారు.

అలాగే మెదక్ జెడ్పీ మాజీ చైర్మన్ చేరికమెదక్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బాలయ్య తన అనుచరులతో కలిసి తెలంగాణ జాగృతి లో చేరారు. తెలంగాణ డిజిటల్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు అరుణ్ కుమార్ సహా పలువురు ఇండిపెండెంట్ జర్నలిస్టులు జాగృతిలో చేరారు. దళిత జస్టిస్ ఫోరం చైర్మన్ మేడి నరేశ్, బతుకమ్మ పార్టీ అధ్యక్షుడు కె. మణిపాల్ రెడ్డి తమ అనుచరులతో కలిసి జాగృతిలో చేరారు.ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో కల్వకుంట్ల కవిత వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ..



సామాజిక వర్గాల ఆశయాల సాధనే లక్ష్యంగా తమ ప్రయాణం సాగుతుందని పేర్కొన్నారు.తెలంగాణ జాగృతిని అన్ని వర్గాల వారు ఆదరించే విధంగా తీర్చిదిద్దుతామన్నారు.

**జెండా...అజెండ:**

ఈనెల 25న మేడ్చల్ జిల్లా మునీరాబాద్లో జరగనున్న భారీ బహిరంగ సభలో కవిత తన కొత్త రాజకీయ పార్టీ పేరు, జెండా, విధివిధానాలను ప్రకటించనున్నారు. పార్టీ ఆవిర్భావానికి సమయం దగ్గర పడుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా అనూహ్యంగా నేతల చేరికలు ఊపందుకున్నాయి. ఇటీవల బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కూడా జాగృతిలో చేరి పార్టీ బలోపేతానికి కట్టుబడి ఉంటానని ప్రకటించారు.

కొత్త పార్టీలో యువతకు, మహిళలకు పెద్దపీట వేయబోతున్నట్లు కవిత ఇప్పటికే స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీ అవసరం ఉందని, ఆ లోటును జాగృతి భర్తీ చేస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ చేరికలతో తెలంగాణ రాజకీయాల్లో కవిత కొత్త పార్టీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఏప్రిల్ 25న జరగబోయే సభలో కవిత తన రాజకీయ వ్యూహాన్ని ఆవిష్కరించనుండటంతో రాజకీయ వర్గాలలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# కేసీఆర్ చావాలని ఆ ఎదవలంటే నేను చస్తనా?



(మొదటి పేజీ తరువాయి)

చావాలంటే కేసీఆర్ ఛస్తాడా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో చేశామని తెలిపారు. చెరువులను బందోబస్తు చేస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని మిషన్ కాకతీయ చేపట్టామని పేర్కొన్నారు. రైతులు కూడా ఒక ఉద్యమంలా ఇందులో పాల్గొన్నారు. అక్కడి నుంచి మొదలుపెడితే పదేళ్లలో ఎన్నో చేశామని తెలిపారు. వట్టి మాటలు, గప్పాలు కొట్టుడు కాకుండా ఎన్నో చేశామని తెలిపారు. ఈ ఐదేళ్లలో మిషన్ భగీరథ కంప్లీట్ చేసి, ప్రతి ఇంటికి నల్లా పెట్టి మంచి నీళ్లు ఇవ్వకపోతే వచ్చే ఎన్నికల్లో నిలబడం, ఓట్లు అడగమని శాసనసభలో నిలబడి చెప్పిన ముఖ్యమంత్రి ఉన్నారా అని అడిగారు. నేను చెప్పి.. ఐదేళ్లలో మిషన్ భగీరథ నీళ్లు తెచ్చి మారుమూల పల్లెల్లకు కూడా నీళ్లు ఇచ్చామని చెప్పారు. ఐదేళ్లు మిషన్ భగీరథ నీళ్లు పుష్కలంగా వచ్చాయని తెలిపారు. మరి ఇప్పుడు ఏం రోగం పుట్టిందని ప్రశ్నించారు. నీళ్లు రావాలంటే.. లాగులు పలిగేదాకా సంపాలని సూచించారు. మంచి మాటకు కాకపోతే అంతే చేయాలన్నారు. 75 ఏళ్లు వచ్చాయంటే నడవడదని జీవన్ రెడ్డిని ఉద్దేశించి కేసీఆర్ అన్నారు. మీకు ఇప్పుడు 50 ఏళ్లే.. ఇప్పుడు మీ వయసు 25 ఏళ్లు తగ్గిపోయిందని అన్నారు. యువకునిలా, అంతటి ఉత్సాహంతో ముందుకు దూసుకుపోదామని సూచించారు.

**చేరగానే జీవన్ రెడ్డికి బీఆర్ఎస్‌లో కీలక పదవి...**

జగిత్యాల సభ నుంచి కేసీఆర్ కీలక ప్రకటన చేశారు. జీవన్ రెడ్డి రాకతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీలో సరికొత్త ఉత్సాహం వచ్చిందని కేసీఆర్ వెల్లడించారు. కేవలం జగిత్యాలకు మాత్రమే పరిమితం కాకుండా.. తెలంగాణ రాజకీయాలపై అవగాహన, పట్టు ఉన్నాయని ప్రశంసలు గుప్పించిన కేసీఆర్.. పార్టీలో చేరగానే జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఇతర జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆయన సేవలు వినియోగించుకుంటామని కేసీఆర్ స్పష్టం చేశారు.

ఇక ఈ సందర్భంగా జీవన్ రెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. జీవన్ రెడ్డి వ్యక్తిత్వాన్ని కేసీఆర్ కొనియాడారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వదిలేసి.. బీఆర్ఎస్ పార్టీలో చేరాలని తీసుకున్న నిర్ణయం.. గుండె ధైర్యంతో కూడిన నిర్ణయమని కేసీఆర్ పేర్కొన్నారు. తన సొంత లాభం కోసం కాకుండా.. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని భావించి ఆయన బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. తాను, జీవన్ రెడ్డి గత 45 ఏళ్లుగా స్నేహితులమని గుర్తు చేసుకున్నారు. రాజకీయంగా వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ.. తమ మధ్య స్నేహం మాత్రం చెడిపోలేదని వెల్లడించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ.. తాము కలిసే ఉన్నామని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. మరోవైపు.. చాలా రోజుల తర్వాత సభ నిర్వహించిన కేసీఆర్‌ను చూసి గులాబీ శ్రేణులు, అభిమానుల్లో సరికొత్త జోష్ నెలకొంది. సీఎం, సీఎం అంటూ నినాదాలతో సభా ప్రాంగణాన్ని మొత్తం హోరెత్తించారు. కార్యకర్తలు, ఫ్యాన్స్ ఉత్సాహం చూసి.. తనదైన సెటైర్లు, పంచ్‌లతో పాత కేసీఆర్‌ను గుర్తు చేశారు.

**నా ఉసురు పోసుకున్నరు?.. ప్రజా ఆశీర్వాద సభలో జీవన్ రెడ్డి..**

జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఇన్నేళ్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని తెలిపారు. కానీ, 20 మాసాలు నా ఉసురుపోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకాలం ఈ మానసిక క్షోభ భరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ బలోపేతానికి నాలుగు దశబ్దాలు పోరాడితే చివరకు దక్కింది ఏంటి.. నా జీవితం చివరి దశలో ఈ మానసిక్ష క్షోభ ఏంటని భావోద్వేగానికి గురయ్యారు. ఈ సమయంలో కేసీఆర్ నాకు చెయ్యిందించి అండగా ఉన్నారని తెలిపారు.

నా ప్రజా జీవితంలో ఇది ఒక మలుపుగా భావిస్తున్నానని రెడ్డి తెలిపారు. మీ అందరి అండదండలతో ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చూపెట్టిన వివక్షతో బీఆర్ఎస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. నేనేదో ఆశించి పార్టీ మారలేదని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల్లో ఎన్నో పదవులు చూశానని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని వీడాలని ఉద్దేశంతోనే పార్టీలో చేరానని చెప్పారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టిందని అన్నారు. కేసీఆర్ కల్యాణలక్ష్మీ పేరుతో రూ. లక్ష ఆర్థిక సాయం చేస్తే?... కాంగ్రెస్ రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి, ఉన్న పథకాన్నే ఊడగొట్టే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్ ఈరోజు జగిత్యాలకు వస్తున్నారని తెలిసి, నిన్నటి వరకు నిద్రపోయిన రేవంత్ రెడ్డి..ఇదేరోజు మేడిగడ్డకు వచ్చారని విమర్శించారు.

ఎస్ఎల్‌బీసీ నిర్మాణ దశలో కుంగిపోతే 8 మంది కార్మికుల శవాలను కూడా వెలికి తీయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కూలినందుకు ఎంతో రాద్దాంతం చేశారని, మరి దానిని ఎందుకు బాగు చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని తెలిపారు. బోర్నపల్లి నిర్మాణానికి రూ.70 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాను చేసిన ఘనత కేసీఆర్‌దేనని ఆయన కొనియాడారు. కేసీఆర్ జగిత్యాలకు మెడికల్ కాలేజీ ఇచ్చారని తెలిపారు. వైద్య సేవలను విస్తరించారని పేర్కొన్నారు. గురుకుల ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేశారని చెప్పారు. గిరిజనులకు రిజర్వేషన్లను కూడా పెంచారని అన్నారు. చివరి శ్వాస దాకా తెలంగాణకు సేవ చే(స్తానని) నాతో పాటు ప్రతి కార్యకర్త కూడా సేవ చేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

# హిందువులు మౌనం వీడాలి

## సనాతన ధర్మం గొప్పతనాన్ని చాటి చెప్పాలి

## ప్రముఖ జర్నలిస్ట్ అమోఘ్ దేశపతి పిలుపు

**హైదరాబాద్, మనం బ్యూరో** : హిందువులు ఐక్యం కాకపోతే, మౌనం వీడకపోతే భవిష్యత్తులో ప్రమాద కర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రముఖ జర్నలిస్ట్ అమోఘ్ దేశపతి పిలుపునిచ్చారు. సనాతన ధర్మం గొప్పదనీ, దాన్ని కాపాడటంలో కులవర్గ విభేదాలను అతీతంగా హిందూ సమాజం ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్‌ను స్థాపించి 100 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం నాగోల్‌లో నిర్వహించిన హిందూ సమ్మేళనం సభకు ముఖ్య అతిధిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం ఇంట్లో మాత్రమేననీ, బయటకు వస్తే మనమంతా హిందువులమేననే భావనను ఈ వేదికల ద్వారా చాటి చెప్పాలన్నారు. రాజకీయ పార్టీలు, కొందరు కుహనా మేధావులు మైనార్టీలకు పరోక్ష సహకారం అందిస్తూ హిందువులను అణచివేసే చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కారణంగా దేశవ్యాప్తంగా అనేక చోట్ల హిందువులపై ప్రతీ రోజూ దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మహిళా వక్త చీకొంటి రమ్యకృష్ణ అలియాస్ రచ్చ రాములమ్మ మాట్లాడుతూ సనాతన ధర్మానికి పుట్టిల్లైన భారత దేశంలో హిందువులపై అరాచకాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బానిసత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారడంతో హిందువులు మారడంతో ఈ పరిస్థితులు నెలకొంటున్నాయనీ, స్వాతంత్రం సిద్ధించి ఇన్నేళ్లయినా, ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నా హిందువుల్లో బానిసత్వం పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని అనేక కంపెనీలు హిందూ మహిళల పట్ల అనాగరికంగా వ్యవహరిస్తునానయనీ, లవ్ జిహాద్ విషయంలో అమ్మాయిలు, వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సభలో హైకోర్టు సీనియర్ న్యాయవాది కరుణాసాగర్, కాలంశెట్టి హరిబాబు, కార్యదర్శి సంజయ్ శర్మ, నవీన్‌కుమార్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, సునీల్ కుమార్ శర్మ, చంద్రశేఖర్ లయ తదితర నేతలు పాల్గొన్నారు.

# పేరు ఆదర్శం..
# తీరు అధ్వాన్నం





## మైనర్ బాలికలపై 'అజాద్' అఘాయిత్యం

## ఇన్‌స్టాలో మైనర్‌లకు వలపుల వల

## అజాద్ అలియాస్ అర్జున్ అరెస్ట్

## నిందితుని ఖాతాలో 20 మంది బాధితులు

**హైదరాబాద్,ఏప్రిల్ 20(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రెండేళ్ల వ్యవధిలో 20మంది మైనర్ బాలికలను వంచించిన కామాంధుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని మియాపూర్ పరిధిలో నివాసముంటున్న కోడూరి చంద్రశేఖర్ ఆజాద్ అలియాస్ అర్జున్‌ను బాధితులు తెలుగురాష్ట్రాలలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పవిత్రమైన పేరు పెట్టుకుని సోషల్ మీడియా వేదికగా బాలికల జీవితాలలో చెలగాటమాడుతున్న అజాద్ ఇదివరకే పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు నిందితుడు ఆజాద్ నగరంలోని జూబ్లీహిల్స్‌లో నివసించే 15 ఏళ్ల బాలికను ఇన్‌స్టా గ్రామ్ ద్వారా అర్జున్ అనే మారు పేరుతో పరిచయం చేసుకున్నాడు. సదరు బాలికలను తాను సంపన్న కుంటుంబానికి చెందిన వాడినంటూ లోబరుచుకున్నాడు. తరచూ రాత్రివేళల్లో సదరు బాలిక ఇంటికెళ్లి ఏకాంతంగా కలిసే క్రమంలో బాలిక తల్లి గుర్తించింది. దీంతో ఆజాద్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితునిపై పోక్సో కేసు పెట్టిన పోలీసులు జైలుకు పంపారు. ఈ నేపథ్యంలో జైలు నుంచి బయటకు వచ్చాక నిందితుడు బాలికను బెదిరించడం ప్రారంభించాడు. తనకు పెద్ద ఎత్తున నగదు కావాలని, లేదంటే తనతో గడిపిన వీడియోలను బయటపెడతానని వేధింపులకు గురిచేశాడు. దీంతో నిందితుడి బెదిరింపులకు భయపడి ఆ బాలిక తన ఇంట్లో ఉన్న రూ. 29 లక్షల నగదును చోరీ చేసింది. ఇందులో నిందితుడు ఆజాద్‌కు రూ. 13 లక్షలు ఇచ్చింది. అయితే ఈ విషయం తెలిసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన ఆ ఇంటి కారు డ్రైవర్ భార్యకు రూ. 10 లక్షలు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అజాద్‌తో పాటు కారు డ్రైవర్ భార్య సరస్వతిని అరెస్ట్ చేసి రిమండ్‌కు తరలించారు.

**గతంలోనూ :**

సోషల్ మీడియా వేదికగా నిందితుడు ఆజాద్ మైనర్ బాలికలతో పరిచయం పెంచుకుని ఆపై ప్రేమ పేరుతో వారిని వంచించినట్లు పోలీసుల విచారణలో తేలింది. వారిని నమ్మించి లొంగదీసుకుని రహస్యంగా ఫొటోలు, వీడియోలు తీసి బెదిరిస్తూ ఏకంగా రూ.లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. కాగా నిందితుడు ఆజాద్ తెలుగు రాష్ట్రాల్లో రెండేళ్ల వ్యవధిలో 20 మందికి పైగా యువతులు, బాలికలను మోసం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. గతంలోనూ బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. నార్సింగి ప్రాంతానికి చెందిన మరో యువతిని కూడా నిందితుడు ఆజాద్ మోసం చేశాడు. గుంటూరులోని కాలేజీలో చేరేందుకు వెళ్లిన ఆమెను హోటల్ గదికి తీసుకెళ్లి శారీరకంగా లోబరుచుకున్నాడు. గుంటూరు, హైదరాబాద్‌లో పలుమార్లు ఇద్దరూ పబ్లు, హోటళ్లకు విచ్చలవిడిగా తిరిగారు. ఆ ఫొటోలు, వీడియోలను చూపించి, ఆపై బెదిరించి నిందితుడు ఆమె నుంచి బంగారు గొలుసు కాజేయడంతో విషయం వెలుగుచూసింది. మరో ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు కేసును నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం మియాపూర్‌లో నివసిస్తున్న ఆజాద్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం చామల్లమూడి గ్రామమని పోలీసులు తెలిపారు.

**ఖరీదైన కలరింగ్ :**

మైనర్ బాలికలకు వలపు వల విసిరే నిందితుడు అజాద్ హైదరాబాద్, పరిసరాల్లోని సంపన్నుల ఇళ్లలో వాచ్‌మెన్, తోటమాలితో పరిచయం పెంచుకుంటాడు. అనంతరం ఆయా ఇళ్లల్లోని బాలికలు, యువతుల వివరాలను పూర్తిగా తెలుసుకుంటాడు. . బాలికల వివరాలు తెలుసుకున్న తర్వాత సోషల్ మీడియాలో వారిని అనుసరిస్తాడు. ఇందులో సంపన్న కుంటుంబాలకు చెందిన అమ్మాయిలను కావాలనే ఎంచుకుని వారితో చాటింగ్ చేస్తూ దగ్గరవుతాడు. ఖరీదైన కార్లు, పబ్‌లలో తాను దిగిన ఫొటోలు వారిని ఆన్‌లైన్‌లో పంపించి నమ్మించేవాడు. ఈ నేపథ్యంలో ప్రేమ పేరుతో వారిని వంచించి ఆయా యువతులను లోబరుచుకునే పన్నాగాలు చేసేవాడు. తర్వాత వారి ఫొటోలు, వీడియోలు చూపించి డబ్బు డిమాండ్ చేసేవాడు. ఆ భయంతోనే కొందరు బాలికలు, యువతులు తమ ఇళ్లల్లోనే డబ్బు, బంగారు ఆభరణాలు దొంగిలించి నిందితుడు ఆజాద్‌కు ఇచ్చినట్లు పోలీసులు విచారణలో తేలింది. కాగా పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల సోషల్ మీడియా వినియోగంపై ఓ కన్నేసి ఉంచాలని పోలీసులు సూచిస్తున్నారు. వారి ప్రవర్తనలో ఏదైనా తేడా అనిపిస్తే వెంటనే ఆరా తీయాలని చెబుతున్నారు. ఈజీ మనీకి అలవాటు పడి చాలా మంది కేటుగాళ్లు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారని.. ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

# జేఈఈ మెయిన్ 2026
# సెషన్-2 ఫలితాలు విడుదల

## 100 పర్సంటైల్ సాధించిన 10 మంది తెలుగు విద్యార్థులు

**హైదరాబాద్, మనం ప్రతినిధి** : దేశ వ్యాప్తంగా ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ 2026 సెషన్-2 తుది విడత ఫలితాలు విడుదలయ్యాయి. జాతీయ పరీక్షా సంస్థ (ఎన్‌టీఏ) సోమవారం సాయంత్రం ఈ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రభంజనం సృష్టించారు. దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన 26 మందిలో 10 మంది తెలుగు విద్యార్థులే ఉండటం విశేషం. ఎన్‌టీఏ సోమవారం మధ్యాహ్నం ఫైనల్ ఆన్సర్ కీని విడుదల చేసి, సాయంత్రానికి ఫలితాలను ప్రకటించింది. విద్యార్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్ వివరాలతో వెబ్‌సైట్‌లో స్కోర్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

100 పర్సంటైల్ సాధించిన తెలుగు విద్యార్థులు వీరే... మంతా శివ కామేశ్ (తెలంగాణ), డి. భవితేష్ రెడ్డి (తెలంగాణ), సాయి రిత్విక్ రెడ్డి (తెలంగాణ),వివాన్ శరద్ మహేశ్వరీ (తెలంగాణ), జొన్నల రోషన్ మణిదీప్ రెడ్డి (ఏపీ),నరేంద్ర బాబుగారి మహిత్ (ఏపీ), తుంగ దుర్గ సుప్రభాత్ (ఏపీ), పసల మోహిత్ (ఏపీ), బిజ్జం వెంకట చంద్ర శేఖర్ రెడ్డి (ఏపీ)లున్నారు.

# కేసీఆర్ సభకు హరీశ్ డుమ్మా

## కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఢిల్లీకి పయనం

**హైదరాబాద్, మనం ప్రతినిధి** : చాలా రోజుల విరామం తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ ప్రజల్లోకి వచ్చారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఆయన సోమవారం జగిత్యాలలో నిర్వహించిన 'బీఆర్ఎస్ ఆశీర్వాద సభ'లో పాల్గొన్నారు. ఇందుకోసం సాయంత్రం ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి ఆయన బయలుదేరనున్నారు. అయితే, పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ సభకు కీలక నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గైర్హాజరు కావడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ ముఖ్య నేతలంతా జగిత్యాల సభ ఏర్పాట్లలో నిమగ్నమై ఉండగా, హరీశ్ రావు మాత్రం పార్టీ నేతలు బి. వినోద్ కుమార్, వద్దిరాజు రవిచంద్రతో కలిసి హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కేసీఆర్ సభ జరుగుతున్న రోజే ఈ కీలక నేతలు ఢిల్లీకి వెళ్లడం వెనుక బలమైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రెండు కీలకమైన న్యాయపరమైన అంశాలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చించేందుకే ఈ పర్యటన చేపట్టినట్లు పార్టీ వర్గాల సమాచారం.

ఇదిలాఉంటే, కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ పూర్తిచేసిన ధర్మాసనం, ఈ నెల 22న (రేపు)తుది తీర్పును వెలువరించనుంది. ఒకవేళ తీర్పు ప్రతికూలంగా వస్తే వెంటనే సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ముందస్తుగా న్యాయవాదులతో మంతనాలు జరిపేందుకు హరీశ్ రావు బృందం ఢిల్లీకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇక, దీంతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో స్పీకర్ తీర్పు అనంతరం చేపట్టాల్సిన న్యాయపరమైన కార్యాచరణపై కూడా ఈ పర్యటనలో చర్చిస్తున్నట్లు సమాచారం. ఓవైపు కేసీఆర్ బహిరంగ సభ ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తుండగా, మరోవైపు కీలక నేతలు న్యాయపోరాటాలకు సిద్ధం కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జగిత్యాల సభను విజయవంతంకై కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సైతం భారీ జన సమీకరణ చేసి మరి సభను సక్సెస్ చేశారు.

# చిప్స్ నుంచి షిప్స్ వరకు భాగస్వామ్యం

- దక్షిణ కొరియా అధ్యక్షుడితో పలు ఒప్పందాలు
- మోడీ, లీజే మ్యూంగ్ సంయుక్త మీడియా సమావేశం

**ఢిల్లీ, ఏప్రిల్ 20** : దక్షిణ కొరియా అధ్యక్షుడు లీజే మ్యూంగ్ మూడు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీకి వచ్చారు. ఇరు దేశాల సంబంధాలు బలోపేతం అయ్యే దిశగా ప్రధాని మోడీ- లీజే మ్యూంగ్ సమక్షంలో సోమవారం పలు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ.. అధ్యక్షుడి పర్యటన ద్వైపాక్షిక సంబంధాల్లో కీలక ముందడుగు అని పేర్కొన్నారు.

చిప్స్ నుంచి షిప్స్, ట్యాలెంట్ నుంచి టెక్నాలజీ, ఎంటర్ టైన్ మెంట్ నుంచి ఎనర్జీ వరకు ఇలా ప్రతి రంగంలోని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నట్లు తెలిపారు. భారత్-దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 27 బిలియన్ డాలర్లకు చేరిందన్నారు. 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

# వరంగల్ కార్పొరేషన్ ముందు నిరసన
# వాటర్ ప్లాంట్ రద్దు చేయాలని



**హనుమకొండ, ఏప్రిల్ 20(మనం న్యూస్ ) :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ముందు ఐద్వా మహిళా సంఘం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గోపాల్పూర్ నవయుగ కాలనీలో కొత్తగా పెట్టిన సాయిరాం వాటర్ ప్లాంట్ ను వెంటనే తీసివేయాలని భారీ ఎత్తున గ్రీవెన్స్ సెల్ లో నిరసన తెలియజేయడం జరిగింది సంబంధిత అధికారులు స్పందించి తొలగిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎం రమాదేవి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వీరన్న జిల్లా కమిటీ సభ్యులు టి ఉప్పలయ్య పాల్గొని మాట్లాడుతూ వోల్టా చట్టం ప్రకారం నివాస ప్రాంతంలో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయకూడదని స్పష్టంగా ఉందని ఇప్పటికీ కాలనీలో 250 కుటుంబాలకు పైగా బోర్లు ఎండిపోతున్నాయని 56 డివిజన్లో నీటి ఎద్దడి ఏర్పడుతుందని సాయిరాం వాటర్ ప్లాంట్ వెంటనే సీజ్ చేసి నీటి ఎద్దడి రాకుండా చూడాలని లేనియెడల కలెక్టర్ ఆఫీస్ ముందు మహిళలు ప్రజలు అభ్యుదయ వాదులతో కాలనీ కమిటీలతో పెద్ద ఎత్తున నిరసన తెలియజేయవలసి ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో కాలనీ మహిళా నాయకులు గౌతమి స్వాతి స్రవంతి విజయ సుమతి రాజేశ్వరి కవిత రజిత శారద అరుణ పూజ సబితా రాధా సుబ్బమ్మ పద్మ పావని మమత రమ సిపిఎం మండల నాయకులు రాజు రమేష్ జగన్ సమ్మయ్య పాల్గొని ధర్నా నిరసన కార్యక్రమం చేయడం జరిగింది

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్....

**ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 20 (మనం బ్యూరో):** సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు జీవి శ్యాంప్రసాద్ లాల్, జెడ్పి సీఈవో దేవ సహాయం, కలెక్టరేట్ ఏవో



చంద్రశేఖర్ తో కలిసి హాజరై ప్రజల నుంచి వచ్చిన అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ......, ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 45 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించారు. వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అని శాఖల అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు అలసత్వం ప్రదర్శించొద్దని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్ అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను దోచుకుంటే సహించేది లేదు?

- ప్రతి గింజను మద్దతు ధరకే కొనుగోలు చేయాలని పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్



**హైదరాబాద్, మనం ప్రతినిధి** : వరి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అధికారులను, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హుజురాబాద్ మార్కెట్ యార్డ్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మండిపడ్డారు. ముఖ్యంగా 'తరుగు' పేరుతో క్వింటాల్‌కు కిలోల చొప్పున కోతలు విధిస్తూ రైతులను నష్టపరుస్తున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. 'రైతు కన్నీరు పెడితే రాజ్యం బాగుండదు' అని వ్యాఖ్యానించిన ఆయన, ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీలు, గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని, విక్రయించిన ధాన్యానికి నగదు సకాలంలో రైతుల ఖాతాల్లో జమ కావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, భారీ సంఖ్యలో రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# చంద్ర బాబు 76వ పుట్టిన రోజు సందర్భంగా సంబరాలు చేసిన దేవా నాయక్

**ములుగు, మనంన్యూస్‌:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి 76వ పుట్టిన రోజు సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలో తెలుగు తమ్ముళ్ల కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు నిర్వహించారు ఈ సందర్భంగా దేవా నాయక్ మాట్లాడుతూ క్రమ శిక్షణ గల పార్టీ టీడీపీ అని చంద్రబాబునాయుడు గారి పాలన లో ఆంధ్రప్రదేశ్ అన్ని రకాలుగా అభివృద్ధి సాధించింది అని ఇళ్లు లేని నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డు ఉంటే ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చిన ఘనత తెలుగు దేశం పార్టీ ది అని దేవా నాయక్ కొనియాడారు రాజకీయంగా ఎంతోమందిని అభివృద్ధి చేసిన పార్టీ కూడా టీడీపీ అని దేవా నాయక్ గుర్తుచేశారు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గారి కాలం లో ఎదిగిన నాయకులు ఇప్పుడు ఆపార్టీకి వెన్నుపోటు పొడుస్తున్నారని దేవా నాయక్ విమర్శించారు

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి

## జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వవలసిందే

## మొదటి విడత దరఖాస్తులకు ఈనెల 23 తేదీ చివరి వరకు

## నాగర్ కర్నూలు జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వెల్లడి



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 20 (మనం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లాలో నిబద్ధతతో పనిచేస్తున్న నిజమైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని నాగర్ కర్నూల్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు పి. విజయ్ కుమార్, యం. చంద్రశేఖర్ రావు, సాయిలు సాగర్, కే. ప్రదీప్ కుమార్, దస్తగిరి, ముబీన్ అహ్మద్, సురేష్ కుమార్, పి వెంకటస్వామి, ఎం. శ్రీనివాసులు, నేతాజీ గౌడ్ లు సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ను మర్యాదపూర్వకంగా కలువడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ......, అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. అర్హత గల ప్రతి విలేకరికి కార్డు అందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా పౌర సంబంధాల అధికారి, కమిటీ సభ్యులపై ఉందన్నారు. అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలోని మార్గదర్శకాలను కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. అక్రిడిటేష కార్డు కొరకు నమోదు చేసుకున్న ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. త్వరలోనే జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ పూర్తిస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు సంబంధించిన అక్రిడేషన్ జారి ప్రక్రియను రంగారెడ్డి జిల్లా నుండి నాగర్ కర్నూల్ జిల్లా కు మార్చేందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ కు కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా గతంలో నాగర్ కర్నూలు జిల్లాకు గుర్తింపుగా ఉన్న నల్లమల్ల అటవీ ప్రాంతంలోని బ్రహ్మగిరి, మన్ననూర్ లను ప్రత్యేకంగా గుర్తించి, మీడియా అక్రిడేషన్ కార్డులపై ప్రత్యేక అక్రిడేషన్ కార్డుల మంజూరు చేసేలా, కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. ఈనెల 25వ. తేదీన జిల్లాలోని జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుల మంజూరుకై మొదటి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టులంతా ఈ నెల 23వ. తేదీలోగా మీడియా అక్రిడేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 23వ. తేదీ లోగా దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులకు మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించిన విధంగా ఈనెల 30వ. లోగా మీడియా అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టంగా తెలిపారు.

అనంతరం నూతన కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి జె. కిరణ్ కుమార్, నూతనంగా ఎంపికైన జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీ సభ్యులు పి. విజయ్ కుమార్, యం. చంద్రశేఖర్ రావు, సాయిలు సాగర్, కే. ప్రదీప్ కుమార్, దస్తగిరి, ముబీన్ అహ్మద్, సురేష్ కుమార్, పి. వెంకటస్వామి, ఎం. శ్రీనివాసులు, నేతాజీ గౌడ్ లు పాల్గొన్నారు.

## శాంతి కోసం నడక

ఆ పాద ముద్రలు చేరిగిపోవు
మా హృదయాల్లో దాగి ఉంటాయి
ప్రతి అడుగు ఒక కథ చెప్పుతుంది
శాంతి సందేశం వ్యాపించుతుంది
ఉదయం కిరణాలు తాకిన వేళ నడక
మొదలవుతుంది ఈ ప్రయాణం ఎన్నో
హృదయాలు ఒక్కటిగా కలిసి శాంతి గీతం
ఆలపిస్తాయి పాదాలు, ప్రపంచం నిండా
యుద్ధాల గాయాలు రక్తపు మరకలు, కన్నీటి
జల్లులు కానీ మనమంతా ఒకే కుటుంబం
శాంతి కోసం నడుస్తాం, ఆగము మేము
అడవుల్లో పక్షులు పాడే రాగాలు నదులు పారే
స్వరాలు వినిపిస్తాయి మన నడకలో ఆ స్వరాలు
మారుమ్రోగుతాయి శాంతి సందేశం ప్రతి
గ్రామానికి చేరుతుంది చిన్నారులు చేయి చేయి
కలిపి పెద్దలు భవిష్యత్తు కోసం పరుగెత్తి
మతాలు, జాతులు మరచి ముందుకు సాగి
శాంతి బాటలో ఒకే గమ్యం చేరుతాం
ఆకాశం నుంచి వర్షం కురిసినా భూమి మీద
ధూళి ఎగిరినా మా అడుగులు ఆగవు, ఆగకుండా
సాగుతాం శాంతి కోసం ప్రతి మైలు జయజయ
ధ్వని గాంధీజీ దండి యాత్ర గుర్తుచేస్తుంది
మార్టిన్ లూథర్ కింగ్ స్వప్నాలు జ్ఞాపకం
మన వాక్ ఫర్ పీస్ కూడా చరిత్ర సృష్టిస్తుంది
శాంతి యుగం మొదలవుతుంది ఇక్కడ నుంచి
ప్రతి అడుగులో ఒక ఆశ జన్మిస్తుంది ప్రతి
మైలులో ఒక బంధం పెరుగుతుంది శత్రువులు
స్నేహితులవుతారు మనతో శాంతి జెండా
ఎగురవేస్తాం అందరం కొండలు దాటి,
సముద్రాలు దాటి పట్టణాలు, గ్రామాలు
ముందుకు సాగి మన నడక ఒక ప్రపంచ
ఉద్యమం శాంతి కోసం ప్రతి హృదయం పలికే
మంత్రం అలసట వచ్చినా ఆగము మేము
కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయము
శాంతి దీపం వెలిగిస్తాం ప్రతి ఇంటా
మనుషుల మధ్య ప్రేమ పండుగ చేస్తాం
ఆకాశంలో రంగులు చిమ్ముతాయి
మన నడకలో స్వర్గం దిగివస్తుంది
శాంతి కోసం ఈ ప్రయాణం శాశ్వతం
ప్రతి పాద ముద్ర ఒక ఆశీస్సు మనకు చివరికి
చేరినప్పుడు మా గమ్యం ప్రపంచం మొత్తం
శాంతి మయమవుతుంది ఆ పాద ముద్రలు
చేరిగిపోవు మా హృదయాల్లో దాగి ఉంటాయి
ఎప్పటికీ ఇది మన వాక్ ఫర్ పీస్ కథ
స్ఫూర్తి దాయకం, శాంతి సందేశం
నడవండి మిత్రులారా, కలిసి నడవండి
శాంతి ప్రపంచం సాధిద్దాం అందరం!

**- వెంకట్ బల్లికురవ**
9652680802

# భారత ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం



అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) వరల్ ఎకనామిక్ అవుట్‌లుక్ ఏప్రిల్ 2026 ప్రకారం, నామమాత్ర స్థూల దేశీయ ఉత్పత్తి (GDP) ఆధారంగా ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల ర్యాంకింగ్స్‌లోస్వల్ప మార్పులు చోటు చేసు కున్నాయి. నాల్గవ స్థానంలో ఉన్న భారతదేశం 4.15 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక పరిమాణంతో ఆరో స్థానానికి దిగ జారింది. ముఖ్య కారణం రూపాయి విలువ తగ్గుదల. రూపాయి విలువ పడిపోవడం వల్ల భారత స్థూల దేశీయ ఉత్పత్తిని అమెరి కన్ డాలర్లలో లెక్కించినప్పుడు దాని విలువ తగ్గింది. ఉదా హరణకు, ఒక అమెరికన్ డాలర్‌కు 83 నుండి86కు రూపాయి బలహీనపడితే, డాలర్లలో స్థూల దేశీయ ఉత్పత్తి విలువ తగ్గు తుంది. రెండవది.. యునైటెడ్ కింగ్‌డమ్ ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకోవడం వల్ల తాత్కాలికంగా భారత్‌ను అధిగ మించింది. మూడవది, స్థూల దేశీయ ఉత్పత్తి విలువ లెక్కల్లో మార్పులు మరియు మారకపు విలువల హెచ్చుతగ్గులు కూడా ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపించాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాలు సుమారు 30-32 ట్రిలియన్ డాలర్లు, చైనా 19-21 ట్రిలియన్ డాలర్లు, జర్మనీ 5 ట్రిలియన్ డాలర్లు, జపాన్ 4.3-4.5 ట్రిలియన్ డాలర్లు, యునైటెడ్ కింగ్‌డమ్ 4.2-4.3 ట్రిలియన్ డాలర్లతో ఆర్థిక పరిమాణంతో భారత్ కంటే ముందున్నాయి. అయినప్పటికీ, భారతదేశం 2026-27లో 6.5% నిజమైన స్థూల దేశీయ ఉత్పత్తి (GDP) వృద్ధి అంచనాతో ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. 2028 నాటికి మళ్లీ నాల్గవ స్థానాన్ని తిరిగి పొందే అవకాశం ఉంది. అలాగే 2031 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని అంచనా వేయబడుతోంది.



### పశ్చిమ ఆసియా యుద్ధ ప్రభావం

పశ్చిమ ఆసియా ఘర్షణ భారతదేశం వంటి దిగుమతి దేశాలపై ఒత్తిడికి కారణమైంది. ఎందుకంటే భారతదేశం తన ముడి చమురు అవసరాలలో దాదాపు 85% దిగుమతులపై ఆధారపడుతోంది, అందులో ఎక్కువ భాగం దాదాపు 50-55% పశ్చిమ ఆసియాప్రాంతంతో సంబంధం కలిగి ఉంది. ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ ముడి చమురు ధరలు కొన్ని సందర్భాల్లో బ్యారెల్‌కు 110 డాలర్ల కంటే ఎక్కువకు చేరాయి. దీని వల్ల భారతదేశ దిగుమతి బిల్లు పెరిగింది. చమురు ధరల పెరుగుదల వల్ల పెట్రోల్, డీజిల్, రవాణా, ఉత్పత్తి వ్యయాలు పెరిగి ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఏర్పడ్డాయి. ఇటీవల కొన్ని నెలలలో భారత రిటైల్ ద్రవ్యోల్బణం సుమారు 5% వద్ద కొన సాగింది, దీనిపై ఇంధన వ్యయాల ప్రభావం కొంత ఉంది. అధిక దిగుమతి బిల్లు వల్ల ప్రస్తుత ఖాతా లోటు (Current Account deficit) పెరిగి రూపాయిపై ఒత్తిడి పెరిగింది. రూపాయి ఒక అమెరికన్ డాలర్‌కు 84-86 మధ్య ట్రేడ్ కావడంతో దిగుమతులు మరింత ఖరీదయ్యాయి. ఎర్ర సముద్ర మార్గాల్లో రవాణా అంతరాయాల కారణంగా భారత ఎగుమతులు, దిగుమతులపై సరుకు రవాణా, బీమా ఖర్చులు పెరిగాయి. రసాయనాలు, విమానయానం, ఎరువులు, లాజిస్టిక్స్ రంగాలు పెరిగిన ముడి పదార్థాల ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ప్రపంచ అనిశ్చితి కారణంగా ఆర్థిక మార్కెట్లలో కూడా అస్థిరత ఏర్పడి, సెన్సెక్స్ మరియు నిఫ్టీ సూచీలు నష్టాలను ఎదుర్కొన్నాయి. భారతదేశ ఎరువుల దిగుమతుల్లో దాదాపు 63% గల్ఫ్ దేశాల నుంచే వస్తాయి. దీని వల్ల వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు పెరిగాయి. పశ్చిమ ఆసియాలో సుమారు 9.37 మిలియన్ల భారతీయ కార్మికులు పనిచేస్తున్నారు. కాబట్టి యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే ఉపాధి ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అయినప్పటికీ, దేశీయ డిమాండ్ , ప్రభుత్వ వ్యయాల మద్దతుతో భారతదేశం సుమారు 6% కంటే ఎక్కువ వృద్ధిని కొనసాగించింది.

### రూపాయి విలువ తగ్గుదల ప్రభావం

పశ్చిమ ఆసియా యుద్ధ సమయంలో భారత రూపాయి విలువ తగ్గడం భారత ఆర్థిక వ్యవస్థపై పెద్ద ప్రభావం చూపు తుంది, ఎందుకంటే భారత్ ముఖ్యంగా ముడి చమురు వంటి దిగుమతులపై ఎక్కువగా ఆధారపడి ఉంది. భారత అవసరమైన ముడి చమురులో సుమారు 85% దిగుమతి చేసుకుంటుంది. 2026 ఏప్రిల్లో రూపాయి విలువ ఒక్క అమెరికన్ డాలర్కు సుమారు 95.21 వరకు పడిపోయి, తరువాత ఆర్బీఐ జోక్యంతో కొంత మేర కోలుకుంది. యుద్ధ ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 97-103 డాలర్ వరకు పెరిగి, భారత దిగుమతి భారం పెరిగింది. రూపాయి బలహీనపడటం వల్ల పెట్రోలియం, ఎరువులు, వంటనూనెలు, ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, రసాయనాలు వంటి దిగుమతులు ఖరీదవుతాయి. ఉదాహరణకు రూపాయి విలువ 83 నుంచి 93కు పడిపోతే దిగుమతులు రూపాయిల్లో సుమారు 12% ఖరీదవుతాయి. దీనివల్ల ఇంధన ధరలు, రవాణా, వ్యవసాయం, తయారీ ఖర్చులు పెరుగుతాయి. దీని వల్ల వినియోగదారుల కొనుగోలు శక్తి తగ్గుతుంది. అంచనాల ప్రకారం చమురు ధరలు 10% పెరిగితే భారత స్థూల దేశీయ ఉత్పత్తి వృద్ధి 20-25 బేసిస్ పాయింట్లు తగ్గవచ్చు. వాణిజ్య లోటు, ప్రస్తుత ఖాతా లోటు పెరుగుతాయి విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరుగుతుంది. 2026 మార్చిలో ఇవి సుమారు 688 బిలియన్ల డాలర్లు గా ఉన్నాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా విదేశీ పెట్టుబడిదారులు పెట్టుబడులు ఉపసంహరించుకోవచ్చు, దీని వల్ల స్టాక్ మార్కెట్లో అస్థిరత పెరుగుతుంది.

డాలర్లలో అప్పులు తీసుకున్న భారత కంపెనీలకు తిరిగి చెల్లింపు భారం పెరుగుతుంది, అయితే ఐటీ, ఔషధాలు, వస్త్ర పరిశ్రమలు వంటి ఎగుమతి రంగాలకు విదేశీ ఆదాయం రూపాయిల్లో ఎక్కువగా లభించడం వల్ల కొంత లాభం కలుగుతుంది. మొత్తంగా రూపాయి విలువ తగ్గడం వల్ల ద్రవ్యోల్బణం, మందగించిన వృద్ధి, అధిక దిగుమతి ఖర్చులు, ఆర్థిక అస్థిరత ఏర్పడతాయి.

### తీసుకోవలసిన చర్యలు

రూపాయి విలువ తగ్గుదల, పశ్చిమ ఆసియా యుద్ధ ప్రభావాన్ని భారత ఆర్థిక వ్యవస్థపై తగ్గించడానికి, భారత్ పలు చర్యలు తీసుకోవాలి. భారతదేశం తన ముడి చమురు అవసరాలలో దాదాపు 85% దిగుమతులపై ఆధారపడుతోంది. అందులో 50% కంటే ఎక్కువ సంప్రదాయంగా పశ్చిమ ఆసియా నుంచే వస్తోంది. కాబట్టి రష్యా, అమెరికా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల నుంచి చమురు కొనుగోళ్లు పెంచడం ద్వారా సరఫరా ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

పునరుత్పాదక ఇంధన విస్తరణ చాలా అవసరం. 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ ఫ్యూయల్ సామర్థ్య లక్ష్యాన్ని సాధించడం ద్వారా చమురుపై ఆధారాన్ని తగ్గించవచ్చు. ప్రస్తుతం ఉన్న సుమారు 5.3 మిలియన్ టన్నుల వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను మరింత పెంచితే సరఫరా షాక్‌ల సమయంలో ఉపయోగపడుతుంది. ఎగుమతులను ప్రోత్సహించడం కూడా ముఖ్యం. ఇటీవల భారత్ వస్తువులు మరియు సేవల ఎగుమతులు కలిపి 770 బిలియన్ డాలర్లు దాటాయి, ఇది విదేశీ మారక నిల్వలకు మద్దతు ఇస్తుంది. రూపాయి ఆధారిత వాణిజ్య చెల్లింపులను ప్రోత్సహించడం ద్వారా అమెరికన్ డాల్ప ఆధారాన్ని తగ్గించవచ్చు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ 640 బిలియన్ కంటే ఎక్కువ విదేశీ మారక నిల్వలను ఉపయోగించి కరెన్సీ స్థిరత్వాన్ని కాపాడాలి. ఇటీవలి సంవత్సరాలలో 70 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువగా ఉన్న ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులను మరింత ఆకర్షించడం ద్వారా మూలధన ప్రవాహాలు పెరుగుతాయి. మేక్ ఇన్ ఇండియా కింద దేశీయ తయారీని విస్తరించడం ద్వారా ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, రక్షణ సామగ్రి దిగుమతులను తగ్గించవచ్చు. నౌకాశ్రయాలు షిప్పింగ్ లాజిస్టిక్స్ మెరుగుపరచాలి. ఎరువుల విషయంలో స్వయం సమృద్ధి చాలా ముఖ్యం, ఆహార నిల్వలు, సరఫరా నిర్వహణ ద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలి. సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల విస్తరణకు తక్కువ వడ్డీ రుణాలు అందించడం ద్వారా ఉపాధిని రక్షించవచ్చు. పర్యాటకం మరియు ఐటీ ఎగుమతులను ప్రోత్సహించాలి, ఎందుకంటే సాఫ్ట్‌వేర్ ఎగుమతుల ద్వారా సంవత్సరానికి 200 బిలియన్ కంటే ఎక్కువ ఆదాయం వస్తోంది. ఈ చర్యలన్నీ కలిపి రూపాయి షాక్‌లు, భౌగోళిక రాజకీయ ప్రమాదాల నుంచి భారతదేశాన్ని మరింత కాపాడుతాయి.

**- డాక్టర్. పి.ఎస్. చారి**
8309082823

# అనితర సాధ్యుడు చంద్రబాబు



రాజకీయం.. అదో అతిపెద్ద మహాసముద్రం.. ఉవ్వెత్తున ఎగసిపడే కెరటం.. రాజకీయాల్లో అధికారం, రెండూ ఒక్కటే. అలాంటి రాజకీయాల్లోకి ఎంతో మంది నేతలు వస్తుంటారు.. పోతుంటారు. కానీ చరిత్రలో నిలిచిపోయేలా, చరిత్రలో తమకంటూ ఓ పేజీని లిఖించుకునే నేతలు కొందరే ఉంటారు.. అలాంటి వారిలో రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. తెలుగు రాజకీయాలను చంద్ర బాబును వేర్వేరుగా చూడలేం.76 ఏళ్ళ నవ యువకుడు.. 47 ఏళ్ళుగా ప్రజాసేవలో తరిస్తున్న ధన్యుడు.. తెలుగు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన దార్శనికుడు.. పేదల సంక్షేమం సమగ్రాభివృద్ధిని కొత్తపుంతలు తొక్కించిన వికాశనాయకుడు.. రాజకీయాన్ని రాష్ట్ర హితం కోసం అన్వయించిన అపర చాణక్యుడు..విధ్వంసమైన నవ్యాంధ్ర పునర్ నిర్మాణానికి శంఖం పూరించిన సమర యోధుడు.. రాష్ట్రానికి దిక్సూచి.. తెలుగు ప్రజల భవిష్యత్తుకు మార్గదర్శి 76వసంతంలోకి అడుగుపెడుతున్న ధీరోదాత్తుడు నారాచంద్రబాబునాయుడు .

భారత రాజకీయ చరిత్రకు వన్నె తెచ్చిన పాలనతో... సమసమాజ మానవత్వపు భావనలతో... వెనుకడుగు వేయని పోరాటపటిమతో, సాధించేవరకు విరామం ప్రకటించని కార్యదక్షతతో... కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చే అధినేత, తెలుగు వెలుగు నారా చంద్రబాబు నాయుడు. ఏప్రిల్ 20 తేదీన ఆయన పుట్టినరోజు. 76వ వసంతంలోకి అడుగు పెడుతున్న ఆయన రాజకీయ ప్రస్థానం ఒక సుదీర్ఘ గాథ. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో కొనసాగుతూ.. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, తనదైన ముద్ర వేశారు. ఆయన రాజకీయ చతురత, పరిపాలనా దక్షత, ప్రజలను మెప్పించే వాక్చాతుర్యం ఆయనను ఒక ప్రత్యేక నాయకుడిగా నిలిపాయి. ఆయన నాయకత్వంలో ఎంతోమంది రాజకీయ నాయకులు ఎదిగారు. ఆయనను ఒక గురువుగా భావించేవారు ఎందరో ఉన్నారు.



క్రమశిక్షణ, దూరదృష్టి, వ్యూహ చాతుర్యం తోడు నిత్యం ప్రజలకు మంచిచేయాలనే తపనతో ఎన్ని సంక్షోభాలు ఎదురైనా నాలుగు దశాబ్దాలకుపైగా రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన నేతగా, హైదరాబాద్‌ను ప్రపంచ ఐటీ పటంలో నిలిపిన దార్శనికుడు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.

46 ఏళ్ల రాజకీయ జీవితంలో చంద్రబాబు ఎదుర్కొన్నన్ని ఒడిదొడుకులు ఎదుర్కొన్న లీడర్ మరొకరు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. నాలుగు దశాబ్దాలుగా చంద్రబాబు పేరు లేకుండా తెలుగు రాజకీయాలు, తెలుగు దినపత్రికలు ఉండని రోజులను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. అందుకే గడిచిన 46 ఏళ్ల భారత రాజకీయాల్లో సీబీఎన్ ఓ దిగ్గజం.

1995 సెప్టెంబర్ 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టారు. తొలి టర్మ్‌లోనే ప్రజల వద్దకు పాలన, శ్రమదానం, జన్మభూమి, పచ్చదనం - పరిశుభ్రత వంటి అనేక వినూత్న కార్యక్రమాలకు చంద్రబాబు శ్రీకారం చుట్టారు.

చంద్రబాబు ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా రాత్రిపూట రోడ్లను శుభ్రం చేయించడం మొదలు పెట్టారు. గ్రామీణ మహిళల ఆర్థిక అభ్యున్నతికి డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాలు పేద మహిళల జీవితాల్లో సానుకూలమైన మార్పులు తెచ్చాయి. శాసనసభ సమావేశాలను ప్రజలు తిలకించాలనే ఉద్దేశంతో పాతికేళ్ల క్రితమే ప్రత్యక్ష ప్రసారాలకు శ్రీకారం చుట్టారు. అలా, 'లైవ్'లో అందించిన మొదటి రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టించింది. చంద్రబాబు అమల్లోకి తెచ్చిన 'డయల్ యువర్ సీఎం' ప్రోగ్రామ్ ఎంతో ప్రాచుర్యం పొందింది.

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగే ఇబ్బంది నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించే క్రమంలో 46 రకాల సేవలను ఒకేచోట అందించే ఉద్దేశంతో 2000 సంవత్సరంలో ఈ-సేవను చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. 'విజన్ 2020'తో హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్‌ను ఒప్పించి అమెరికా వెలుపల తొలి మైక్రోసాఫ్ట్ కార్యాలయంను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించిన ఘనత చంద్రబాబుది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొమ్మిదేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేశారు. హైదరాబాద్ నగరానికి ప్రపంచ వ్యాప్తంగా పేరుతెచ్చింది చంద్రబాబు అని అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. రాష్ట్రం విడిపోయిన తరువాత 2014లో చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఏపీ రాజధానిగా అమరావతిని ఎంపిక చేసి.. అన్నిరంగాల్లో అభివృద్ధి పర్చేందుకు చంద్రబాబు కృషి చేశారు. అయితే, 2019లో ఓడిపోయి ప్రతిపక్ష పాత్రకు పరిమితమైన చంద్రబాబు.. మళ్లీ 2024 ఎన్నికల్లో నాల్గోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అమరావతి రాజధానిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు.. ఏపీని దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు చంద్రబాబు పాలనను పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతి రాజధానిని ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనేది ఆయన పట్టుదల. ఆ దిశగా అమరావతి అభివృద్ధికి రేయింబవళ్ళు శ్రమిస్తూ ప్రణాళికల రూపకల్పనలో నిమగ్నమైన నాయకుడు చంద్రబాబు. చంద్రబాబు విజన్ మీద ప్రశంసలతో పాటుగా విమర్శలు కూడా ఉంటాయి. భవిష్యత్తు గురించి మాట్లాడటం పక్కనపెట్టి.. వర్తమానంపై దృష్టిపెట్టమని ఆయన దార్శనికతపై ఎత్తిపొడుపులు కూడా ఉంటాయి. అయితే ఓ లీడర్‌గా వర్తమానంపైనే కాకుండా పాతికేళ్ల అనంతరం ఉండే పరిస్థితులపైనా ఆలోచనలు చేయగలిగే నేత చంద్రబాబు. 1990 వెనకటి రోజుల్లో చంద్రబాబు తెచ్చిన విజన్ 2020 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడింది. టెక్నాలజీ, ఫార్మా రంగాల్లో ప్రపంచస్థాయి కంపెనీలు హైదరాబాద్కు తరలివచ్చాయి. సైబరాబాద్ సృష్టి, హైటెక్ సిటీ నిర్మాణం, పాలనలో ఈ- గవర్నెన్స్, మహిళల కోసం స్వయం సహాయక సంఘాలు ఇలాంటి ఎన్నో సంస్కరణలు తెచ్చారు చంద్రబాబు.

2047 స్వర్ణాంధ్ర విజన్‌తో భవిష్యత్ తరాలకు అభివృద్ధి ఫలాలను అందించాలన్న ముందు చూపున్న విజనరీ లీడర్ చంద్రబాబు.

ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో పాల్గొనడం, బిల్ గేట్స్, బిల్ క్లింటన్లను కలవడం వంటి కార్యకలాపాల ద్వారా హైదరాబాద్ రాజ, దాని పేరు ఖ్యాతులను ప్రపంచస్థాయికి తీసుకెళ్లారు. ఆర్థిక సంస్కరణలపట్ల ఆయన అవలంబించిన విధానం కారణంగా, ప్రపంచ బ్యాంకు నేరుగా రుణం మంజూరు చేసిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవడం విశేషం. టైమ్ మ్యాగజైన్ 1999లో ఆయనను 'సౌత్ ఏషియన్ ఆఫ్ దిఇయర్'గా గుర్తించగా, ఇండియా టుడే ఆయనను 'ఐటీ ఇండియన్ ఆఫ్ ది మిలీనియం'గా ప్రకటించింది. 2014 నుంచి 2019 మధ్య ఆయన అమరావతి నిర్మాణాన్ని శ్రీకారం చుట్టారు. ఈకాలంలో రాష్ట్రం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో అగ్రస్థానానికి చేరింది. సాంకేతికత పట్ల ఆయన చూపిన ఆసక్తి కారణంగా 'సైబర్ బాబు'గా పేరుగాంచారు. రాజకీయ నాయకుడిగా, విజనరీ లీడర్‌గా ఆయన ప్రస్థానం, అమరావతి నిర్మాణ లక్ష్యం, హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చిన ఘనత గురించి ప్రజలు స్మరించుకుంటున్నారు. ఆయన భవిష్యత్ ఆకాంక్షలు రాష్ట్రాభివృద్ధికి ఊపిరిపోస్తాయని ఆశిస్తున్నారు.

సంపూర్ణ రాజకీయ జీవితం అంతా ప్రజాసేవకు అంకితమైన చంద్రబాబు, దార్శనికత, వినూత్న ఆలోచనలతో రాజకీయ రంగాన్ని ప్రభావితం చేసిన అరుదైన నేత. 76 ఏళ్ల వయస్సులోనూ మునుపటిలానే చురుకుగా వ్యవహరిస్తూ, యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. రాజకీయాల్లో ఆయన ముద్ర ఎప్పటికీ చెరగని స్థాయిలో ఉంటుంది. తెలుగు ప్రజల ప్రగతికి మార్గనిర్దేశకుడిగా, ఆధునిక ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి శిల్పిగా, రాజకీయాల్లో నైతికతకు ప్రతీకగా నిలిచిన చంద్రబాబుకి జన్మదిన శుభాకాంక్షలు. ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన చేస్తున్న దీక్ష ప్రతి తరానికీ ప్రేరణగా నిలుస్తుంది. రాష్ట్ర ప్రగతి పునర్జీవింప చేయడం చంద్రబాబుకే సాధ్యం. 76 వసంతాల చంద్రబాబు నాయుడు దీర్ఘాయుష్షు, ఆరోగ్యకరమైన జీవితంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో అగ్రభాగాన నిలవాలని ఆశిద్దాం.

**- వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖమంత్రి,ఆంధ్రప్రదేశ్

# బాబు గారి బాధలో అంత నిజం ఉందా?



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బాధేసింది. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో ప్రతిపక్షాలు సహకరించకపోవడం ఆయన బాధకు కారణమయ్యింది.'దేశం మహిళా సాధికారత దిశగా వేస్తున్న అడుగులను' ప్రతిపక్షాలు అడ్డుకున్నాయన్నారు. పార్లమెంటులో మహిళలకు అన్యాయం జరిగిందనీ, భారతదేశ చరిత్రలో ఇది బ్లాక్ డే అని కూడా ఆయన ప్రకటించారు. అందుకు నిరసనగా ఆయన శనివారం ఉద్యమాన్ని ప్రారంభించారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఆయన ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మహిళలతో కలిసి మండుటెండలో సుమారు రెండు కిలోమీటర్లు నిరసన తెలుపుతూ స్వచ్ఛాంధ్ర వేదిక వరకూ పాదయాత్ర చేశారు. ఇంతకూ ఈ వేదిక ఏమిటి అని ఆరాతీస్తే అది 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' పేరిట జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమం. ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడానికి వెళుతూ పనిలో పనిగా ఆయన ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గాలికి పోయే పేల పిండిని కృష్ణార్పణం అన్నట్టుగా ఆయన సభ వద్దకు నడిచి వెళ్తూ,వెళ్తూ ఆ కార్యక్రమానికి 'నిరసన' అని పేరు పెట్టేశారు. 'మహిళలకు 33% రిజర్వేషన్లు వస్తాయని అందరం అనుకున్నాం. 33% మంది మహిళలను చట్ట సభల్లో చూస్తామని ఆశపడ్డాం. అందరూ ముందుకు వచ్చిన సమయంలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మహిళలకు ద్రోహం చేశాయి' అని ఆరోపించారు. మహిళలకి న్యాయం జరిగేదాకా, మహిళా రిజర్వేషన్ బిల్లు సాధించే వరకూ ఉద్యమం ఆగదనీ,అప్పటి వరకూ ఆడబిడ్డలకు తాను అండగా ఉంటానని ప్రతిజ్ఞ కూడా చేస్తానన్నారు.



ఎంత చక్కని సన్నివేశం? ఎంత ముచ్చటైన భరోసా? చూపరులకు కడుపు నిండిపోయే వ్యవహారం ఇది. మహిళల కోసం ఎవరు ఉద్యమం చేసినా మిగతా ప్రపంచమంతా స్వాగతించాల్సిందే. ఆ విధంగా ముందుకు పోయిన చంద్రబాబు ప్రకటనను కూడా మనం సానుకూలంగా చూడాల్సిందే. అయితే లోకసభలో వీగిపోయిన బిల్లు మహిళా రిజర్వేషన్ బిల్లేనా? ఒకవేళ కాకపోయినట్లయితే మరి ఆ బిల్లు ఏమిటి? దానికి సంబంధించిన వివరాలు ఏమిటి? దానిపై ప్రభుత్వ అనుకూల వర్గాలు చెబుతున్నది ఏమిటో ముందుగా తెలుసుకోవాల్సివుంది. ఆ తర్వాత మిగతా విషయాలు చర్చిస్తే బాగుంటుంది. బాబు గారు చెబుతున్నట్టు ఇప్పుడు వీగిపోయిన బిల్లు మహిళా బిల్లు కాదు. 2023వ సంవత్సరంలోనే ఆ బిల్లు చట్టసభల ఆమోదం పొందింది. అందుకు కారణం పాలకపక్షంతోపాటు ఇప్పుడు బాబు గారు తిడుతున్న కాంగ్రెస్ పార్టీతోపాటు, ప్రతిపక్షంలోని దాదాపు అన్ని పార్టీలూ ఏకగ్రీవంగా మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వడం వల్లనే అది సాధ్యమయ్యింది. బిల్లు చట్ట రూపం దాల్చిన తర్వాత దానిని అమలు చేయాల్సినటువంటి పాలకపక్షం ఆ పని చేయకుండా అందులో ఒక కొత్త మెలిక పెట్టింది. అది ఏమిటంటే 2026లో జనగణన జరిగిన తర్వాత..నియోజకవర్గాల పునర్విభజన చేసి, దాని ప్రకారమే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని!

ప్రభుత్వానికి అమలు చేయాలి అనే సంకల్పం ఉన్నట్లయితే ఈ రెండున్నర సంవత్సరాలలో జనగణనతో పాటు నియోజకవర్గాల పునర్విభజనను జరిపించి ఉండేది. కానీ ప్రభుత్వం అలా చేయలేదు. ఇప్పుడు మాత్రం తాను చేసిన చట్టాన్ని తానే ఉల్లంఘించి హడావిడిగా 2011 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేస్తామనీ, ఆ పునర్విభజన ఆధారంగా మహిళా రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం దేనికి సంకేతం? మరి ఆ రెండు పనులు జరుగకుండానే శుక్రవారం 131వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో హడావిడిగా ఎందుకు ప్రవేశపెట్టినట్టు? ఏదో ఒక ప్రయోజనం లేకుండా ఎవరైనా ఇలా ఎందుకు తొందరపడతారు? మరి కొద్ది రోజులలో జరగనున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో మహిళల మద్దతును కూడగట్టుకునేందుకే అని తెలుస్తూనే ఉంది. ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లను పెంచుతున్నామనీ.. ఏ ప్రాంతం వారికీ అన్యాయం జరగనివ్వబోమని అమిత్‌షా లాంటి వాళ్ళు అంటున్నప్పటికీ ఆ విషయాలు ఏవీ కూడా బిల్లులో పొందుపరచకపోవడం గమనార్హం. ఒక విధంగా చెప్పాలంటే పార్లమెంట్ బయట బీజేపీ నాయకులు చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలు. ఆ అబద్దాలను నిజమని నమ్మించేందుకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ప్రయత్నిస్తున్నారు.

కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను ఆ విషయాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా ఎక్కువమంది పిల్లలను కన్న ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చి జనాభా ప్రాతిపదికన కనుక పునర్విభజన చేసినట్లయితే వచ్చేటటువంటి నష్టాలను బేరీజు వేసిన అప్పటి ప్రధానులు ఇందిరా గాంధీ, వాజ్‌పాయిలు చెరొక 25 ఏళ్ల చొప్పున ఈ పునర్విభజనను వాయిదా వేశారు. ఈ లోపు రెండు ప్రాంతాల మధ్య జనాభా సమతుల్యత సాధించబడుతుందని భావించి వారు ఈ వాయిదాకు పూనుకున్నారు. కానీ జనాభా విషయంలో ఉత్తర దక్షిణ భారతాల మధ్య అసమానతలున్నాయి. జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాల పునర్విభజన చేసినట్లయితే తాము తీవ్రంగా నష్ట పోతామని దక్షిణాది నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది.

దక్షిణాదికి చెందిన తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని దాదాపు పార్టీలన్నీ అలాగే తెలంగాణలోని పాలక, ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ బిల్లును ఉన్నది ఉన్నట్టుగా వ్యతిరేకిస్తున్నాయి. కానీ దీనిని సమర్థిస్తున్న పార్టీలు ఒక్క ఆంధ్ర ప్రదేశ్ లోనే ఉండడం ఆశ్చర్యం కలిగించే విష యం. ఇందులోనూ చంద్రబాబు గారి టీడీపీ చాలా ముఖ్యమైనది. వీరి మద్దతు కేంద్రంలో బీజేపీకు చాలా కీలకమైనది. అయినా కూడా ఆయన రాష్ట్ర ప్రయోజనాలనూ, ఈ ప్రాంత ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం కేంద్ర పాలకుల నుండి ఏవో ప్రయో జనాలు ఆశించి, వారి మాటల్ని భుజాన వేసుకొని తిరగడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. 'వగచిరి అన్నలు/ వగచిరి వదినలు/తల్లియు కంటను తడిపెట్టెన్/ కాసుకు లోనై అల్లుని తలుచుకు/ఆనందించెను అయ్యొకడే' పూర్ణమ్మ గేయ కవితలో మహాకవి గురజాడ అన్నట్లుగా దక్షిణాది ముఖ్యమంత్రులంతా ఈ చర్యను వ్యతిరేకిస్తుంటే, ముందు చూపు కలిగిన చంద్రబాబు గారు మాత్రమే కేంద్ర ప్రభుత్వాన్ని సమర్థిస్తూ వస్తున్నారు. ఆయన కారణాలు ఆయనకున్నాయనేది లోకవిదితమే.

నిష్పక్షపాతంగా చూసినప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు పాలక పక్షంతో పాటు ప్రతిపక్షం కూడా సమర్థించి అది చట్టంగా మారడానికి సహాయపడ్డాయి. కేంద్రం మాత్రం ఆ చట్టానికి మెలికలు తగిలించి మసిబూసి మారేడుకాయ చేసి ఆ చట్టం అమలు కాకుండా మోకాలడ్డింది. అలాంటి పాలకవర్గాన్ని పక్కనపెట్టి చంద్రబాబు నాయుడు ప్రతిపక్షాలను ఆడిపోసుకోవడం అతని ద్వంద్వ వైఖరికి నిదర్శనం. మహిళల కోసం ఉద్యమిస్తానని చెబుతున్న చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన తర్వాత తన పార్టీ తరఫున ఎంతమంది మహిళా అభ్యర్థులను నిలబెట్టారో. అతను ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ఈ 12 సంవత్సరాల కాలంలో ఎంత మంది మహిళాఎమ్మెల్యేలుగా గెలిపించుకున్నారో? దాని శాతం ఎంత? అన్న అంశాలను పరిశీలించినప్పుడు.. బాబు గారి నిజాయితీ ఎంతో తెలిసి వస్తుంది. 2014లో టిడిపి తరఫున పోటీ చేసిన మహిళలు ఆరుగురు అయితే గెలిచిన మహిళా ఎమ్మెల్యేలు ఇద్దరు. 2019లో టిడిపి తరఫున పోటీ చేసిన మహిళలు నలుగురైతే గెలిచిన ఎమ్మెల్యేలు ఇద్దరే. ఆయన ఏ మహిళా రిజర్వేషన్ల కోసమైతే ఉద్యమిస్తానని అంటున్నాడో ఆ మహిళా రిజర్వేషన్ల బిల్లు 2023 నవంబర్ నాటికే చట్టంగా మారిన తర్వాతనే 2024 ఎన్నికలు మే నెలలో జరిగాయి. టిడిపి తరఫున కేవలం 19 మంది మహిళా అభ్యర్థులను మాత్రమే పోటీకి దింపారు. ఆ సమయంలో 33% సీట్లను మహిళా అభ్యర్థులకు కేటాయించాలనే స్పృహ ఎందుకు రాలేదు. అంతే కాకుండా తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయన తన కుమారుడైన లోకేష్‌ని ఇటీవలే నియమించుకున్నారు. కానీ ఆ స్థానంలో ఒక మహిళకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనే ఆయన చేయలేకపోయారు. 25 గురు సభ్యులు ఉన్న మంత్రివర్గంలో ముగ్గురు మహిళల శాతం ఎంతో ఏలికలకు తెలియందా? మాటకు చేతకు తేడాలేని వ్యక్తుల మాటలకే సమా జంలో ఎప్పుడూ విలువ ఉంటుంది. కానీ గురివింద సామెతలు చెప్పే గురువు లను గానీ - విశ్వగురువులను గానీ ప్రజలు విశ్వసించే పరిస్థితులు ఎల్లకాలమూ ఉండకపోవచ్చు.

**- గుండెబోయిన శ్రీనివాస్**
9985194697

# కలిసికట్టుగా పనిచేస్తే అభివృద్ధిని ఆపే నాథుడే ఉండరు

- ఇక గల్లీ రోడ్లపై దృష్టి పెడుతున్నాం
- కరీంనగర్ చెరువులను మినీ పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతాం
- మురుగు నీరు చెరువుల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకుంటాం
- మూడు చెరువుల పునరుజ్జీవానికి రూ.5.82 కోట్లు విడుదల
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్





కరీంనగర్ ఏప్రిల్ 20(మనం బ్యూరో): రాజకీయాలు, పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేస్తే కరీంనగర్ లో అభివృద్ధిని అడ్డుకునే నాథుడే ఉండబోరని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మెయిన్ రోడ్ల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. ఇకపై గల్లీ గల్లీలో గుంతలు పడ్డ రోడ్లపై దృష్టి సారించామన్నారు. అతి త్వరలోనే గల్లీల్లో నూతన రోడ్లను నిర్మిస్తామని వెల్లడించారు. కరీంనగర్ లోని కొత్తపల్లి, తీగలగుట్టపల్లి, రేకుర్తి చెరువులను అమ్రుత్ నిధులతో పునరుద్దరించి మినీ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సోమవారం కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, పలువురు బీజేపీ కార్పొరేటర్లతో కలిసి తీగలగుట్టపల్లి, కొత్తపల్లి చెరువుల పునరుద్దరణ పనులకు కేంద్ర మంత్రి బండి సజయ్ శంకుస్థాపన చేశారు. ఆయా చెరువుల చుట్టూ అధికారులు, మేయర్, డిప్యూటీ మేయర్లతో కలిసి కలియ తిరిగారు. అమ్రుత్ 2 కింద విడుదలైన కేంద్ర నిధులతో చేపట్టబోయే పనులపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ కార్పొరేషన్ లో అభివృద్ధి పనుల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అమ్రుత్ 2 నిధులతో తీగలగుట్టపల్లి, కొత్తపల్లి, రేకుర్తి చెరువుల పునరుజ్జీవం కోసం రూ.5.82 కోట్ల నిధులు విడుదలయ్యాయి. అందులో భాగంగా తీగలగుట్టపల్లి, కొత్తపల్లి చెరువుల పునరుజ్జీవ పనులకు శంకుస్థాపన చేశారు. వినాయక నిమజ్జనం, బతుకమ్మ నిమజ్జనం సమయంలో భక్తులు ఇబ్బంది పడేవాళ్లు. ఇకపై ఆ ఇబ్బందులు లేకుండా చెరువులను పునరుద్దరిస్తున్నాం. చెరువు చుట్టూ బండ్ నిర్మించడంతోపాటు అందంగా తీర్చిదిద్దుతాం. కరీంనగర్ ప్రజలంతా కుటుంబాలతో కలిసి వచ్చి సేద తీరేలా చెరువులను అందంగా తీర్చిదిద్ది మినీ పర్యాటక ప్రాంతంగా మారుస్తాం. అభివృద్ధిలో కరీంనగర్ దూసుకుపోతోంది. కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే మెయిన్ రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. ప్రస్తుత కార్పొరేషన్ పాలకవర్గమంతా రాజకీయాలకు అతీతంగా గల్లీలో ఉన్న రోడ్లను నిర్మించాలని నిర్ణయించింది. రాజకీయాలకు అతీతంగా కార్పొరేటర్లంతా పని చేస్తుండటం సంతోషంగా ఉంది. ఇదే విధంగా పార్టీలకు, రాజకీయాలు అతీతంగా కలిసి కట్టుగా పనిచేస్తే కరీంనగర్ అభివృద్ధిని ఆపే నాథుడే ఉండరు. కేంద్రం నుండి నిధులు తీసుకొస్తాం. రాష్ట్రం నుండి నిధులు రాబడతాం. తిరుగులేని అభివృద్ధి సాధిస్తాం. అభివృద్ధిలో కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా. ఆయన వెంట కార్పొరేటర్లు బిజెపి నాయకులు అధికారులు వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి, ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి): అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.రామగిరి మండలం 8 ఇంక్లైన్ కాలనీ కు చెందిన కే.రాజమ్మ 69/ఈ సర్వే నెంబర్లు గల 26 గంటల భూమి ఉందని, తన భూమిని తప్పుడు కాగితాలతో అమ్మినట్లు కాగితాలు చూపించి పట్టా చేయించుకోవాలని చూస్తున్నారని తన సంతకాలు ఫోర్జరీ చేశారని, తన పట్టా ఎవరి పేరు మీద చేయవద్దని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డిఓ పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జూలపల్లి మండలం కుమ్మరి కుంట గ్రామానికి చెందిన ఏ. భూమయ్య తనకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిందని , ఇంటి నిర్మాణానికి 10 నుంచి 12 లక్షలు ఖర్చు అవుతుందని, అదనంగా డబ్బులు పెట్టే కట్టుకుని స్తోమత తనకు లేదని, ప్రభుత్వం అందించే ఐదు లక్షల రూపాయలతో రేకుల షెడ్డు నిర్మాణం కోసం వెసులుబాటు కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఎస్. మదన్ మోహన్ తనకు ఆరు సంవత్సరాల క్రితం రైలు ప్రమాదంలో ఒక కాలు పోయిందని, తనకు ఇంతవరకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు కాలేదని, తనకు దివ్యంగుల పెన్షన్, అంత్యోదయ రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పౌరసరఫరాల శాఖ అధికారిక రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భిక్కనూరు సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఎంఈఓ తనిఖీ



- వసతుల పట్ల సంతృప్తి

భిక్కనూరు, ఏప్రిల్ 20 ( మనం న్యూస్ ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన' దినోత్సవ వేడుకల్లో భాగంగా, భిక్కనూరు మండల విద్యాధికారి ఆర్. రాజ గంగారెడ్డి సోమవారం స్థానిక సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల పర్యటనలో భాగంగా ఎంఈఓ గంగారెడ్డి విద్యార్థులకు అందుతున్న వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వంట చేసే విధానాన్ని, నిల్వ ఉంచిన సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు.పాఠశాల ఆవరణతో పాటు మలమూత్రశాలల నిర్వహణను స్వయంగా పర్యవేక్షించారు. పాఠశాలలో పరిశుభ్రత ప్రమాణాలు మరియు వంటగది నిర్వహణ సతీశయంగా ఉండటంతో ఎంఈఓ తన సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజా పాలన లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో పాఠశాల సిబ్బంది కృషిని ఆయన అభినందించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్తో పాటు, సీనియర్ లెక్చరర్ కిషన్, సి.ఆర్.పి సత్యం మరియు ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారి ఆరోగ్య విషయాల్లో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు.

# మాతృభూమి సేవ, సమాజ సేవ కోసం వందేళ్లుగా ఆర్ఎస్ఎస్

- ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్
- సామల కిరణ్ జి




మనకొండూరు ఏప్రిల్ 20(మనం న్యూస్): మాతృభూమి సేవ కోసం, సమాజ సేవ కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లుగా పనిచేస్తుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముక్ సామల కిరణ్ జి అన్నారు. తిమ్మాపూర్ ఉపమండలం శ్రీ అనంతపద్మనాభ స్వామి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య వక్తక హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్లుగా దేశహితం కోసం, హిందూ ధర్మ , సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ కోసం పనిచేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగాలు సైతం అదే లక్ష్యంతో ఆయా రంగాలలో రాణిస్తున్నాయన్నారు. సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చిన మేరకు హిందూ సమ్మేళనాలు దేశవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు.ఆర్ఎస్ఎస్ నేడు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచ పరివర్తన్ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిందన్నారు. ముఖ్యంగా సామాజిక సమరత, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ ప్రబోధన్, స్వదేశీ ఆచరణ , పౌర బాధ్యత నియమాలు అనే ఐదు అంశాల ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం హిందూ సమ్మేళనాలు హిందూ సమాజం ఐక్యతతో కొనసాగాలనే ఉద్దేశంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా సమాజంలో కులాల పేరుతో పెరుగుతున్న విభజన తో హిందువులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని , హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం , ధర్మం సుస్థిరంగా ఉంటుందన్నారు. ఐకమత్యత లేని కారణంగా నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. హిందువులు ఐక్యంగా, సంఘటితశక్తిగా మారాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని,. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరు దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాంత సేవికా సమితి శారీరక్ ప్రముక్ లెక్కల రమాదేవి , జిట్స్ వేద పాఠశాల ప్రధాన చార్యులు కళకుట్ల వరప్రసాద్ఆచార్యులుమాట్లాడుతూ హిందూ ధర్మం ఎంతో పురాతనమైనదని, హిందూ ధర్మం విశిష్టమైన చరిత్ర కలిగి ఉందన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. సనాత ధర్మ పరిరక్షణ మనందరికీ శ్రీరామరక్ష లాంటిదన్నారు. ఆడపిల్లలను లవ్ జిహాద్ భారీ నుండి రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువత చెడు మార్గాలను అనుసరించకుండా, సన్మార్గం పైపు పయనించడానికి ఆలోచించాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవితాన్ని అలవర్చుకోవాలని, ధార్మిక, ఆధ్యాత్మిక మార్గాల వైపు మనసును మళ్లించుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. ధర్మాన్ని రక్షించినప్పుడే ఆ ధర్మం కూడా మనల్ని రక్షిస్తుందని తెలిపారు. శ్రీ అనంత పద్మనాభ స్వామి హిందూసమ్మేళనం కమిటీ బాధ్యులు , ఆర్ఎస్ఎస్ పెద్దలు కిషన్ జి, సామాజిక సమరత తెలంగాణ ప్రాంత కార్యదర్శి పూల్లూరి రామారావు, తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్, తిమ్మాపూర్ ఉప మండల ప్రముఖ్ కన్నం సాయి, తిమ్మాపూర్ ఉప మండలంలోని 8 గ్రామాల హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు.




# భీమాతోనే అందరికీ ధీమా

- ఎస్ బీ ఐ మేనేజర్ అశోక్ చౌహాన్

మంథని,ఏప్రిల్ 20 (మనం న్యూస్): ప్రతి ఒక్కరికి బీమా అనేది ఉండాలని, బీమా ఉంటేనే ధీమాగా ఉండొచ్చని ఎస్బిఐ బ్యాంకు మంథని మేనేజర్ అశోక్ చౌహన్ అన్నారు.సోమవారం బ్యాంకులో ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన పథకం కింద లబ్ధిదారులకు రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. మంథని విడ్స్ ఆర్గనైజషన్ ఆర్.బీ.ఐ వారి ఆర్థిక అక్షరాష్యత కేంద్రం సహకారంతో ఖాతాదారుడు సాబుద్దీన్ రూ.436 చెల్లింపు చేశాడన్నారు. అనారోగ్య కారణాల వల్ల సబుద్దీన్ చనిపోవడంతో కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు.ఈ కార్యక్రమంలో విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ అశోక్, పూజిత , అమ్మకుంటి సుధాకర్ పాల్గొన్నారు.

# సాహితీవేత్త తూము నర్సయ్యను అభినందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి, ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి): ప్రముఖ రచయిత, వ్యాఖ్యాత తూము నర్సయ్య సాహితీ కృషికి గాను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. సోమవారం నేను మీ నాను అనే పుస్తకాన్ని రచించిన సందర్భంగా నర్సయ్య ను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లా స్థాయిలో జరిగే వివిధ కార్యక్రమాలకు నర్సయ్య వ్యాఖ్యాతగా(యాంకర్ )వ్యవహరిస్తూ, తన వాక్చాతుర్యంతో అతిథులను, ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నారని కలెక్టర్ కొనియాడారు. నర్సయ్య రాసిన కవితలు సామాజిక స్పృహను, మానవ విలువలను, ప్రకృతి సౌందర్యాన్ని, ప్రేమానురాగాలను ప్రతిబింబిస్తున్నాయని, క్లిష్టమైన భావాలను సైతం సామాన్యులకు అర్థమయ్యేలా సరళమైన పదాలతో వ్యక్తీకరించడం నర్సయ్య ప్రత్యేకత అని, వారి కవితలు పాఠకులను ఆలోచింపజేస్తాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

నేను మీ నాను అనే పుస్తకాన్ని రచించిన సందర్భంగా నర్సయ్య కు జిల్లా కలెక్టర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో ఆయన మరిన్ని కవితా సంపుటాలను వెలువరించాలని, సాహితీ రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# నేడు మంగపేట మండలంలో ప్రజా దర్బార్ కార్యక్రమం

- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు, ఏప్రిల్ 20, మనం ప్రతినిధి: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగపేట మండలం మల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు, మంగపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 10:30 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో మంగపేట మండలంలోని మల్లూరు, మంగపేట గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాల పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ, డిఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



బిర్పూర్ ఏప్రిల్ 20( మనం న్యూస్ ): పోషణ పక్వాడలో భాగంగా బీర్పూర్ అంగన్వాడి కేంద్రంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ప్రాథమిక విద్య కంప్లీట్ చేసుకున్న పిల్లలకి అసెస్మెంట్ కారడ్స్ ఇవ్వడం జరిగింది. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ శైలజ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో ప్రీస్కూల్ అభ్యసించిన పిల్లలకి చురుకుదనము మెమరీ పవర్ ఎక్కువగా ఉంటుందని పిల్లల యొక్క అన్ని అభివృద్ధిలో ఈ యొక్క పూర్వ ప్రాథమిక విద్య లో చెందుతాయని అని అన్నారు ప్రతి ఒక్కరు అంగన్వాడీ కేంద్రానికి వచ్చి అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చేటువంటి ప్రతి సేవను ప్రతి ఒక్కరూ పొందగలరని మీ యొక్క పిల్లల భవిష్యత్తు కి మీరు తొలి అడుగు అని ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కూడా వివరిస్తూ ఆరు నెలల వయసు నిండిన పిల్లలకి అన్నప్రాసన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హరీష్, ఉప సర్పంచ్ జితేందర్, పంచాయతీ సెక్రెటరీ, అంగన్వాడీ టీచర్స్ సత్య గోదావరి సోనా పిల్లలు మరియు తల్లులు , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# విశ్వహిందూ పరిషత్ మంథని ప్రకండ అధ్యక్షుడిగా రావుల సతీష్

మంథని ఏప్రిల్ 20 (మనంన్యూస్): విశ్వహిందూ పరిషత్ మంథని ప్రకండ అధ్యక్షుడిగా మంథని పట్టణానికి చెందిన రావుల సతీష్ ఎన్నికయ్యారు. గోదావరిఖనిలోని శారదా నగర్ విశ్వహిందూపరిషత్ భవన్ లో పెద్దపల్లి జిల్లా విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన అభ్యాస వర్గ కార్యక్రమంలో మంథని ప్రకండ అధ్యక్షులు,మిగిలిన బాధ్యులను తెలంగాణ ఉపాధ్యక్షులు న్యాలకొండ భాస్కర్ రావ్,కరినగర్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్ ప్రకటించారు.మంథని ప్రకండ ఉపాధ్యక్షులు గా మదాడి నరేందర్ రెడ్డి,బోట్ల ఆంజనేయులు, దొరగోర్ల రవీందర్, సత్సంగ ప్రముక కొమురవెల్లి హరీష్ గుప్తా,ప్రధానకార్యదర్శిగా వడ్లకొండ శ్రావణ్, సహా కార్యదర్శులుగా గుండా శ్రీనివాస్,కజ్జం శ్యామ్,సత్సంగ్ సేవా ప్రముఖ్ సాయ షణ్ముఖ,ప్రచార ప్రముఖ్ తూర్పాటి రాము,న్గోరక్ష ప్రముఖ్ నూక శ్రీనివాస్, మందిర్మట్ ప్రముఖ్ మెడగొని రాజమౌళి గౌడ్ లు ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమం లో విశ్వ హిందూపరిషత్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శ్రీనివాస్ గుప్తా,జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం,జిల్లా సహా కార్యదర్శి అడిగొప్పుల రాజు,బజరంగదల్ జిల్లా సంయోజక్ సంపత్ పాల్గొన్నారు. ఈ బాధ్యతలకు సహకరించిన పెద్దపల్లి జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం,ఉపాధ్యక్షులు కొత్త శ్రీనివాస్ గుప్తా లకు వారు ధన్యవాదములు తెలిపారు.

# మైనారిటీల సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహణ




- వెల్ఫేర్ వీక్ సందర్భంగా విస్తృత కార్యక్రమాలు అమలు
- ఏప్రిల్ 20 నుంచి 26 వరకు విభిన్న అవగాహన, అభివృద్ధి కార్యక్రమాలు
- జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్ కుమార్ నాయుడు

పెద్దపల్లి, ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి): ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వెల్ఫేర్ వీక్ సందర్భంగా జిల్లా కలెక్టరేట్లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీల సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్ కుమార్ నాయుడు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముస్లిం మత పెద్దలు, క్రైస్తవ పాస్టర్లు, ఫాదర్లు పాల్గొన్నారు. వక్ఫ్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ సనా ఫారూక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముషారఫ్, పాస్టర్స్ అధ్యక్షుడు డేవిడ్, అశోక్, రాజు తదితరులు హాజరయ్యారు. సమావేశంలో మైనారిటీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, వాటి విస్తరణ, లబ్ధిదారులకు చేరవేతపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా వెల్ఫేర్ వీక్ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ఏప్రిల్ 20న ప్రజా ప్రతినిధులు, కమ్యూనిటీ పెద్దల సమక్షంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, ఏప్రిల్ 21న లబ్ధిదారులతో సమావేశాలు, మైనారిటీ మహిళలకు కుట్టు యంత్రాల పంపిణీ చేపడతారు. ఏప్రిల్ 22న యువతకు నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు టీజీఎంఆర్ సంస్థల్లో మరమ్మతుల గుర్తింపు చేపడతారు.ఏప్రిల్ 23న పేరెంట్-టీచర్ సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు అవసరమైన సహకారం అందిస్తారు. ఏప్రిల్ 24న ముస్లిం ఫకీర్, తుర్కా కాషా కమ్యూనిటీ సభ్యులతో సమావేశాలు, చర్చిల నిర్మాణాల పరిశీలన, ఉపాధ్యాయులకు సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 25న అర్హులైన మైనారిటీ మహిళలు, విధవలు, అనాథలతో సమావేశాలు నిర్వహించి ఆర్థిక సహాయం విస్తరణ, చర్చిలలో మరమ్మతులు, క్రీడా శిబిరాల ప్రారంభం చేపడతారు. ఏప్రిల్ 26న ర్యాలీలు, ఫోటో ప్రదర్శనలు నిర్వహించడం, ఎంపీడీవోలను సందర్శించి లబ్ధిదారుల ధృవీకరణ వేగవంతం చేయడం, టీజీఎంఆర్ సంస్థల్లో ఖాళీల భర్తీకి బడి బాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మైనారిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని, ప్రజలు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సూచించారు.

# మాజీ మంత్రి జీవన్ రెడ్డివి పూర్తిగా ప్యాకేజీ మాటలు

- జీవన్ రెడ్డిని ఐరన్ లెగ్‌గా భావిస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు.
- జీవన్ రెడ్డి చేరికపైన హరీష్ రావు వసంతృప్తి
- ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్ కుమార్



జగిత్యాల ఏప్రిల్ 20( మనం ప్రతినిధి ): మాజీ మంత్రి జీవన్ రెడ్డి గతంలో రేవంత్ కావాలి కేసీఆర్ పోవాలి అనే నినాదంతో ముందుకు సాగారని, ఒక మాసం నుండి రేవంత్ పోవాలి కేసీఆర్ రావాలి అని అంటున్నారని ఇవి పూర్తిగా కెసిఆర్ తో జీవన్ రెడ్డికి కుదిరిన ప్యాకేజీ మాటలేనని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాజీ మంత్రి జీవన్ రెడ్డి బి.ఆర్.ఎస్ లో చేరికపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవన్ రెడ్డి ని పార్టీలోకి చేర్చుకోవడానికి హరీష్ రావుకు, పార్టీలోని ఇతర నాయకులకు ఎవరికి ఇష్టం లేదని ఆయన అన్నారు. జీవన్ రెడ్డి ఎక్కడ కాలు పెడితే అక్కడ భయంకర పరిస్థితులు నెలకుంటాయని గతంలోని అనేక సంఘటనలు దీనికి ఉదాహరణలుగా ఎమ్మెల్యే తెలిపారు. జీవన్ రెడ్డి కారణంగా బీఆర్ఎస్ లో చీలిక వచ్చే ఛాన్స్ ఉందని పార్టీ శ్రేణుల్లో చర్చ మొదలైందనీ, జీవన్ రెడ్డి చేరిక బి ఆర్ ఎస్ కు ఒకరోజు పండగేనని ఎమ్మెల్యే ఎద్దేవ చేశారు.జీవన్ రెడ్డి వల్ల ఎన్ టి ఆర్,తక్కువ వ్యవధిలో నాదెండ్ల భాస్కర్ పదవి కోల్పోయారన్నారు. 2009 లో రెండవ సారి కాంగ్రెస్ అధికారం లోకి వచ్చినా వై ఎస్ ఆర్ స్వర్గస్థులు అయ్యారనీ దీంతో జగిత్యాల బి అర్ ఎస్ శ్రేణులు జీవన్ రెడ్డి నీ ఐరన్ లెగ్ గా భావిస్తున్నారన్నారు. జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించడానికి కూడా ఇష్టపడని హరీష్ రావు జీవన్ రెడ్డిని కలిసేందుకు రానన్నారని, అయినా కేటీఆర్ హరీష్ రావు ఇంటికి వెళ్లి బుజ్జగించి తనతో జగిత్యాల కు తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కేసీఆర్ ను కలవడానికి జీవన్ రెడ్డి ఫామ్ హౌస్ కు వెళ్లినప్పుడు కూడా హరీష్ రావు కనిపించలేదన్నారు. జీవన్ రెడ్డి కారణంగా బీఆర్ఎస్ లో చీలిక వచ్చే ఛాన్స్ ఉందని పార్టీ శ్రేణుల్లో చర్చ మొదలైందనీ, ఇప్పటికే కవిత బీఆర్ఎస్ నుంచి బయటకు పోయి కొత్త పార్టీ పెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలను గుర్తు చేశారు.జీవన్ రెడ్డి ఎపిసోడ్ తో మరింత కోపంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చేరిక నచ్చని కొందరు బి అర్ ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో జీవన్ రెడ్డి ఫ్లెక్సీ లు తొలగించారన్నారు. తాను రెండవ సారి ఎమ్మెల్యే గా గెలిచానని,ఇరిగేషన్ పై పూర్తి అవగాహన ఉందన్నారు.మేడిగడ్డ సభలో ముఖ్యమంత్రి ఇరిగేషన్ అభివృద్ధి పనుల పై స్పష్టమైన ఆదేశాలు హామీలు ఇస్తారని భావిస్తున్నాను అన్నారు.జగిత్యాల అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి తో కలిసి పనిచేస్తున్నానని, రాష్ట్ర స్థాయి రాజకీయాల్లో,జీవన్ రెడ్డి పార్టీ వీడడం లో తన జోక్యం ఎప్పుడు లేదన్నారు.ఈ కార్యక్రమంలో డి సి సి అధ్యక్షులు గాజంగి నందయ్య మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, టి పి సి సి సెక్రటరీ బండ శంకర్,పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్,మైనార్టీ అధ్యక్షులు మన్సూర్, ఎ ఎం సి ఛైర్మెన్ గడ్డంనారాయణరెడ్డి,సీనియర్ నాయకులు దామోదర్ రావు,గట్టు సతీష్,అబ్దుల్ ఖాదర్ ముజాహిద్,నక్కల రవీందర్ రెడ్డి,గోలి శ్రీనివాస్,జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్,కత్రోజ్ గిరి,శరత్ రావు,ముకేష్ ఖన్నా, కౌన్సిలర్ లు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో సిగాచి బాధితుల గళం

- బాధితుల వద్దకే వచ్చి విన్నపాలు స్వీకరించిన అదనపుకలెక్టర్ పాండు
- చికిత్స వేతనాలపై హామీ.



సంగారెడ్డి ఏప్రిల్ 20 మనం న్యూస్ ప్రతినిధి: పటాన్చెరువు నియోజకవర్గంలోని పాశం మైలారం సిగా చి పరిశ్రమ ప్రమాద బాధితులకు పూర్తిస్థాయి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నాడు నిర్వహించిన మహా ధర్నా కొనసాగింపుగా సోమవారం నాడు తెలంగాణ పీపుల్స్ జైంట్ యాక్షన్ కమిటీ టీపిజేఏసీ ఆధ్వర్యంలో బాధితుల ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ పాండు వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా బాధితుల దిన స్థితిని చూసి జిల్లా అదనపు కలెక్టర్ స్వయంగా బయటకు వచ్చి వారి సమస్యలను విన్నారు ప్రధానంగా శతఘాతుల చికిత్స వేతనాలు పై హామీ ఇచ్చారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దీర్ఘకాలికంగా వైద్యం పొందుతూ ఉన్న రాజేష్ కుమార్ చౌదరి, సుష్మ, దివ్వేల పరిస్థితిని కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు ఈఎస్ఐ వైద్యుల సలహా మేరకు ఆసుపత్రిలో వైద్యాన్ని తప్పనిసరిగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని దీనిపై కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి చికిత్సకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు రావలసిన పెండింగ్ వేతనాలను కంపెనీ ద్వారా ఇప్పించడం జరుగుతుందని బాధితులకు భరోసా కల్పించారు. మరణించిన 54 మంది కార్మికుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రకటించిన కోటి రూపాయల పరిహారం గురించి అదన కలెక్టర్ స్పందిస్తూ ఈ అంశం ప్రస్తుతం హైకోర్టులో ఉన్నందున కోర్టు తీర్పు ప్రకారం పరిహారం చెల్లింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిజేఏసీ జిల్లా ప్రతినిధులు శ్రీధర్ మహేంద్ర కోఆర్డినేటర్ ఆర్ లక్ష్మి కోకన్వీనర్ ఏ మానస బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున పార్టీ బీసీ కార్యదర్శి సుధాకర్ ప్రధాన కార్యదర్శి కోటి వీరమని ముత్యాన్ని శ్రీనివాసులు, శిగాచి బాధితులు పాల్గొన్నారు.

# మహాత్మ బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా



సంగారెడ్డి, ఏప్రిల్ 20 మనం న్యూస్ ప్రతినిధి : విశ్వగురు, మహాత్మ బసవేశ్వర 893 వ జయంతి సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం జోగిపేట చౌరస్తాలో ఉన్న వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త, దార్శనికుడు, కవి, రాజనీతిజ్ఞుడుగా అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. వారి బోధనలు, ఆశయాలు ఆచరణీయమన్నారు. 'పనే ప్రత్యక్ష దైవం' అని వారు బోధించారన్నారు. ప్రతి వ్యక్తి తన కష్టార్జితం తో జీవించాలని, శ్రమకు గౌరవం ఇవ్వాలని వారు చాటి చెప్పారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, లింగాయత్ సమాజం, సామాజికవేత్తలు,తది తరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల సాకారం

## ఆందోల్-జోగిపేటలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



సంగారెడ్డి, ఏప్రిల్ 20 మనం న్యూస్ ప్రతినిధి: పేదల స్వంత ఇంటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు బస్వాపురం మల్లమ్మ-మల్లయ్య, విజయలక్ష్మి-జగదీశ్వర్ ల ఇందిరమ్మ ఇంటిని మంత్రి మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు. స్వంత ఇల్లు కల నిజమవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా,మంత్రి మాట్లాడుతూ, పేదల గృహావసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గృహ నిర్మాణ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, ఎవరూ ఇల్లు లేకుండా ఉండకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఆందోల్ - జోగిపేటలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం శరవేగంగా నిర్మాణం పూర్తి అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ మాధురి,మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్ రేఖ-ప్రవీణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో 141 వినతులు స్వీకరణ



- తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించిన అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి, ఏప్రిల్ 20 (మనం జిల్లా ప్రతినిధి): కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ అర్జీదారుల నుంచి 141 దరఖాస్తులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల వినతులను స్వీకరించిన ఆయన, సంబంధిత శాఖాధికారులతో కలిసి వాటిని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న అదనపు కలెక్టర్, ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.

# రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలు

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ముస్తాబాద్ మండలం గూడెం, తంగళ్ళపల్లి మండలం తాడూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రాల ప్రారంభం



ముస్తాబాద్/ తంగళ్ళపల్లి, ఏప్రిల్ -20(మనం న్యూస్ ): రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వ మద్దతు అందించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో ఐకేపీ ఐకేపీ ఆధ్వర్యంలో, తంగళ్ళపల్లి మండలం తాడూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన టెంట్, నీటి వసతి పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. ధాన్యం తేమ శాతం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా రైతుల సౌకర్యం కోసం ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఇతర శాఖల ఆధ్వర్యంలో మొత్తం 239 కొనుగోలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సరైన తేమ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ పై ఇప్పటికే మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖ, జిల్లా వ్యవసాయ అధికారి, సహకార శాఖ అధికారి, రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించామని గుర్తు చేశారు. కొనుగోలుకు కావలసిన ఎలక్ట్రానిక్ యంత్రాలు, గన్ని సంచులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వేసవి నేపథ్యంలో రైతుల కోసం టెంట్లు, నీటి వసతి, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్లు తలారి రాణి, స్వరూపారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింగం, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ గీత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, అఫ్జల్ బేగం, తహసీల్దార్లు ఫరూఖ్, విజయ ప్రకాష్ రావు, ఎంపీడీఓ లచ్చాలు, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ ప్రవేశ పరీక్షకు అని ఏర్పాటు చేయాలి

- పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పులు జరగవద్దు
- నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదు
- స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి



నల్లగొండ-- ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి): నీట్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మే 3 న నిర్వహించే నీట్ పరీక్ష పై అధికారులతో సమావేశం నిర్వహించారు.పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పులు దొర్లకుండా పక్కాగా ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు.మే 3న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందని,జిల్లాలో మొత్తం 2,318 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎన్జీ కాలేజ్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు పరీక్షకు ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు మాత్రమే పరీక్ష కేంద్రాలకు అనుమతి కల్పిస్తామని తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం కేంద్రాల వద్ద తాగునీరు,మూత్రశాలలు (వాష్రూమ్స్),పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఏ ఎస్ పి రమేష్,నీట్ పరీక్ష జిల్లా కోఆర్డినేటర్ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సెంటర్ సూపర్డెంట్లు, విద్యాశాఖ మున్సిపల్ కమిషనర్ వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# పైసలతో పబ్లిక్ షో? జగిత్యాల రాజకీయాల్లో కొత్త వివాదం



- బస్ ఎక్కు పైసలు పట్టు

జగిత్యాల ఏప్రిల్ 20( మనం ప్రతినిధి ): జగిత్యాలలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నేపథ్యంలో జన సమీకరణ ప్రధాన అజెండాగా మారగా, అందుకోసం భారీగా నగదు పంపిణీ జరిగిందనే చర్చ జిల్లావ్యాప్తంగా జోరందుకుంది. బస్ ఎక్కు పైసలు పట్టుఅన్న విధంగా ప్రజలను ఆకర్షించారని స్థానికంగా ప్రచారం సాగుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు, రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామ శివారులో నగదు పంపిణీ జరుగుతుందన్న సమాచారంతో వెళ్లినప్పుడు, బహిరంగ సభకు వెళ్తున్న ఓ ప్రైవేట్ స్కూలు బస్సు బస్సులో విఐపి పాస్ కలిగిన ఓ వ్యక్తి ప్రజలకు డబ్బులు అందజేస్తున్న దృశ్యాలు కెమెరాకు చిక్కాయి. ఈ సందర్భంగా చిత్రీకరణ జరుగుతుండగా,అక్కడ ఉన్న ఓ యువకుడు ఫోటోలుతీస్తే తీసుకోండినెట్లో పెడితే పెట్టుకోండి, పేపర్లో వేస్తే వేసుకోండిమేమే దొరికామా! ఏమైనా చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా స్పందించడం గమనార్హం.సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో గ్రామాలు, వార్డుల స్థాయిలో మధ్యవర్తులను వినియోగించి ప్రజలకు నగదు అందజేసినట్లు ప్రతిపక్ష వర్గాలు కూడా ఆరోపిస్తున్నాయి. బస్సులు, ఇతర వాహనాల ద్వారా పెద్ద ఎత్తున జనాన్ని తరలించేందుకు ముందుగానే ప్రణాళిక రచించి నగదు పంపిణీ చేసినట్లు సమాచారం. కొంతమంది ప్రజలు పేరు వెల్లడించకుండా మాట్లాడుతూ సభకు హాజరవ్వాలంటే డబ్బు ఇచ్చిన ఘటనలు నిజమేనని చెబుతున్నారు. దీంతో ఈ వ్యవహారం కేవలం రాజకీయ కార్యక్రమం కాకుండా, ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు లేవనెత్తే అంశంగా మారింది.రాజకీయ విశ్లేషకులు మాత్రం ఇలాంటి పద్ధతులు తాత్కాలికంగా జనాన్ని సమీకరించగలిగినా, దీర్ఘకాలంలో ప్రజల నమ్మకాన్ని దెబ్బ తీస్తాయని అభిప్రాయ పడుతున్నారు. సభలో కనిపించిన జనసందోహం వెనుక నిజమైన ప్రజా మద్దతా? లేక నగదు ప్రలోభమా? అన్న చర్చ ఇప్పుడు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్గా మారింది.

# జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ను మర్యాదపూర్వకంగా కలిసిన విద్యుత్ శాఖ ఎస్ఈ

## ఐదు కొత్త సబ్ స్టేషన్ల ఏర్పాటుకు భూసేకరణపై చర్చ



సిరిసిల్ల, ఏప్రిల్ 20:(మనం న్యూస్ ): రాజన్న సిరిసిల్ల ఎన్పీడీసీఎల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన టి. వేణుమాధవ్, సోమవారం జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్లో జరిగిన ఈ భేటీలో ఆయన కలెక్టర్కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, లోడ్ సామర్థ్యానికి అనుగుణంగా కొత్తగా నిర్మించ తలపెట్టిన సబ్ స్టేషన్ల గురించి ఎస్ఈ వివరించారు. జిల్లాలోని ఈ క్రింది గ్రామాల్లో 5 కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. నూకలమర్రి, సుభాష్నగర్, నర్సింగాపూర్ మల్లారెడ్డిపేట్, పాపయ్యపల్లి ఈ సబ్ స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపు విషయమై ఎస్ఈ వేణుమాధవ్ కలెక్టర్ను కోరగా, ఆమె సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేస్తూ, సబ్ స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన భూమిని త్వరగా మంజూరు చేయాలని సూచించినట్లు ఎస్ఈ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈతో పాటు డివిజనల్ ఇంజనీర్ ఎన్. అంజయ్య, ఏడీఈలు రఘునాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెంచాలి

- రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు



సంగారెడ్డి, ఏప్రిల్ 20 మనం న్యూస్ ప్రతినిధి : రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చొంగ్తు సోమవారం సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ లతో సమావేశమై ఆయా విభాగాల పనితీరు, రోగులకు అందుతున్న సేవల నాణ్యత, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంచడం అత్యంత ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ప్రతి వైద్యుడు బాధ్యతతో, సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. రోగులకు సమయానికి నాణ్యమైన చికిత్స అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పేషెంట్కు సంబంధించిన వివరాలు అవుట్పేషెంట్/ఇన్ పేషంట్ ప్రిస్క్రిప్షన్లు, ల్యాబ్ రిపోర్టులు, ఫార్మసీ వివరాలు తదితర అన్ని సమాచారం తప్పనిసరిగా హెల్త్ ప్రొఫైల్లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ విధానం ద్వారా రోగి ఎక్కడైనా చికిత్స పొందినప్పటికీ పూర్తి ఆరోగ్య చరిత్ర అందుబాటులో ఉండి, సరైన వైద్య సేవలు అందించడానికి సులభతరం అవుతుందని తెలిపారు. సైకియాట్రిక్, జెరియాట్రిక్, అడిక్షన్ మరియు ట్రాన్స్ జెండర్ రోగులకు ప్రత్యేక కౌన్సిలింగ్ సేవలు అందించాల్సిందిగా సూచించారు. ఇందుకోసం సామాజిక సోషల్ వర్కర్, కౌన్సిలర్ ను ఏర్పాటు చేసుకోవడానికి చర్యలు చేపట్టాలన్నారు. క్యాన్సర్ డే కేర్ సెంటర్ లో క్యాన్సర్ పేషెంట్లకు తగిన వైద్య చికిత్సలు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవా లన్నారు. అవుట్పేషెంట్ సేవలు (ఓ పి ఎస్) అన్ని ఒకే చోట సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాటు చేయడానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీఎంఎస్ ఐ డి సీ ఇంజనీర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ చికిత్స విభాగం, అడిక్షన్ ట్రీట్మెంట్ సెంటర్, జీరియాట్రిక్ విభాగాలను,క్రిటికల్ కేర్,ఫార్మసి, అవుట్పేషెంట్ సేవలను ప్రత్యక్షంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరేంద్ర కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వసంత్ కుమార్, డా. అనిల్ కుమార్, వివిధ విభాగాల హెచ్ ఓ డీలు, టీజీ ఆన్లైన్ బృందం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# మెంటల్ బ్యాలెన్స్ తప్పిన కాళేశ్వరరావు

## కబ్జాకోరుల కబ్జా స్థలంలో మీటింగ్ పెట్టి విమర్శలా

## 'సీతారామ'పై మాట్లాడే నైతిక హక్కు లేదు

## మాజీ మంత్రి హరీశ్ రావుపై మంత్రి తుమ్మల ధ్వజం

**ఖమ్మం, ఏప్రిల్ 20(మనం బ్యూరో):** బిఆర్ఎస్‌లో తగిన ప్రాధాన్యం లేక హరీష్ రావు మెంటల్ బ్యాలెన్స్ తప్పారని, భూకబ్జాలు గుర్చి నీతులు చెప్పే హరీష్ రావు ఆదివారం మీటింగ్ పెట్టింది కబ్జా కోరుల స్థలంలోనేనని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘాటుగా విమర్శించారు. ఆదివారం జరిగిన బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో హరీష్‌రావు చేసిన విమర్శలకు ఖమ్మంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరరావుగా ముద్రపడ్డ హరీష్ రావు కాంగ్రెస్‌కు నీతులు చెబుతున్నాడని, సొంత పార్టీలో రాజకీయ భవిష్యత్ కోసం మానసిక దౌర్భాగ్యంతో మాట్లాడుతున్నారని విమరిశంచారు. కబ్జాదారుడు, అవినీతి కాంట్రాక్టర్ ను పక్కన పెట్టుకుని నీతులు చెప్పడం ఆయనకే చెల్లిందన్నారు. రుణమాఫీ పై, సీతారామ ప్రాజెక్టుపై మాట్లాడే నైతిక హక్కు హరీష్ రావుకు లేదన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒకే సారి రెండు లక్షల కోట్లు రుణమాఫీ చేసిన చరిత్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదన్నారు. బిఆర్ఎస్ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామన్నారు. కబ్జాలు కమీషన్ల విషయంలో దేశంలోనే ఏ పార్టీకి లేని చరిత్ర మీదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో సీతారామ ప్రాజెక్టు గుర్చి మీ గొప్పగా చెబుతున్నారు కానీ మీ పాలనలోనే ఆ ప్రాజెక్టును పడావు పడేశారని అన్నారు. సెంట్రల్ వాటర్ కమీషన్ అనుమతులు లేకుండా కమీషన్ల కోసం ప్రాజెక్ట్ ను నిర్లక్ష్యం చేశారన్నారు. మీ పాలనలో నిలిచిన సీతారామ ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో పూర్తి చేస్తున్నామన్నారు. నీ సిద్దిపేటకు వస్తా.. రైతాంగ శ్రేయస్సు కోసం స్ట్రాటజిక్ లొకేషన్ లో పెట్టిన పామాయిల్ ఫ్యాక్టరీ పై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మకానికి పట్టాదారు

**ఎకరానికి రూ.2,000 క్వింటాకు రూ.250**



**కొణిజర్ల, ఏప్రిల్ 20 (మనం న్యూస్):** మండలంలో మొక్కజొన్న కొనుగోలు వ్యవహారంలో సంచలన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. రైతుల పేర్లపై ఉన్న పట్టాదారు పాస్పుస్తకాలను దళారులు ఎకరానికి రూ.2,000, క్వింటాకు రూ.250 వరకు నగదు ఇచ్చి కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యేకంగా సీడ్ మొక్కజొన్న సాగు చేసిన రైతుల నుంచి పాస్పుస్తకాలను సేకరించడంతో పాటు, అసలు మొక్కజొన్న సాగు చేయని వ్యక్తుల పేర్లపై ఉన్న పాస్పుస్తకాలను కూడా వినియోగించి కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న అమ్ముతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా దళారులు భారీ లాభాలు ఆర్జిస్తున్నారని వారు అంటున్నారు. దళారులు, పెద్ద రైతులు కలిసి వ్యవస్థను తమకు అనుకూలంగా మలుచుకుంటుండటంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంగబలం, ఆర్థిక బలం ఉన్నవారు ముందుగానే తమ ధాన్యాన్ని లోడింగ్ చేయించుకుంటుండగా, సాధారణ రైతులు వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# పోషకాహార పంపిణీ పారదర్శకంగా సాగాలి

- 38వ డివిజన్ లో పోషణ పక్వాడా కార్యక్రమాలు
- పాల్గొన్న 36,38,45వ డివిజన్ కార్పొరేటర్లు

**పాల్వంచ, ఏప్రిల్ 20(మనం న్యూస్):** పట్టణ పరిధి టీచర్స్ కాలనీ, గట్టాయిగూడెం, ఒడ్డుగూడెం, సబ్స్టేషన్ ఏరియా, మార్కెట్ ఏరియా పరిసర ప్రాంతాల అంగన్వాడీ కేంద్రాలను సమన్వయం చేస్తూ.. 38వ డివిజన్లో పోషణ పక్వాడా కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో 38వ డివిజన్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్, 36వ డివిజన్ కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి, 45వ డివిజన్ కార్పొరేటర్ దంతెభోయిన నరేష్. లు పాల్గొని, ఆశీర్వదించారు. వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం చాలా ముఖ్యమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పరిశుభ్రత, సమతుల్య ఆహారం, తల్లి-శిశు సంరక్షణపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. వెంగళరావు నగర్ అంగన్వాడీ సూపర్వైజర్ నండ్రు దీప ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు పెరుమాళ్లపల్లి సౌభాగ్యం, జిల్లేపల్లి సుగుణవాణి, ఎన్నబోయిన ప్రమీల, ఎస్కె మౌలాలి, గడ్డం గీత, నందిగామ నాగులు, బండి కళావతి, నూరునిస్స పాల్గొన్నారు. మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# సీఆర్టీ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు సర్టిఫికెట్ల ప్రదానం



**ఖమ్మం, ఏప్రిల్ 20(మనం న్యూస్):** ఖమ్మం రూరల్ మండలంలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఒక వారం రోజుల క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ (సిఆర్‌టి) కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులకు సోమవారం సర్టిఫికేట్లను ఘనంగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణను సమర్థవంతంగా పూర్తిచేసుకున్న విద్యార్థినులు భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను సులభంగా అందిపుచ్చుకోవచ్చని, ఇలాంటి కార్యక్రమాలు వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి గోపాల్ మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా విద్యార్థినులు అప్టిట్యూడ్, కమ్యూనికేషన్, టెక్నికల్ నైపుణ్యాలలో గణనీయమైన పురోగతి సాధించారని, సర్టిఫికేట్లు వారి కెరీర్లో ఒక మైలురాయిగా నిలుస్తాయని అన్నారు. ఐటీ కర్వ్ సంస్థ ఫౌండర్ శరణ్యారామ్ మాట్లాడుతూ, ఈ శిక్షణలో విద్యార్థినుల చురుకైన పాల్గొనడం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ, విద్యార్థినులు పొందిన ఈ శిక్షణను ప్రాయోగికంగా ఉపయోగించుకొని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, మరియు శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు పాల్గొన్నారు.

# అంగన్వాడి టీచర్లకు మొబైల్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే

## 25 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు



**దమ్మపేట,ఏప్రిల్ 20(మనం న్యూస్):** దమ్మపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో 134 మంది టీచర్లకు ఎంఎల్ఏ జారె ఆదినారాయణ సెల్ ఫోన్లను అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమానికి అంగన్వాడి సేవలు ఎంతో కీలకమని వారికి సాంకేతిక సదుపాయాలు అందించడం ద్వారా అంగన్వాడి టీచర్లు తమ విధులను మరింత సమర్థవం తంగా నిర్వహించగలరని అన్నారు. అనంతరం దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా మంజూరు చేయబడి నిర్మాణం పూర్తి అయిన 25 ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలు సొంత ఇల్లు కలిగి ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ ప్రజల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నా మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వాసం రాణి, శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, నియోజకవర్గ హౌసింగ్ పరిశీలకు లు జి రాము, ఐసిడిఎస్ అధికారులు హౌసింగ్ అధికారులు,ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వివిధ వార్డుల ధార రమేష్, (రాము ) పానుగంటి లక్ష్మణ్, రూపా రాంబాబు, కాంగ్రెస్ నాయకులు కక్కిరాల రమేష్, రావు గంగాధర్ రావు,టౌన్ అధ్యక్షులు చిన్నశెట్టి చిట్టిబాబు, చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు,కందుల వెంకటేశ్వరరావు, జగ్గారం సర్పంచి వంకా జానకి రాముడు, అంకంపాలెం సర్పంచ్ మోకాళ్ళ గురుమూర్తి, పట్వారిగూడెం ఉపసర్పంచ్ బొల్లికొండ నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# కలెక్టరేట్ లో సెంట్రల్ రికార్డ్ రూం ప్రారంభం

- జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 20 (మనంప్రతినిధి):** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'సెంట్రల్ రికార్డ్ రూం'ను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయానికి చెందిన పాత రికార్డులను ఒకే చోట భద్రపరచడం, రికార్డుల ప్రక్షాళన చేయడం, అలాగే డిజిటలైజేషన్ ద్వారా రికార్డులను సులభంగా గుర్తించి వినియోగించుకునేలా ఆధునిక సదుపాయాలను ఈ కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సెంట్రల్ రికార్డ్ రూం ఏర్పాటు యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయడం, అవసరమైన పత్రాలను వేగంగా అందుబాటులోకి తేవడం, పాత రికార్డుల భద్రతను నిర్ధారించడం, డిజిటల్ విధానాల ద్వారా పారదర్శకతను పెంపొందించడం అని కలెక్టర్ తెలిపారు. రికార్డుల డిజిటలైజేషన్ వల్ల సమయం, శ్రమ ఆదా కావడంతో పాటు, భవిష్యత్లో ఈ-ఆఫీస్ విధానాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,కలెక్టరేట్ ఏవో అనంత రామకృష్ణ, కలెక్టరేట్ సూపర్డెంట్లు , ఎలక్షన్ సూపర్డెంట్ రంగ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుధ్యం ప్రాధాన్యంతో డెంగ్యూ, మలేరియా వ్యాధులకు అడ్డుకట్ట

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- ముందస్తు జాగ్రత్తలపై మండల ప్రత్యేక అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్



**ఖమ్మం, ఏప్రిల్ 20(మనం బ్యూరో):** పారిశుధ్యం ప్రాధాన్యంతో డెంగ్యూ, మలేరియా వ్యాధులకు ముందస్తుగా అడ్డుకట్ట వేయవచ్చని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డెంగ్యూ,మలేరియా వ్యాధుల నియంత్రణపై ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత మండల ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో జిల్లాలో వెక్టర్ బార్న్ ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లా అధికారులు ఫీల్డ్ సందర్శనలు నిర్వహించే సమయంలో ఎక్కడైనా పారిశుధ్యం మెరుగుపరచాల్సిన అవసరం ఉంటే వెంటనే సంబంధిత పంచాయతీ లేదా మున్సిపాలిటీ దృష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దోమలు నీటిలో పెరుగుతాయని, ఎక్కడా నీటి నిల్వలు ఉండకూడదని, తాగునీటి లీకేజీలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న పొదలను తొలగించి దోమల పెరుగుదలకు అవకాశం ఇవ్వకూడదన్నారు. ప్రజల్లో పారిశుధ్యంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి వెక్టర్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని, మలేరియా, డెంగ్యూ కేసులను వెంటనే గుర్తించి చికిత్స అందించాలనిసూచించారు. ప్రతి గ్రామంలో మే నెలలోనే ఆయిల్ బాల్స్ సరిపడా నిల్వ ఉంచాలని, మండల స్పెషల్ అధికారులు తమ పర్యటనల్లో వాటి నిల్వలను తనిఖీ చేయాలని ఆదేశించారు. పి.హెచ్.సీ స్థాయిలో అవసరమైన టెస్ట్ కిట్లు, మందులు సిద్ధంగా ఉంచాలని, దీనికి డీఎంహెచ్ఓ బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో నమోదయ్యే డెంగ్యూ కేసులను తప్పనిసరిగా నోటిఫై చేయాలని, ఆ ప్రాంతాల్లో తక్షణ పారిశుధ్య చర్యలు, టెస్టింగ్ నిర్వహించాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న నిర్మాణ పనులు, ప్రాజెక్ట్ ప్రాంతాలను పరిశీలించి దోమల పెరుగుదలకు అనుకూలమైన ప్రదేశాలను గుర్తించి ఆయిల్ బాల్స్ వినియోగించాలనీ సూచించారు. గత చరిత్ర ఆధారంగా గుర్తించిన హాట్ స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో ప్రత్యేక శుభ్రత చర్యలు చేపట్టి పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మిల్లర్లు తప్పనిసరిగా నాణ్యమైన ధాన్యాన్ని స్వీకరించే విధంగా చూడాలని, కొనుగోళ్లలో ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డిపిఓ రాంబాబు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్లు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శ్రీజ
- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు



**ఖమ్మం, ఏప్రిల్ 20(మనం బ్యూరో):** ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ పి. శ్రీనివాస్ రెడ్డి ప్రజల అర్జీలను స్వీకరించారు. చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన రాయల గోవింద రావు పీఎం ఉపాధి కల్పన పథకం కింద ఈడిపి ట్రైనింగ్ అందుబాటులో లేకపోవడం ఆన్లైన్ పోర్టల్ లోపల లోన్ ప్రాసెస్ ఆలస్యం అవుతున్న విషయం గురించి ఫిర్యాదు అందించగా కే.వి.ఐ.బి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కొణిజెర్ల మండలం చిన్న గోపతీ గ్రామానికి చెందిన జి. ప్రసాద్ రావు తనకు సర్వే నెంబర్ 131 లో 39 గుంటల భూమి ఉందని, 19.5 గుంటల భూమి పట్టా పాస్ పుస్తకం ఉందని, మిగిలిన 19.5 గుంటల భూమి పట్టా పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం అర్బన్ మండలం అల్లిపురం గ్రామానికి చెందిన ఎస్కె హుస్సేన్ తనకు 4 సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చిందని, తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా డిఆర్డిఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు కష్టాల్లో శాఖ చేతులు ఎత్తేసిందా?

## రైతు-శాఖకు మళ్లీ ఆదర్శ రైతులే దారి?

**కొణిజర్ల, ఏప్రిల్ 20 (మనం న్యూస్):** కొణిజర్ల మండలంలో వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. సాగుభూమి విస్తీర్ణం భారీగా ఉన్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో అవసరమైన అధికారులు లేకపోవడంతో రైతులు అల్లాడుతున్నారు. మండలంలో పట్టాదారులు, ఆర్ఓఎఫ్ఆర్ కలిపి సుమారు 50,000 ఎకరాల సాగుభూమి ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 5,000 ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారి ఉండాలి. ఈ లెక్కన కనీసం 10 మంది ఏఈఓ లు అవసరం ఉన్నప్పటికీ, ప్రస్తుతం కేవలం ఇద్దరు రెగ్యులర్ అధికారులు మాత్రమే విధులు నిర్వహించడం గమనార్హం. గతంలో పనిచేసిన వ్యవసాయ అధికారులు సరైన నివేదికలు ఇవ్వకపోవడం వల్ల మండలానికి తక్కువ సంఖ్యలోనే ఏఈఓలు సరిపోతారని ప్రభుత్వానికి తెలియజేసినట్లు సమాచారం. దాని ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. పల్లిపాడు, మునగాల, తనికెళ్ల ప్రాంతాల్లో ఇంచార్జ్ అధికారులతో పనులు నెట్టుకొస్తుండగా, కొణిజర్ల, గుబ్బగుర్తి క్లస్టర్లలో అసలు అధికారులు లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. దీంతో రైతులు పంట నమోదు చేయించుకోవడంలో, పంట ధృవీకరణ పత్రాలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో రైతులు రోజులు తిరుగుతూ సమయం, డబ్బు రెండూ కోల్పోతున్నారు. జిల్లాలోని అనేక మండలాల్లో ఇదే పరిస్థితి ఉందని సమాచారం.ఇదే సమయంలో గతంలో ఉన్న ఆదర్శ రైతుల వ్యవస్థను రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ఆ సమయంలో గ్రామ స్థాయిలో ఆదర్శ రైతులు వ్యవసాయ శాఖకు వారధిలా పనిచేసి, పంటల వివరాలు సేకరించడం, సమస్యలు తెలియజేయడం, పథకాల అమలు సులభతరం చేయడం వంటి పనులు నిర్వహించేవారు. దీంతో రైతులకు సేవలు వేగంగా అందేవి. ప్రస్తుతం అలాంటి వ్యవస్థ లేకపోవడం, అలాగే క్షేత్ర స్థాయిలో అధికారులు లేకపోవడం వల్ల సమాచారం లోపం, ఆలస్యం, అవకతవకలు పెరుగుతున్నాయని రైతులు అంటున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని ఖాళీగా ఉన్న క్లస్టర్లలో ఏఈఓ లను నియమించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రెగ్యులర్ నియామకాలు సాధ్యం కాకపోయినా, కనీసం కాంట్రాక్ట్ విధానంలో అయినా నియామకాలు చేపడితే రైతులకు కొంత ఉపశమనం లభిస్తుందని వారు భావిస్తున్నారు.



# డీఎస్పీ నికత్ జరీన్‌ను డిజిపి అభినందనలు

**హైదరాబాద్: ఏప్రిల్ 20(మనం,ప్రత్యేక ప్రతినిధి):** మంగోలియాలోని ఉలాన్‌బాటర్‌లో జరిగిన బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో కాంస్య పతకాన్ని సాధించిన డిఎస్పీ నిఖత్ జరీన్‌ను డీజీపీ శివధర్ రెడ్డి అభినందించారు. ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు అంతర్జాతీయ స్థాయిలో జరిగిన పోటీలలో నిఖత్ జరీనా అద్భుత ప్రదర్శనతో రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచిందన్నారు. ఈ క్రమంలో నిఖత్ జరీన్ ప్రతిభను డిజిపి కొనియాడటంతో పాటు భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీజీపీ ఆకాంక్షించారు.అదేవిధంగా, ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్, తెహ్రీ లేక్ వేదికగా ఏప్రిల్ 8 నుండి 12 వరకు నిర్వహించిన '25వ ఆల్ ఇండియా పోలీస్ వాటర్ స్పోర్ట్స్ క్లస్టర్ పోటీల్లోనూ తెలంగాణ పోలీసులు సత్తా చాటారని డీజీపీ తెలిపారు. రోయింగ్ కాక్స్‌లెస్ పెయిర్ - 500 మీటర్ల విభాగంలో 1వ బెటాలియన్ టీజీఎస్పికి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎన్. రామకృష్ణ , సీఏఆర్ సిద్దిపేటకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ జె. రాజు వారి ప్రతిభ చూపి రజత పతకాన్ని కైవసం చేసుకోవడంతో వారిని డిజిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల అదరపు డిజిపి మహేష్ ఎం భగవత్, స్పోర్ట్స్ ఐజిపి గజరావు భూపాల్, స్పోర్ట్స్ ఆఫీసర్ రామారావు, కోచ్ పి. కృష్ణారావు (హెడ్ కానిస్టేబుల్, డీఏఆర్ వనపర్తి) తదితరులు పాల్గొన్నారు



# సమగ్ర ఓటర్ జాబితా రూపకల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

- నాగర్ కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, బాదావత్ సంతోష్



ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 20 (మనం బ్యూరో):జ జిల్లాల్లో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా 100% పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయము నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఈ. ఆర్. ఓ.లు, ఎ. ఈ. ఆర్. ఓ. లతో 2002 ఓటర్ జాబితా ప్రకారం ప్రస్తుత ఓటర్ జాబితాలో ఉన్న ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం సుదీర్ఘంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ....., ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ దృష్ట్యా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పట్టణ ప్రాంతాలలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని దిశ నిర్దేశం చేశారు. నిర్దిష్ట గడులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రానున్న వారంలోగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో వృద్ధి నమోదు కావాలన్నారు. మ్యాపింగ్ ప్రక్రియతో పాటు ఓటర్ల జాబితాలో బ్లర్ ఫోటోగ్రాఫ్/స్మాల్ ఫోటోగ్రాఫ్, ఇంప్రాపర్ ఫోటోగ్రాఫ్ ల గుర్తింపు చేపట్టాలన్నారు. ఫారం 8 ద్వారా అసలైన ఫోటోగ్రాఫ్ సేకరించి నవీకరించాలని తెలియజేశారు. ఈ ప్రక్రియను ఈ నెల చివరి తేదీలోగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....., నాగర్ కర్నూల్ జిల్లాలో ఉన్న నాగర్ కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న 7,38,439 మంది ఓటర్లు గాను ఇప్పటి వరకూ 4,74,767 మంది ఓటర్లను 2002 ఓటర్ జాబితా ప్రకారం గుర్తించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందన్నారు. 64.29% మ్యాపింగ్ ప్రక్రియ జరిగిందని తెలిపారు.

రానున్న 10 రోజులో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో మ్యాపింగ్ శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాదావత్ సంతోష్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆర్డీవోలతో సమావేశం నిర్వహించి, 2002 ఓటర్ జాబితా ప్రకారం, ప్రస్తుతం ఓటర్ జాబితాలో ఉన్న ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆర్డీవోలను కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని మూడు నియోజకవర్గాల పురోగతిని గణాంకాల ఆధారంగా కలెక్టర్ సమీక్షించారు. ఓటరు జాబితాలో డూప్లికేట్ ఎంట్రీలు, సమానమైన వివరాలు, బ్లర్ ఫోటోలు వంటి లోపాలను సరిదిద్దడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లాలో స్వీకరించిన దరఖాస్తులు, ఎంట్రీలు, సవరణలు, తొలగింపులు, నవీకరణల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ ఆర్డీవో సురేష్ బాబు, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సమానత్వాన్ని చాటిన మహాత్మా బసవేశ్వరుడు

- బసవేశ్వరుని ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్
- నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కుచ్చకుళ్ళ డాక్టర్ రాజేష్ రెడ్డి



ఉమ్మడి మహబూబ్ నగర్ ఏప్రిల్ 20 (మనం బ్యూరో): వందల సంవత్సరాల క్రితమే వే,?కుల, వర్ణ, లింగ వివక్షను వ్యతిరేకించి సర్వమానవ సమానత్వాన్ని చాటి చెప్పిన మహాత్ముడు బసవేశ్వరుడని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కుచ్చకుళ్ళ డాక్టర్ రాజేష్ రెడ్డి పేర్కొన్నారు. మహాత్మ బసవేశ్వరుడి జయంతి సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వరుడి జయంతి వేడుకలకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూల్ శాసనసభ్యుడు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి హాజరై బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....., బసవేశ్వరుడు సాంప్రదాయక సమాజంలో కుల, మత భేదాలకు వ్యతిరేకంగా పోరాడిన ఒక అభ్యుదయ వాదని తెలిపారు. మానవతా విలువలను ఆచరణలో పెట్టడం ద్వారా ఆ మహనీయుడి ఆశయాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. బసవేశ్వరుడి మార్గంలో ప్రతిఒక్కరు నడవాలన్నారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులకు శ్రీకారం చుట్టిన గొప్ప సంస్కర్త మహాత్మా బసవేశ్వరుడని కొనియాడారు. ఆయన బోధించిన అభ్యుదయవాద సంప్రదాయమే నేడు లింగాయత్ ధర్మంగా మారిందన్నారు. 12వ. శతాబ్దంలోనే మహిళలకు సముచిన స్థానం కల్పించారన్నారు. బసవేశ్వరుడు చెప్పిన సిద్ధాంతాలను కేవలం మాటల్లో కాదు, మన జీవితాల్లో ఆచరణలో పెట్టి ఆయన చూపిన మార్గంలో నడిచినప్పుడే ఆయనకు మనం నిజమైన గౌరవం తెలిపినట్లవుతుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ....., మూఢనమ్మకాల పైన నిరంతరం పోరాటం చేసిన మహానుభావుడు బసవేశ్వరుడన్నారు. ప్రప్రథమ సంఘసంస్కర్త సమతవాదని ఎమ్మెల్యే ప్రశంసించారు. అణగారిన వారి వర్గాల పట్ల ఆశావాది నిరంతర మార్గదర్శకుడన్నారు. బసవేశ్వరుని మార్గాన్ని ముందుకు సాగాలని, సమాజ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే తెలిపారు. ఆ రోజుల్లోనే స్త్రీలకు సమాన అవకాశాలు కల్పించారన్నారు. లింగాయత్ కుల సంఘ నాయకులు నాగర్ కర్నూల్ పట్టణంలో బసవేశ్వరుని విగ్రహం బసవేశ్వర భవన ఏర్పాటుకు కృషి చేయాలని కోరగా అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ శాఖ అధికారి శ్రీరాములు, జిల్లా గౌరవ అధ్యక్షుడు జెమిని సురేష్, జిల్లా ప్రెసిడెంట్ గిరిజ శంకర్, సెక్రెటరీ రాజేష్, మమ్మాయిపల్లి రాజు, మహదేవన్పేట రవిశంకర్, రాజేష్ వీరశైవ లింగాయత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బంజారా మట్టిలో మాణిక్య డాక్టర్ పోరిక సాయి కృష్ణ



హనుమకొండ్ల, ఏప్రిల్ 20(మనం న్యూస్): ములుగు జిల్లా మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక కుటుంబం వివిధ శాఖల్లో ప్రతిభ చాటుతూ ఉన్నత శిఖరాలకు ఎదుగుతున్న కుటుంబంగా గుర్తింపు పొందుతోంది. ఈ కుటుంబానికి చెందిన లేట్ ఉదా నాయక్ వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఆయన కుమారుడు పోరిక విజయ సీతారాం నాయక్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు. ఈ కుటుంబంలో మరో గర్వకారణంగా నిలిచిన వ్యక్తి డాక్టర్ పోరిక సాయి కృష్ణ (MBBS, M–ermatology). ఆయన హనుమకొండలో స్కిన్ సైన్స్ క్లినిక్ ను విజయ టాకీస్ సమీపంలో, బంధన్ హాస్పిటల్ పక్కన ప్రారంభించారు. డాక్టర్ సాయి కృష్ణ తన కృషి, పట్టుదలతో కాకతీయ మెడికల్ కాలేజీ, వరంగల్ లో ఇాఆఖి పూర్తి చేసి, అనంతరం గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, గుంటూరు లో M–(డెర్మటాలజీ) పూర్తి చేసి నైపుణ్యమైన చర్మ వైద్యుడిగా ఎదిగారు. హనుమకొండలో ఆయన క్లినిక్ సోమవారం నుండి ఆదివారం వరకు ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఓపెన్గా ఉంటుంది. ఈ క్లినిక్లో పేద ప్రజలు మరియు విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో నాణ్యమైన, నమ్మకమైన చికిత్సలు అందిస్తున్నారు.

**ఇక్కడ అందుబాటులో ఉన్నముఖ్యమైన చికిత్సలు:**

జుట్టు రాలడానికి IPRF థెరపీ

లేజర్ హెయిర్ థెరపీ (PBMT)

మొటిమలు, మచ్చలు మరియు అన్ని రకాల చర్మ సమస్యలకు చికిత్స జుట్టు ఒక అవయవం - మేము దీన్ని తిరిగి పెంచుతాం అని డాక్టర్ సాయి కృష్ణ తెలిపారు. బంజారా సమాజానికి గర్వకారణమైన ఈ విజయాన్ని అభినందిస్తూ, లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ మాట్లాడుతూ, డాక్టర్ సాయి కృష్ణ తన వృత్తిలో పేద ప్రజలకు సేవ చేయాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని కోరారు.



# రైఫిల్తో కాల్చుకున్న హెడ్ కానిస్టేబుల్

కాకినాడ ఏఫ్రిల్ 20 మనం న్యూస్: కాకినాడ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్గా పనిచేస్తున్న ధనరాజు, ప్రస్తుతం ఈవీఎం మిషన్ల వద్ద గార్డ్ విధులు నిర్వహిస్తున్నాడు. డ్యూటీలో ఉండగానే అతను 303 రైఫిల్తో తనకు తాను కాల్చుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. సంఘటన వెంటనే తెలుసుకున్న సహచర పోలీసులు అప్రమత్తమై, ధనరాజును వెంటనే కాకినాడ జిజిహెచ్కు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు ఇంకా స్పష్టం కాలేదు. పోలీస్ విభాగం దర్యాప్తు ప్రారంభించింది.

# వైభవంగా జరిగిన శ్రీ శ్రీ కళావేదిక జాతీయ శతాధిక కవి సమ్మేళనం

పెనుగొండ, ఏప్రిల్ 20 మనం న్యూస్: అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక అభ్యుదయ సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) సవ్యసాచి గ్రూప్స్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో వాసవి పెనుగొండ వాసవి శాంతి థామ్ కళ్యాణ మంటపం వేదికగా 166వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం కన్వీనర్ డాక్టర్ సాదే బాలచందర్ అధ్యక్షతన కన్నుల పండువుగా ఆదివారం జరిగింది.ముఖ్య అతిథులుగా ప్రముఖ కవి ప్రభుత్వ కళారత్న అవార్డు గ్రహీత డాక్టర్ కత్తిమండ ప్రతాప్ జాతీయ గౌరవ అధ్యక్షురాలు నూలి అనుపమ ప్రియదర్శిని జాతీయ అధ్యక్షులు జి ఈశ్వరిభూషణం జాతీయ ప్రధాన కార్యదర్శి టి పార్థసారధి ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి పుల్లేటికుర్తి శ్రీనుబాబు సలహాదారు కావూరి శ్రీనివాసరావు పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కోలాటి పెద్దిరాజు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ నడిపల్లి రాజేష్ వాసవి క్లబ్ అధ్యక్షులు నూలి త్రినాథ్ న్యూరో సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ గొల్ల రామకృష్ణ సామాజిక వేత్తలు నూలి లక్ష్మణ స్వామి నూలి ధీరజ్ లు కవులను ఉద్దేశించి ప్రసంగించారు

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 155మంది కవులు సామాజిక స్పృహ కలిగించే కవితలు వినిపించారు కవులందరినీ అక్షర కవి మిత్ర బిరుదుతో శాలువా మెమెంటో సర్టిఫికెట్ పూలమాలలతో సత్కరించారు ప్రముఖ కవి గాయకులు డాక్టర్ సాదే బాలచందర్ పాడిన పద్యాలు గురువు గజల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఆయను కవికోకిల బిరుదుతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా ఆయనకు కవులు అతిథులు అభినందనలు తెలియజేశారు.

# చిత్తూరు జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాల ప్రారంభం

- చిత్తూరు, కుప్పం మండలాల్లో ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్
- చిత్తూరు జిల్లాలో కేంద్రీయ విద్యాలయాల ప్రారంభం
- విద్యా అభివృద్ధికి కొత్త దిశ
- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



చిత్తూరు, ఏప్రిల్ 20 మనం న్యూస్: నేడు చిత్తూరు జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాలను చిత్తూరు, కుప్పం మండలాల్లో ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. పట్టణంలోని ఇరువారం దగ్గర తాత్కాలిక జిల్లా కేంద్ర విద్యాలయంప్రారంభం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, సుమిత్ కుమార్ చిత్తూరు ఎం.ఎల్.ఏ గురజాల జగన్మోహన్, చూడ చైర్పర్సన్ కటారి హేమలత, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చిత్తూరు జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాలు ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణమని తెలిపారు. చిత్తూరు మరియు కుప్పం మండలాల్లో ఒక్కో విద్యాలయంలో 320 సీట్లతో విద్యా అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. తాత్కాలిక భవనాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు ఇప్పటికే ఏర్పాటు చేశామని, అడ్మిషన్లు వేగంగా జరుగుతున్నాయని, ఇప్పటికే సుమారు 70 శాతం సీట్లు నిండాయని చెప్పారు. మిగిలిన సీట్లు కూడా త్వరలోనే భర్తీ అవుతాయని, పూర్తిస్థాయిలో పాఠశాలలు వారం రోజుల్లో ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ విద్యాలయాల ద్వారా ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత విద్య మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లా యువతకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో కేంద్రీయ విద్యాలయం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినోత్సవం సందర్భంగా. వారి ఆశీస్సులతో ఈ విద్యాలయాన్ని ప్రారంభించడం గర్వకారణమని చెప్పారు. విద్యార్థుల కోసం ఆర్వో తాగునీరు, క్రీడా సామగ్రి, కంప్యూటర్ ల్యాబ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విద్యాలయంలో చేరిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

చూడ చైర్ పర్సన్ కటారి హేమలత మాట్లాడుతూ, చిత్తూరులో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం కావడం ప్రజల అదృష్టమని అన్నారు. ప్రజాప్రతినిధులు, ఎంపీ,ఎమ్మెల్యేలు కలెక్టర్ చొరవతో ఈ విద్యాసంస్థను ప్రజలకు అందించగలిగామని తెలిపారు. ఈ సాధనకు ముఖ్యమంత్రి కృషి కీలకమని పేర్కొంటూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ అముద, ప్రిన్సిపల్ లూథర్, డీఈవో రాజేంద్రప్రసాద్, సర్వ శిక్ష అభియాన్ ప్రతినిధి వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, కూటమి నాయకులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు, అంతకు మునుపు అతిథులు బాల వాటిక,1,2,3 తరగతి గదులను పరిశీలించారు,

# విద్యతో పాటు సంస్కారం అవసరం

## బాలవికాస వార్షికోత్సవంలో ఆర్డీవో దాసి రాజు




పెనుమంత్ర, ఏప్రిల్ 20 మనం న్యూస్: పశ్చిమగోదావరి జిల్లా మార్టేరు గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలవికాస కేంద్రాల వార్షికోత్సవం ఆదివారం గౌరీ శంకర దేవాంగ కళ్యాణమండపంలో నిర్వహించారు. జిల్లాలోని 7 బాలవికాస కేంద్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి నరసాపురం ఆర్డీవో దాసి రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తుకు చదువు ఎంత ముఖ్యమో, అంతే స్థాయిలో సంస్కారం కూడా అవసరమని తెలియజేశారు. సమరసత సేవా ఫౌండేషన్ బాలవికాస కేంద్రాల ద్వారా విద్యతో పాటు విలువలను పెంపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి మంచి దిశలో మార్గదర్శకంగా ఉంటాయని అన్నారు.దత్త సాయి మందిరం మొగల్తూరు నిర్వాహకులు మోహన్ రావు స్వామి కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు ఆశీస్సులు అందించారు. సభాధ్యక్షుడు చేగొండి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఆటపాటల ద్వారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవచ్చని, ఆ దిశగా ఫౌండేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు.కార్యక్రమంలో ప్రాంత సహ సంయోజకులు ముద్దు సాయిరాం, జిల్లా ధర్మ ప్రచారక్ మన్నే కుమారస్వామి, జిల్లా బాలవికాస్ కమిటీ సభ్యులు పిండి శ్రీనివాస్, సమయమంత్రి సీతారత్నం, తాళ్లూరి సత్య శ్రీనివాస్, తణుకు జానకీ బాల, రెడ్డి సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు మరియు మండల, దేవాలయ కమిటీ సభ్యులు కూడా హాజరయ్యారు.

# స్విమ్స్ ఆధ్వర్యంలో కుప్పంలో సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం

- పింక్ బస్ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్
- దాదాపు 900 మందికి ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ



కుప్పం ఏఫ్రిల్20 మనం న్యూస్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో కుప్పం ఏరియా ఆసుపత్రిలో సోమవారం సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం, పింక్ బస్ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. 740 మందికి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, 165 మందికి పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, స్విమ్స్ సంచాలకులు'ఉపకులపతి డ్యా ఆర్.వి.కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సూపర్ స్పెషాలిటీ శిబిరంలో కార్డియాలజీ, సిటి సర్జరీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, జనరల్ సర్జరీ, సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ, రేడియేషన్ అంకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, రేడియాలజీ విభాగాల వైద్యులు వైద్యసేవలందించారు. రెండు పింక్బస్సుల ద్వారా మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, టిటిడి బోర్డు సభ్యులు శాంతారాం, మాజీ ఎమ్మెల్సీ,మాజీ బోర్డు సభ్యులు గౌనివారి శ్రీనివాసులు, కుప్పం ఏరియా హాస్పిటల్ కమిటీ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, కడ అడ్వైజర్ రాజ్ కుమార్, పీకేఎం చైర్మన్ డాక్టర్ సురేష్, నాయకులు డాక్టర్ సుధీర్, స్విమ్స్ వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అదరహో.. కొండపల్లి బొమ్మల పండగ..

- విజయవంతంగా ముగిసిన మూడు రోజుల ఉత్సవాలు
- కొండపల్లి బొమ్మకు, కొండపల్లి కళాకారులకు కొత్త ఉత్తేజం
- చివరి రోజు కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్
- ఆద్యంతం కళాకారులను ప్రోత్సహించిన మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్,
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ. ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

**(విజయవాడ, మనం బ్యూరో):** ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఈ నెల 18న ప్రారంభమైన కొండపల్లి బొమ్మల పండగ వైభవంగా ముగిసింది. చివరి రోజు కార్యక్రమాల్లో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్తో పాటు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని కొండపల్లి కళను విశ్వవ్యాప్తం చేసేలా ప్రోత్సహించారు.

చివరి రోజు మార్కెటింగ్, వ్యాపార అవకాశాలపై చర్చతో పాటు ఆటవిడుపుగా రోప్ పుల్లింగ్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, గోనెసంచి పరుగు వంటి పోటీలు సందర్శకులకు ఆనందాన్ని పంచాయి. బొమ్మల ప్రేరణతో పిల్లల ఫ్యాషన్ షో, పవర్ విమెన్ ఆఫ్ కొండపల్లి, పిండివంటల ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సాహపరిచాయి. కొండపల్లి బొమ్మల పండుగ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వారసత్వ సంస్కృతి, ఆధునిక జెన్ జెడ్, పండగలు, సుస్థిర అభివృద్ధి తదితర అంశాలపై మార్చి 8న కొండపల్లి బొమ్మల పోటీ నిర్వహించడం జరిగింది.. ఇందులోని విజేతలకు రూ. లక్ష విలువైన బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కొండపల్లి బొమ్మ మన ఘన వారసత్వానికి ప్రతీక: కేఎస్ విశ్వనాథన్, డైరెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ కొండపల్లి బొమ్మ మన ఘన వారసత్వానికి ప్రతీక అని.. ఈ వారసత్వ సంపదను మనమందరం కలిపి కాపాడుకుందామని.. హస్తకళాకారుల సంక్షేమానికి, మన వారసత్వ కళల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోందని.. ఈ క్రమంలో కొండపల్లి బొమ్మల పండగను, ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఘనంగా నిర్వహించినట్లు వెల్లడించారు.

**కొండపల్లి బొమ్మల పండగకు విశేష స్పందన: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఈనెల 18వ తేదీన ప్రారంభమై.. మూడు రోజులపాటు నిర్వహించిన కొండపల్లి బొమ్మల పండగకు విశేష స్పందన లభించిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కళాకారులు పండగకు వచ్చి తమ కళాత్మక కౌశలాన్ని ప్రదర్శించారని.. కొండపల్లి బొమ్మకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించాలన్న సంకల్పంతో నిర్వహించిన కార్యక్రమానికి చేయూతగా నిలిచారని పేర్కొన్నారు. పెద్దఎత్తున కళాభిమానులు, యువత ఉత్సాహంగా పాల్గొని కళాకారులకు విలువైన ప్రోత్సాహం అందించారని తెలిపారు. మన గొప్ప 400 ఏళ్ల చరిత్ర కలిగిన కొండపల్లి బొమ్మ వారసత్వ సంపద గురించి ప్రతి ఒక్కరూ మాట్లాడుకునేలా పండగ ఆద్యంతం ఉత్సాహంగా జరిగిందని వివరించారు. కొండపల్లి కార్నివాల్ కు వేలాదిగా ప్రజలు తరలివచ్చారని తెలిపారు. కొండపల్లి బొమ్మల పండగ విశేషాలకు సోషల్ మీడియాలో దాదాపు కోటి వరకు వ్యూస్ వచ్చాయని తెలిపారు. మూడు రోజులపాటు జరిగిన వివిధ వినూత్న కార్యక్రమాల సమాహారంతో ఒక ప్రత్యేక పుస్తకాన్ని ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఈ డాక్యుమెంటేషన్ భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందని.. కొండపల్లి బొమ్మల వారసత్వ సంపద నిరాటంకంగా వెలుగులు వెదజల్లడానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. కళ కలకాలం నిలిచి ఉండడానికి, కళాకారులు అన్ని విధాల అభివృద్ధి పథంలో ముందుకెళ్లడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయని వివరించారు.

# తమిళనాడు అభివృద్ధి ఎన్డీయేతోనే: చంద్రబాబు



**కోయంబత్తూరు, ఏప్రిల్ 20 :** ఎన్టీఆర్, ఎంజీఆర్‌లు చాలా దగ్గరి స్నేహితులని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వారిద్దరూ కలిసి తమిళనాడుకు నీళ్లు తీసుకురావడానికి తెలుగు గంగ ప్రారంభించారని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులోని కోయంబత్తూరులో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల తరపున ప్రచారం నిర్వహించారు.''ఇప్పటికీ చిత్తూరు, తిరుపతి పరిసరాల్లో తమిళమే మాట్లాడతారు. నా వివాహం కూడా చెన్నైలోనే జరిగింది. నదుల అనుసంధానంతో దేశానికి నీటి భద్రత వస్తుంది. భవిష్యత్తులో అన్నీ కుదిరితే గోదావరి- కృష్ణ- కావేరి నదులు అనుసంధానం కావాలి. ప్రధాని నరేంద్ర మోడీ ద్వారానే ఇది సాధ్యమవుతుంది. తమిళుల ప్రయోజనాలు పట్టని పార్టీలు మనకొద్దు. తమిళనాడు అభివృద్ధి, దేశ ప్రగతి కోరుకునేది.. ఎన్డీయే మాత్రమే'' అని చంద్రబాబు అన్నారు.

# హర్మూజ్ వద్ద హైటెన్షన్..

## ఇరాన్ వాణిజ్య నౌకను సీజ్ చేసిన అమెరికా

## యూఎస్ సెంట్రల్ కమాండ్ వీడియో విడుదల



**వాషింగ్టన్, ఏప్రిల్ 20:** హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇరాన్ పతాకంతో ప్రయాణిస్తున్న తౌస్కా అనే వాణిజ్య నౌకపై అమెరికా దళాలు కాల్పులు జరిపాయి. ఆ తర్వాత ఆ నౌకను స్వాధీనం చేసుకొన్నాయి. ఈ ఘటన గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో చోటుచేసుకొంది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ సోషల్ మీడియాలో ధ్రువీకరించారు.

''ఇరాన్ పతాకంతో వెళుతున్న 900 అడుగుల పొడవున్న రవాణా నౌక తౌస్కా మా నౌకాదళ దిగ్బంధాన్ని దాటుకొని వెళ్లాలనుకొంది. కానీ, అది అనుకొన్నది సజావుగా సాగలేదు. అమెరికా నౌకాదళ డెస్ట్రాయర్ వార్నింగ్ షాట్లతో దానిని గల్ఫ్‌ఆఫ్ ఒమన్‌లో అడ్డుకొంది. అయినా ఇరాన్ నావికులు దారికి రాకపోవడంతో దాని ఇంజిన్ రూఫ్‌పై కాల్పులు జరిపి ఆపారు'' అని పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ దీనిపై పోస్టు చేసింది. ఓ నౌక ఇరాన్ పోర్టు వైపు ప్రయాణించబోతే తాము సీజ్ చేసినట్లు పేర్కొంది. ఈ ఘటనపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఐఆర్జీసీ దళం అమెరికా యుద్ధ నౌకల పైకి డ్రోన్లను ప్రయోగించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా సంస్థ ప్రెస్ టీవీ వెల్లడించింది. గల్ఫ్‌ఆఫ్ ఒమన్ నుంచి అమెరికా నౌకలను తరిమినట్లు పేర్కొంది. అమెరికా చర్యలను సాయుధ పైరసీగా ఇరాన్ అభివర్ణించింది.

హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. ఇరాన్ జెండాతో ప్రయాణిస్తున్న తౌస్కా అనే వాణిజ్య నౌకపై అమెరికా దళాలు కాల్పులు జరిపి స్వాధీనం చేసుకొన్న సంగతి తెలిసిందే. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో చోటుచేసుకొన్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోని అమెరికా సెంట్రల్ కమాండ్ తాజాగా విడుదల చేసింది. ఇరాన్ జెండాతో వెళుతున్న రవాణా నౌక తౌస్కా అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని దాటుకొని వెళ్లాలనుకొంది. ఈక్రమంలో హెలికాప్టర్ ద్వారా యూఎస్ నేవీ దళాలు ఆ నౌక పైకి దిగి ముందుగా కాల్పులు జరిపి ఆ తర్వాత నౌకను వారి అధీనంలోకి తీసుకున్నట్టు ఆ వీడియోలో ఉంది.

### ఇరాన్ డ్రోన్ దాడులు

అమెరికా దళాలు ఇరాన్‌కు చెందిన వాణిజ్య నౌకను స్వాధీనం చేసుకోవడంతో, అందుకు ప్రతికారంగా ఇరాన్ డ్రోన్ దాడులు చేపట్టింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా సైనిక నౌకలపై ఇరాన్ దాడికి దిగినట్టు అక్కడి జాతీయ మీడియా పేర్కొంది. అయితే, ఈ ఘటనకు సంబంధించి ఎన్ని డ్రోన్లు దాడి చేశాయి, నష్టం ఏ స్థాయిలో ఉందనే విషయంపై అమెరికా దళాల నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.




# మేం చెప్పాకే హర్మూజ్‌లోకి వెళ్లండి

## ఇండియన్ నేవీ అడ్వైజరీ

**ఢిల్లీ, ఏప్రిల్ 20 :** హర్మూజ్ జలసంధిలో భారత జెండాతో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత పతాక నౌకలకు మన నౌకదళం అడ్వైజరీ జారీ చేసిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని, తమనుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే హర్మూజ్‌లో ప్రయాణించాలని నేవీ పేర్కొంది. ఆ జలసంధిని దాటేందుకు వేచి ఉన్న నౌకల భద్రతను నిర్ధారించేందుకే ఈ సూచనలని. లారక్ ద్వీపం హర్మూజ్‌కు సమీపంలో ఉంటుంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి 11 నౌకలు ఈ జలమార్గాన్ని దాటాయి. దానిని దాటిన చివరి ట్యాంకర్ దేశ్ గరిమ (ఏప్రిల్ 18న). అదే రోజు జగ్ అర్ణవ్, సన్మార్ హెరాల్ ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా ఇరాన్ బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనను విదేశాంగశాఖ ఖండించిన సంగతి తెలిసిందే. భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి ఈ ఘటనపై నిరసనను తెలియజేసింది. గతంలో తమ దేశానికి బయల్దేరిన అనేక నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ సహకరించిందని ఈ సందర్భంగా గుర్తుచేసింది.

# ఉధంపూర్ వద్ద లోయలో పడిన బస్సు

## 21 మంది మృతి



- మరో 20 మందికి గాయాలు

**శ్రీనగర్, ఏప్రిల్ 20 :** జమ్మూ-కశ్మీర్‌లోని ఉధంపూర్ రూట్లో వెళ్తున్న ఓ బస్సు లోయలో పడింది. ఈ విషాదకర ఘటనలో దాదాపు 21 మంది మృతి చెందగా చాలామందికి తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. రామ్‌నగర్ నుంచి ఉధంపూర్ వెళ్తుండగా మధ్యలో జాలో అనే ప్రాంతంలో బస్సు ప్రమాదానికి గురైంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఉధంపూర్ డీఐజీ శివకుమార్ శర్మ పేర్కొన్నారు.''కొండ ప్రాంతంలో మలుపు వద్ద దారి కనిపించకపోవడం వల్లే ఉదయం సుమారు 10 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. భారీ రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నాం. 21 మంది మృతి చెందినట్టు గుర్తించాం. మరో 20 మందికి పైగా గాయపడ్డారు. ఘటనా స్థలం నుంచి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్నాం. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది'' అని డీఐజీ తెలిపారు.

ఈ ఘటనపై కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడి సహాయక చర్యలపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. స్థానిక అధికారులకు అందుబాటులో ఉంటానని, ఏమైనా అత్యవసరం అయితే స్పందించాలని జితేంద్ర సింగ్ వెల్లడించారు. బస్సు ప్రమాదంపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు. '' ఉధంపూర్ వద్ద జరిగిన బస్సు ప్రమాదం హృదయ విదారకం. ప్రమాదంలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలి. క్షతగాత్రులు తొందరగా కోలుకోవాలని ఆశిస్తున్నా'' అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

# చెట్టును ఢీకొట్టి.. కుప్పకూలిన ప్రైవేటు జెట్

## ఇద్దరు పైలట్లు మృతి

**రాయ్‌పూర్, ఏప్రిల్ 20 :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జశ్పూర్ జిల్లాలోని కొండల్లో ప్రైవేట్ జెట్ కుప్పకూలింది. అటవీ ప్రాంతంలో చెట్టును ఢీకొన్న తర్వాత ఇది కూలిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోయినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలిలో మంటలు ఎగసిపడటంతో పాటు పొగ దట్టంగా అలముకుంది. ప్రైవేటు జెట్లో ఎంత మంది ప్రయాణించారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.



# భారత నౌకలను టార్గెట్ చేయడంపై దర్యాప్తు:ఇరాన్



**టెహ్రాన్, ఏప్రిల్ 20 :** హర్మూజ్ జలసంధిలో శనివారం రెండు భారత నౌకలపై కాల్పులు జరిపింది తమ దళాలేనా అన్న అంశంపై దర్యాప్తు చేపట్టినట్టు ఇరాన్ వెల్లడించింది. ఈ మేరకు ఆ దేశ ప్రతినిధి ఇస్మాయిలీ బాఘేయి ఒక ప్రకటన చేశారు. ''మా దళాలే భారత నౌకలను లక్ష్యంగా చేసుకొన్నాయా..? అనే అంశంపై సంబంధిత సంస్థలు విచారణ చేపట్టాయి'' అని పేర్కొన్నారు. శనివారం హర్మూజ్ జలసంధిలో ఐఆర్జీసీ అనుమతి లభించిన తర్వాత ప్రయాణిస్తున్న రెండు భారత నౌకలపై కాల్పులు జరిగాయి. ఈ ఘటనతో ఆ రెండు నౌకలు తిరిగి పర్షియన్ గల్ఫ్‌కి వెళ్లిపోయాయి. వీటిల్లో ఒక దానిలో 20 లక్షల బ్యారెళ్ల చమురు ఉంది. ఈ ఘటనపై భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీకి సమన్లు జారీ చేశారు. ఇరాన్ జలసంధిని తెరిచినట్లు ప్రకటించిన తర్వాతే వాణిజ్య నౌకలు బయల్దేరిన విషయం తెలిసిందే. అమెరికాతో రెండో విడత చర్చలకు సంబంధించి తమ వద్ద ఎటువంటి ప్రణాళికా లేదని ఇస్మాయిల్ బాఘేయి తెలిపారు. చర్చల విషయంలో అమెరికా సీరియస్‌గా లేదని వ్యాఖ్యానించారు. కేవలం దుందుడుకు చర్యలు.. కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

# మనీలాండరింగ్ ఆరోపణలు..

## ఎమ్మెల్యే కుమారుల కార్యాలయాల్లో సోదాలు

**బెంగళూరు, ఏప్రిల్ 20 :** కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్ఏ హారిస్ కుమారులకు చెందిన ప్రాంగణాల్లో సోమవారం ఈడీ దాడులు నిర్వహించింది. క్రిప్టో కరెన్సీకి సంబంధించి మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నట్లు వారిపై ఆరోపణలు రావడంతో దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగిందని అధికారులు వెల్లడించారు. బెంగళూరులో మరికొన్నిచోట్లా ఈ సోదాలు జరిగినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే కుమారులతో పాటు క్రిప్టో హ్యాకర్ శ్రీకృష్ణ రమేశ్ అలియాస్ శ్రీకి చెందిన కార్యాలయాలను ఈడీ లక్ష్యంగా చేసుకుంది. శ్రీతో పాటు అతడి సహాయకులు జాతీయ, అంతర్జాతీయ వెబ్‌సైట్లను హ్యాక్ చేసి, బిట్‌కాయిన్లను దొంగిలించారంటూ 2017లో పలు కేసులు, ఛార్జీట్లు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణలో భాగంగా తాజా సోదాలు జరిగాయి. క్రిప్టో నేరాల ద్వారా వచ్చిన ఆదాయం నుంచి ఎమ్మెల్యే కుమారులు కూడా లబ్ధి పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. హారిస్ బెంగళూరులోని శాంతినగర్ ఎమ్మెల్యేగా ఉన్నారు.

# ప్రారంభానికి ఒకరోజు ముందు..

## రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం



**జైపూర్, ఏప్రిల్ 20 :** రాజస్థాన్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. బలోత్రా జిల్లా పచ్‌పద్రలోని ఆయిల్ రిఫైనరీలో సోమవారం పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. మంగళవారం (ఏప్రిల్ 21) ప్రధాని నరేంద్రమోడీచేతుల మీదుగా ఇది ప్రారంభం కావాల్సి ఉంది.కాగా ఈ రిఫైనరీకి 2013, సెప్టెంబర్ 22న సోనియాగాంధీ శంకుస్థాపన చేశారు. అప్పుడు రాజస్థాన్‌లో అశోక్ గహ్లోత్ ప్రభుత్వం అధికారంలో ఉంది. జనవరి 16, 2018లో మోడీ ప్రభుత్వం దీనిని రీలాంచ్ చేసింది. అప్పుడు ప్రాజెక్ట్ వ్యయం రూ.43,129కోట్లు. ఈ మొత్తాన్ని రూ.79,459 కోట్లకు సవరించేందుకు ఇటీవలే కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇచ్చింది. ఈ రిఫైనరీ.. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ప్రభుత్వ సంయుక్త సంస్థ. ఇది రేపు అందుబాటులోకి వచ్చి ఉంటే.. దేశంలోని అతిపెద్ద అనుసంధానిత రిఫైనరీ పెట్రో రసాయనాల కాంప్లెక్స్‌లలో ఒకటిగా నిలిచేది. ఈ ప్రాజెక్టు మొత్తం వార్షిక సామర్థ్యం 9 మిలియన్ మెట్రిక్ టన్నులు కాగా.. ఇందులో పెట్రోరసాయనాల ఉత్పత్తుల సామర్థ్యం 2.4 మిలియన్ మెట్రిక్ టన్నులు.

# చిప్స్ నుంచి షిప్స్ వరకు మన భాగస్వామ్యం

## ప్రధాని నరేంద్ర మోడీ



**ఢిల్లీ, ఏప్రిల్ 20 :** దక్షిణ కొరియా అధ్యక్షుడు లీజే మ్యూంగ్ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కు వచ్చారు. ఇరు దేశాల సంబంధాలు బలోపేతం అయ్యే దిశగా ప్రధాని మోడీ- లీజే మ్యూంగ్ సమక్షంలో సోమవారం పలు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడారు. అధ్యక్షుడి పర్యటన ద్వైపాక్షిక సంబంధాల్లో కీలక ముందడుగు అని పేర్కొన్నారు.

చిప్స్ నుంచి షిప్స్, ట్యాలెంట్ నుంచి టెక్నాలజీ, ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ఎనర్జీ వరకు ఇలా ప్రతి రంగంలోని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నట్లు తెలిపారు. భారత్-దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 27 బిలియన్ డాలర్లకు చేరిందన్నారు. 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

# రూ.100కోట్లు తేడా ఉంది

## టీవీకే విజయ్‌కు హైకోర్టు నోటీసులు



**చెన్నై, ఏప్రిల్ 20 :** టీవీకే అధినేత విజయ్‌కు మద్రాసు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లో అవకతవకలు ఉన్నాయంటూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. దానిని పరిశీలించిన అనంతరం సోమవారం కోర్టు ఈ నోటీసులు ఇచ్చింది. విజయ్ సమర్పించిన అఫిడవిట్లలో తేడాలున్నాయంటూ చెన్నైకి చెందిన వి.విఘ్నేశ్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. తిరుచ్చి, పెరంబూర్ నియోజకవర్గాల నుంచి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పోటీచేస్తున్నారు. పెరంబూర్‌లో సమర్పించిన అఫిడవిట్లో ఆయన ఆస్తుల వివరాలు రూ.115 కోట్లుగా ఉండగా.. తిరుచ్చిలో రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఇచ్చిన వివరాల్లో వెల్లడించిన ఆస్తులు విలువ రూ.220కోట్లుగా ఉందని పిటిషనర్ ఆరోపించారు. ఇలా ఎందుకు తేడా చూపించాల్సి వచ్చించిందో వివరించేలా ఎలాంటి అనుబంధ పత్రాలు విజయ్ ఇవ్వలేదన్నారు. వచ్చేవారం దీనిపై తదుపరి విచారణ జరగనుంది.

# ఖాకీల కళ్లు కప్పి..ఖైదీ పరార్

## ఖైదీ కోసం పోలీసుల వేట

**హైదరాబాద్,ఏప్రిల్ 20(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రిమాండ్ ఖైదీగా ఉన్న దొంగ పోలీసుల కళ్లు గప్పి పరారయ్యాడు. అతడి కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... ఇటీవల ఓ దొంగతనం కేసులో పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ క్రమంలో రిమాండ్ ఖైదీ నరేష్ తో పాటు మరో ముగ్గురిని పోలీసులు పీటీ వారెంట్‌పై బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారణ అనంతరం రిమాండ్ ఖైదీలను తిరిగి జైలుకు తరలిస్తుండగా చంచలగూడ జైలు సమీపంలో నరేష్ వాహనం నుంచి దూకి పారిపోయాడు. మిగతా ఇద్దరు నిందితులు పోలీసుల అదుపులోనే ఉన్నారని, పరారైన ఖైదీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా సదరు రిమాండ్ ఖైదీ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వాహనం ఆగిన సమయంలో భద్రతా సిబ్బంది ఏమరపాటుగా ఉండటాన్ని గమనించి పరారైనట్లు తెలుస్తోంది. రిమాండ్ ఖైదీ తప్పించుకున్న విషయాన్ని వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో నగరంలో హై అలర్ట్ ప్రకటించారు. నగరంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అదేవిధంగా పారిపోయిన ఖైదీ ఏ దిశగా వెళ్లారో తెలుసుకునేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

# ఇరాన్‌కు బాంబులు, డ్రోన్లు సరఫరా..

## యూఎస్‌లో మహిళా వ్యాపారవేత్త అరెస్ట్




**లాస్ఏంజిలెస్, ఏప్రిల్ 20 :** పశ్చిమాసియా ఉద్రిక్తతల సమయంలో ఇరాన్‌కు అక్రమంగా బాంబులు, డ్రోన్లు సరఫరా చేస్తోన్న ఓ మహిళా వ్యాపారవేత్త అమెరికాలో అరెస్టయ్యింది. ఇరాన్‌కు యుద్ధ సామగ్రిని సరఫరా చేయడంలో వ్యాపారవేత్త షమీమ్ మాఫి మధ్యవర్తిత్వం చేస్తోందన్న ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ క్రమంలోనే యూఎస్ అధికారులు లాస్ఏంజిలెస్ విమానాశ్రయంలో శనివారం రాత్రి ఆమెను అరెస్టు చేసినట్టు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

ఇరాన్ మూలాలున్న 44ఏళ్ల షమీమ్ మాఫి అమెరికాలో స్థిరపడింది. అక్రమంగా యుద్ధ సామగ్రిని సరఫరా చేసేందుకు ఇరాన్ ప్రభుత్వంతో ఆమె ఒప్పందాలు కుదుర్చుకొన్నట్టు అధికారులు గుర్తించారు. ఆర్మీ సిబ్బంది ఉపయోగించే డ్రోన్లు, బాంబులు, మందుగుండు సామగ్రిని తరలిస్తోందని అధికారుల దర్యాప్తులో తేలింది. ఇందుకోసం షమీమ్ మధ్యవర్తులను నియమించుకొని వారిద్వారా లావాదేవీలు నిర్వహిస్తోంది. మానవరహిత విమానాలైన మొహాజెర్-6 సాయుధ డ్రోన్లను ఇరాన్కు సరఫరా చేసేందుకు 70 మిలియన్ డాలర్లకు ఒప్పందాన్ని కుదుర్చుకొంది.

ఇందులోభాగంగా 2023లో మొదలైన అంతర్యుద్ధానికి సూడాన్ రక్షణ మంత్రిత్వశాఖకు ఈ నెట్‌వర్క్ నుంచే 55 వేల బాంబు ఫ్యూజ్లను సరఫరా చేసినట్టు నిందితురాలిపై ఆరోపణలు ఉన్నట్టు సదరు కథనం వెల్లడించింది. ఇరాన్ మంత్రిత్వశాఖతో షమీమ్ 2022, 2025ల్లో నేరుగా సంప్రదింపులు జరిపినట్టు గుర్తించిన పోలీసులు ఆ ఫోన్ కాల్ రికార్డులను కోర్టు ముందుంచారు. అయితే ఈ విషయంలో తనపై వచ్చిన ఆరోపణలను నిందితురాలు ఖండించింది. 2013లో ఇరాన్ నుంచి అమెరికాకు వలస వచ్చిన షమీమ్‌కు 2016లో శాశ్వత నివాసానికి గుర్తింపు లభించింది. కాగా, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రతినిధి బృందం ఇరాన్‌తో పాకిస్థాన్లో చర్చలు జరపనున్న నేపథ్యంలో షమీమ్ అరెస్టు జరగడం గమనార్హం.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రలను సద్వినియోగం చేసుకోవాలి



సూర్యాపేట ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి) మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ లలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రైతులకు సూచించారు.. సోమవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. రాష్ట్ర ప్రభుత్వం క్వింటా రూ.2400 మద్దతు ధర కల్పిస్తుందని, మార్కెట్ లలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో పంటను అమ్మి మద్దతు ధర పొందాలన్నారు..

### బయటి ధాన్యం రాకుండా పటిష్ట భద్రత

ఇతర రాష్ట్రాల నుండి జిల్లాకు ధాన్యం రాకుండా బార్డర్ చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. పోలీస్, సివిల్ సప్లయ్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా పని చేస్తూ బయట నుండి ధాన్యం రాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి అందిస్తున్న బోనస్ తెలంగాణ రైతులు పొందేలా బయట నుండి ధాన్యం రాకుండా ఆదేశాలు జారీ చేశామని, ధాన్యం వస్తున్నట్లు సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు..జిల్లాలో 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, దాదాపు 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.. జిల్లా, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు..

### రైతులకు రూ 5లకే నాణ్యమైన భోజనం



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో రైతుల కోసం ఏర్పాటు చేసిన రూ.5ల భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.. హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్ సౌజన్యంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.5 అన్నపూర్ణ భోజనాన్ని కలెక్టర్ ప్రారంభించి రైతులకు స్వయంగా వడ్డించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దూరం నుండి పంటను అమ్ముమునేందుకు వస్తున్న రైతులకు మంచి క్వాలిటీ భోజనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. అన్నం, కూర, పప్పు, పచ్చడితో రైతులకు నాణ్యత భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని, సీజన్ సమయంలో భోజనం తో పాటు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టిఫిన్ ఏర్పాటు చేయడం సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ బాలకృష్ణ, డి.ఎ.ఓ. శ్రీధర్ రెడ్డి, డి.ఎం.ఓ. నాగేశ్వర శర్మ, డి.సి.ఓ. ప్రవీణ్, ఎ.ఎం.సి.డైరెక్టర్స్, రైతులు, పాల్గొన్నారు.

# 14 సంవత్సరాల పిల్లలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్

- ఆరోగ్యంవంతమైన తెలంగాణగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి
- సర్పంచి మందుల నాగయ్య



కోదాడ, ఏప్రిల్ 20(మనం న్యూస్):14 సంవత్సరాల నిండిన బాలికలకు హ్యూమన్ ప్యాపిలోమా వైరస్ వ్యాక్సిన్ వేయించి ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సర్పంచి మందుల నాగయ్య అన్నారు. మండల పరిధిలోనే గుడిబండ గ్రామంలో గల గ్రామపంచాయతీ ఆవరణంలో హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి మందుల నాగయ్య ముఖ్య అతిథిగా పాల్గొని వ్యాక్సినేషన్ ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రభుత్వము ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది కావున 14 సంవత్సరాల లోపు ఆడపిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వ్యాక్సిన్ చేయడం వల్ల ముందు జాగ్రత్తగా గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ ను నివారించవచ్చని తెలిపారు. ఈ వ్యాక్సిన్ విలువైనది కావున ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి డా, నాగూర్ బి, సూపర్వైజర్ సిద్ధమ్మ, ఏఎన్ఎం చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్ విజయ్, సెక్రటరీ అవినాష్ రెడ్డి, జిపిఓ ఈశ్వర్, వెంకయ్య, గురునాథం, సూరయ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో వ్యక్తి అనుమానాస్పద మృతి



సూర్యాపేట, ఏప్రిల్ 20, (మనం న్యూస్) రెండు రోజుల క్రితం పట్టణంలోని జె జె నగర్ లో అనుమానాస్పదంగా మృతి చెందిన పాపమ్మ అనే వృద్ధురాలి పై ఉన్న బంగారు ఆభరణాలను దొంగతనం చేసి, ఆమెను హత్య చేశాడని అనుమానం వ్యక్తం చేసిన సైదాచారి అనే వ్యక్తి ఏలూరులో ఉన్నాడని తెలుసుకుని సోమవారం పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని అక్కడి సూర్యాపేటకు తరలిస్తుండగా సూర్యాపేట జిల్లా కోదాడ సమీపం వద్దకు రాగానే తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వెంటనే అక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# గాంజా సరఫర చేస్తున్న నలుగురు వ్యక్తుల అరెస్టు

- మూడు లక్షల విలువ గల ఐదు కేజీల గంజాయి స్వాధీనం
- నిందితులు ఉపయోగించిన కారు బైక్ నాలుగు సెల్ ఫోన్స్ సీజ్
- విలేకరుల సమావేశంలో ఎస్పీ నరసింహ

సూర్యాపేట ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి) గంజా సరఫరా చేస్తున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కే నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...నమ్మదగిన సమాచారంపై సోమవారం ఆత్మకూరు ఎస్. గ్రామ శివారులో క్రషర్ మిల్లు వద్ద నలుగు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నారని సమాచారం రాగా వెంటనే స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. పట్టుకున్న వ్యక్తులను విచారించగా నిమ్మికలకు చెందిన ఏ1 విరబోయిన భరత్ జాజిరెడ్డిగూడెం కొమ్మాల గ్రామానికి చెందిన ఏ2 అరే విజయ్, సూర్యాపేట రూరల్ ఆరెగూడెం గ్రామానికి చెందిన ఏ3 చెవుల మనోజ్, నిమికల్ గ్రామానికి చెందిన ఏ4 కొడిదల శివ గా గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు.వీరిని తనిఖీ చేయగా వీరి వద్ద 5 కేజీల గంజాయి, ఒక కారు, ఒక బైక్, నాలుగు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నామని నిందితులు జలసాలకు విలాసాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలని ఆలోచనతో గంజాయి వినియోగించే అలవాటు ఉండడం తో గంజాయిని తెచ్చి విక్రయించాలని నిర్ణయించుకున్నారన్నారు. పథకం ప్రకారం భరత్, విజయ్, మనోజ్ ముగ్గురు కలిసి కొడిదల శివ కు చెందిన మోటార్ సైకిల్ పై




ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం సీలేరు వెళ్లి సీలేరు ఏరియాలో గంజాయిని కొనుగోలు చేసి తెచ్చారు. ఈ కొనుగోలు చేస్తే తెచ్చిన గంజాయిని పంచుకోవడం కోసం నలుగురు ఆత్మకూరు ఎస్ గ్రామ శివారు క్రషర్ మిల్ వద్దకు రావడం జరిగింది. నమ్మదగిన సమాచారం అందుకున్న ఆత్మకూరు ఎస్ మండల పోలీసులు అక్కడికి చేరుకుని నిందితులను అదులుకోకు తీసుకొని వారి నుండి గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.ఇద్దరూ పంచుల సమక్షంలో పంచనమా నిర్వహించి ఐదు కిలోల గంజాయని మనోజ్ యొక్క కారును, శివ యొక్క బైకును, సెల్ఫోన్లను సీజ్ చేయడం జరిగిందని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీసు ప్రజా భరోసా కార్యక్రమాలు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా గంజాయి నిర్మూలన గంజాయి వినియోగంపై ప్రజలను యువతను చైతన్యవంతం చేస్తున్నామని అయినప్పటికీ ఇలాంటి నిందితుల వల్ల గంజాయి సరఫరా అవుతుందని వీరిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని డ్రగ్స్ గంజా ఇలాంటి వాటికి అలవాటు పడకూడదని కోరారు. డ్రగ్స్ గంజాయి లాంటి వాటికి సంబంధించిన సమాచారాన్ని పోలీసువారికి తెలియజేయాలని పిలుపునిచ్చారు.

నిందితులను అరెస్టు చేయడంలో బాగా పనిచేసిన సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ ను ఆత్మకూరు ఎస్సై శ్రీకాంత్ ను పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ప్రజావాణి పిర్యాదుల పై సత్వరమే చర్యలు



సూర్యాపేట ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి) ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి గ్రీవిన్స్ లకు కూడ అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు దరఖాస్తు లను పరిష్కరించాలని తెలిపారు. వేసవిలో ప్రజల కొరకు ప్రతి గ్రామపంచాయతీలో బస్ స్టాప్, పబ్లిక్ ప్రాంతాలలో, ఉపాధి హామీ పనులు జరిగే చోట, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని , ఎండ తీవ్రత దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉదయం 11:30 నుండి సాయంత్రం 4:00 వరకు కొనుగోళ్లు నిలిపివేయాలని, తదుపరి 4 గంట నుండి రాత్రి వరకు అవసరమైతే ఫ్లడ్ లైట్లు పెట్టుకొని రాత్రి 10:00 వరకు కూడ నిర్వహించుకోవచ్చు అని, ఉదయం 4 గంటల నుంచి కూడ కొనుగోళ్లు ప్రారంభించుకోవచ్చని తెలియజేశారు. డిఎం అండ్ హెచ్ ఓ, పీహెచ్ సీల నుండి ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, సెలైన్లు అందుబాటులో ఉంచాలని, కలెక్టరేట్లో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఎండ నుండి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలని తలకు క్యాపులు ధరించాలని, కలెక్టరేట్లో కూడా అవసరమైతే మరికొన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ పరిపాలన అధికారిని ఆదేశించారు. ప్రతి మండలం నుండి తాసిల్దార్ ద్వారా ప్రతి రోజు టెంపరేచర్ రిపోర్ట్ అందించాలని, ఆర్డబ్ల్యూఎస్, డిపిఓ త్రాగునీరు కలుషితం కాకుండా చూడాలని అన్నారు.జనన గణన గురించి కలెక్టర్ మాట్లాడుతూ ...ఏప్రిల్, 26 నుండి ప్రారంభమగు హౌస్ లిస్టింగ్ లో ప్రతి ఉద్యోగి సొంతంగా వారి యొక్క కుటుంబ వివరాలు 33 ప్రశ్నలకు వివరాలు అందించాలని, వెన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు, వారికి ఆ నివేదికను అందించాలని కలెక్టరేట్ లోని ప్రతి శాఖ వారి పరిధిలో గల మండల, గ్రామ కార్యాలయాల పరిధిలో గల సిబ్బంది ద్వారా ప్రజలకు జనన గణన గురించి అవగాహన కల్పించాలని అన్నారు. తదుపరి కలెక్టర్ సిపిఓ ద్వారా జనన గణన అవగాహన ఫ్లెక్సీ బోర్డును ఆవిష్కరించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 31 దరఖాస్తులు,డిఆర్డిఏ 4, మున్సిపాలిటీ 3, డిపిఓ 3, డిఎం అండ్ హెచ్ ఓ 3 మిగిలిన 17 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 61 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కే సీతారామా రావు, సీఈఓ జడ్పీ శిరీష, డిపిఓ యాదగిరి, డిఎంహెచ్వో పి వెంకటరమణ, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, సిపిఓ కిషన్, డీఎస్ఓ, డిటిడిఓ శంకర్, ఎస్సీ కార్పొరేషన్ డెవలప్మెంట్ అధికారి దయానందరాణి, డి ఐ ఈ ఓ బి సులోచన రాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపర్డెంట్లు శ్రీలత, సాయి, ఇతర జిల్లా అధికారులు, తదితరులు హాజరైనారు.

## వంగమర్తి గ్రామ పంచాయతి సెక్రటరి దేవేందర్ పై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ కు వినతిపత్రం అందజేత



నల్లగొండ - ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి) నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవేందర్ పై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన భూత్కూరి వెంకటరెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ కు వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఇంటి నెం. 1-108కు (పాత నెం. 1-81) గ్రా వంగమర్తి, మం శాలిగౌరారం, జి నల్లగొండ, పైన తెలుపబడిని నివాస గృహం మాతాత నుండి తండ్రి కి, మాతండ్రి నుండి నాకు వారసత్వంగా వచ్చింది అన్నారు. ఇంటిని దాదాపు 45 సంవత్సరాల క్రితం మానాన్న నిర్మించినారు అని అన్నారు. ఇప్పటివరకు తాను ఎలాంటి బకాయిలు లేకుండా ఇంటిపన్ను, వాటర్ పన్ను చెల్లిస్తున్నాను అన్నారు. సంవత్సర కాలం నుండి వంగమర్తి పంచాయితి సెక్రటరీదేవేందర్ ఆఇల్లు నీది కాదు వేరే వాళ్ళకి ప్రాపర్టి ముటేషన్ బదిలి చేస్తానని, నేను అమ్మిన అని ప్రచారం చేస్తు అన్ని రకాలుగా వేదిస్తున్నాడు అన్నారు. అన్ని రకాల ధృవ పత్రాలు సదరు నివాసం గృహం నాది అని పంచాయతి సెక్రటరీకి సమర్పించినప్పటికి పట్టించుకోవడం లేదుఅన్నారు.ఏమైనా ఇస్తే నన్ను కనిపెడుతూ నీజోలికి రాను లేకపోతే మీ దాయాదులు ఇల్లుగా పంచనామ తీర్మాణం చేసి ఆస్తి బదిలి చేస్తానని బెదిరిస్తున్నాడు అన్నాడు.దయచేసి పంచాయతి సెక్రటరి పై తగు చర్యలు తీసుకోగలరని కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు.

## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల,ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి) ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో రాజీవ్ నగర్ లో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాలలో సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. వంటశాల, సామాగ్రి నిల్వ గదిని పరిశీలించి ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఫలితాలలో అనుత్తీర్ణులైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆదర్శ పాఠశాలల వసతి గృహాన్ని సందర్శించి కొనసాగుతున్న పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ విభాగాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 129.25 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయల వ్యయంతో క్రిటికల్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

అధికారులు గుత్తేదారుల సమన్వయంతో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల వసతి గృహాలను తనిఖీ చేసిన డిపిఆర్ఓ రవికుమార్





గజ్వేల్ ఏప్రిల్ 20 మనం న్యూస్. ప్రజాపాలనా ప్రగతి ప్రణాళికా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 20 తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా అన్ని గురుకుల పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాలలో జిల్లా కలెక్టర్ నియమించిన ప్రత్యేక నోడల్ అధికారులు సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని గురుకుల విద్యాలయాలు సంక్షేమ హాస్టల్లో పర్యటించి వసతులను పరిశీలించారు. గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్ లో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహానికి నోడల్ అధికారిగా నియమించబడ్డ డిపిఆర్ఓ బి.రవికుమార్ సోమవారం గజ్వేల్ ఎస్సీ బాలికల హాస్టల్ ను సందర్శించి వసతి గృహంలో విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యా నాణ్యత ప్రమాణాలను పెంచడమే కాకుండా, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకు అవసరమైన పౌష్టికాహారం మరియు వసతిని ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి గృహాన్నీ నిర్వహించాలని, ఎల్లప్పుడూ హాస్టల్లో పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని హాస్టల్ సంక్షేమ అధికారి స్వప్నకు సూచించారు. అలాగే వేసవి సెలవులలో విద్యార్థులు సెల్ ఫోన్లు చేస్తూ కాలం వృధా చేయకుండా భవిష్యత్తుకు పనికివచ్చే పుస్తక పఠనం చేయాలని, ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్ళరాదని విద్యార్థులకు సూచించారు.

## గ్రీవెన్స్ డే సందర్భంగా పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

- బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం

జగిత్యాల ఏప్రిల్ 20(మనం ప్రతినిధి) ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 6 గురు అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.



# మహిళలకు స్వయం ఉపాధిపై

- కె ఆర్ కె సన్షైన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గార్మెంట్స్ కటింగ్ ఉచిత శిక్షణ.
- ముఖ్య అతిథిగా ఏడి ఆర్డిఓ విజయలక్ష్మి
- గ్రామీణాభివృద్ధి శాఖ మద్దతుతో, ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ శిక్షణ.




కామారెడ్డి, ఏప్రిల్ 20 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలోని పెద్దబజార్లో కె ఆర్ కె సన్షైన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గార్మెంట్స్ కటింగ్ నాలుగు రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. గ్రామీణ మహిళల స్వయం సహాయక సంఘాల సభ్యులకు పాఠశాల యూనిఫార్మ్ కటింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (ఎస్ఇఆర్పి), గ్రామీణాభివృద్ధి శాఖ మద్దతుతో, ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ నిర్వహిస్తున్న ఈ శిక్షణకు ఏడి ఆర్డిఓ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై నైపుణ్యాల ప్రాముఖ్యత, స్వయం ఉపాధి అవకాశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ స్థాపకుడు మొహమ్మద్ ఖలీలుల్లా అతిథులను స్వాగతించి, మహిళా సాధికారతకు సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. శిక్షణలో సుమారు 40 మంది మహిళలతో పాటు, ట్రస్ట్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు టైలరింగ్ రంగంలో స్వయం ఉపాధి సాధించేందుకు దోహదం అవుతుందని నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలు



సూర్యాపేట ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి): బసవేశ్వరుడి ఆశయాలను అనుసరించి సమాజంలో సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. సోమవారం, సద్దుల చెరువు (మినీ ట్యాంక్ బండ్) వద్ద వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మహాత్మా బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో సమాజంలో ఉన్న కుల వ్యవస్థ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి సమానత్వం, న్యాయం, ధర్మం వంటి విలువలను ప్రచారం చేసిన మహనీయుడు అని కొనియాడారు. నేటి సమాజంలో చదువు గొప్పతనాన్ని గుర్తించి ప్రజల్లోకి చదువు తీసుకెళ్లాలన్న ఆలోచనతో పాటల, రచనల ద్వారా చైతన్యం కలిగించారన్నారు. ఆయన ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. లింగ, బలిజ కమ్యూనిటీ కోసం అవసరమైన భూమిని కేటాయించేందుకు కృషి చేస్తామని. తెలిపారు.మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత మాట్లాడుతూ... మనుషులంతా ఒక్కటేనని, కులాలు, ఉపకులాలు లేవన్న మహాత్మా బసవేశ్వరుని సందేశం ఆచరణీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ బసవేశ్వరుని ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు ఆయన చిత్రపటానికి అంజలి ఘటించి, నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు సర్వోత్తమ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి నరసింహ, తహసీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, టీఎన్జీవోస్ జిల్లా సెక్రెటరీ దున్న శ్యామ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలి, , మున్సిపల్ కౌన్సిలర్లు, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం అధ్యక్షుడు వల్లెం శేఖర్, వీరశైవ లింగాయత్ లింగ బలిజ కులస్తులు, బిసి వెల్ఫేర్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలగిరిలో బసవేశ్వర జయంతి



తిరుమలగిరి, ఏప్రిల్ 20 (మనం న్యూస్): మున్సిపాలిటీకేంద్రంలోని జ్యోతిరావు పూలే చౌరస్తాలో మహాత్మా బసవేశ్వరుని జయంతి వేడుకలను బలిజ సంఘం అధ్యక్షులు ఆరని సోమరాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ బసవేశ్వరుని ఆశయ సాధన కోసం కృషి చేయాలని చెప్పారు. 12వ శతాబ్దంలోనే కుల, లింగ వివక్షతకు వ్యతిరేకంగా సమాజంలో సంపన్న జాతులను మమేకం చేశారని కొనియాడారు. జయంతిని స్ఫూర్తి తీసుకొని మనం అందరం పాటించవలసిన బాధ్యతను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కొత్తగట్టు మల్లన్న , కొమ్మినేని సతీష్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు ఎల్సోజు దీనదయాల్, బిఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కందుకూరి బాబు, బీసీ సంఘం తన్నీరు రాంప్రభు, మేడబోయిన యాదగిరి, కామ్రేడ్ కడెం లింగన్న, రజక సంఘం నాయకులు పులిమామిడి సోమన్న, బీసీ సంఘం నాయకులు చేను శ్రీనివాస్, పులిమామిడి బిక్షం, స్వాతి రవి ,వంగరి బ్రహ్మం పద్మశాలి సంఘం నాయకులు చింతకింది మురళి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో సర్వే కోసం పలుమార్లు ఫిర్యాదులు స్పందన లేక రైతు ఆవేదన

- **మీ సేవా కేంద్రాల్లో రెండుసార్లు దరఖాస్తు చేసి ఫీజులు చెల్లించిన వైనం**



కామారెడ్డి, ఏప్రిల్ 20 (మనం జిల్లా ప్రతినిధి): జిల్లాలోని పాల్వంచ మండలం భవానిపేట గ్రామానికి చెందిన రైతు గంగని చిన్న నర్సింలు తన భూమి సర్వే విషయంలో అధికారుల నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 841/23లో 2 ఎకరాల 37 గుంటల భూమి ఉన్నప్పటికీ, సర్వే నిర్వహించాలంటూ నాలుగు సార్లు జిల్లా ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. చివరిగా స్పందించిన అదనపు కలెక్టర్, రెండు రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశం. ఈ భూమి సర్వే కోసం పాల్వంచ మీ సేవా కేంద్రాల్లో రెండుసార్లు దరఖాస్తు చేసి ఫీజులు చెల్లించినప్పటికీ, సర్వేయర్ ఇప్పటివరకు పరిశీలనకు రాలేదని వాపోయారు. తాజాగా జిల్లా కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణిలో మళ్లీ ఫిర్యాదు చేయగా, అదనపు కలెక్టర్ విక్టర్ సానుకూలంగా స్పందించి జిల్లా సర్వేయర్ను పిలిపించి రెండు రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. తన భూమిలో సర్వే నిర్వహించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ను రైతు విజ్ఞప్తి చేశారు.

# వైద్యులు, వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో సేవలు అందించాలి

- **జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**





సంగారెడ్డి, ఏప్రిల్ 20 మనం న్యూస్ ప్రతినిధి : జిల్లాలో వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడానికి వైద్యులు, వైద్య సిబ్బంది క్రమశిక్షణ, చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పలు కీలక సూచనలు చేశారు. ఆసుపత్రుల నిర్వహణపై పూర్తి స్థాయి పర్యవేక్షణ కొనసాగించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్కు ఆదేశించారు. ప్రతి విభాగంలో సేవల నాణ్యత, రోగులకు అందుతున్న సౌకర్యాలపై నిరంతరంగా పరిశీలన జరగాలని పేర్కొన్నారు. జిల్లాలో గుర్తించిన క్యాన్సర్ రోగుల వివరాలు సమగ్రంగా అందుబాటులో ఉంచాలని, ప్రస్తుతం చికిత్స పొందుతున్న ప్రతి పేషెంట్తో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరపాలని సూచించారు. క్యాన్సర్ డే కేర్ సెంటర్లో అందుబాటులో ఉన్న సదుపాయాలపై వారికి పూర్తి అవగాహన కల్పించి, అందరూ చికిత్స పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎస్పీఎం విద్యార్థులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. జెరియాట్రిక్ వార్డును ఆకర్షణీయమైన థీమ్తో పెయింటింగ్ చేయాలని, పాత బెడ్స్ను మార్చి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, అవసరమైన అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అవుట్పేషెంట్ సేవలను సమర్థవంతంగా స్ట్రీమ్లైన్ చేయాలని, రోగుల కోసం క్యూ లైన్లు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోగులు ఇబ్బందులు పడకుండా సులభంగా సేవలు పొందేలా వ్యవస్థను మెరుగుపరచాలని సూచించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుపై కూడా కలెక్టర్ పలు సూచనలు చేస్తూ, ప్రతి రోగికి సంబంధించిన పూర్తి వైద్య వివరాలు సమగ్రంగా నమోదు కావాలని, ఇది భవిష్యత్తులో మెరుగైన చికిత్స అందించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వసంత్ రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ శశాంక, డాక్టర్ కవిత, వివిధ విభాగాల డాక్టర్లు, టీజీ ఆన్లైన్ బృందం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడమే లక్ష్యం

- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
- **ముస్తాబాద్ మండలం నామాపూర్ లో నీటి పారుదల శాఖ భవనాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించిన ప్రభుత్వ విప్**



రాజన్న సిరిసిల్ల , ఏప్రిల్ - 20(మనం ప్రతినిధి ): రైతును రాజు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఎస్డీఎఫ్ నిధులు రూ.31 లక్షలతో ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో నిర్మించిన ఉప కార్య నిర్వాహక ఇంజనీర్, ఇరిగేషన్ సబ్ డివిజన్ నెంబర్ - 4 కార్యాలయ భవనాన్ని సోమవారం ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్ట లను పూర్తి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారని వివరించారు. సాగు అభివృద్ధి పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. నీటి పారుదల ప్రాజెక్ట ల పనులు వేగంగా పూర్తి చేసేందుకు .. రైతులకు ఉత్తమ సేవలు అందించేందుకు ప్రభుత్వం నీటి పారుదల శాఖకు భవనాలు నిర్మిస్తుందని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, భవిష్యత్ ప్రణాళికలు రచించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో పారిశుధ్య పనులు, రెసిడెన్షియల్ విద్యార్థులు, ప్రజలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేయించామని, అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రాఘువేందర్, తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీవో లచ్చాలు, సర్పంచ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- **గోలి మధుసూదన్ రెడ్డి**



తిప్పర్తి -ఏప్రిల్ 20( మనం న్యూస్ ) తిప్పర్తి రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఐకేపీ కేంద్రాలలో కొనుగోలు చేసి రైతంగాన్ని ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి అన్నారు. తిప్పర్తి మండల కేంద్రం సోమవారం ఐకెపి కేంద్రాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు వంగూరి రవి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గోలి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మిల్లర్లు రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను కోరడం జరిగిందన్నారు.స్థానిక మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారేమో తిప్పర్తి మండల కేంద్రానికి 50 లారీలు ఉండేలా చూసుకుంటానని గ్రామ సభలో గొప్పలు చెప్పి రైతులకు ఇబ్బంది లేకుండా చూసుకుంటానని చెప్పి ఈరోజు రైతులని పట్టించుకోకుండా గాలికి వదిలేసి రైతులు ఎండలో ఇబ్బంది పడుతుంటే ఈ మంత్రికి రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కొట్టినట్టు కూడా లేకపోవడం దౌర్భాగ్యకరం అని విమర్శించారు. ఎమ్మెల్యేలు మంత్రులు మిల్లలతో కుమ్మక్కయి రైతులను ఇబ్బంది పెట్టడం చాలా దురదృష్టకరం అని అన్నారు.అనంతరం ఐకెపి కేంద్రంలో ఉన్న పలువురు రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోని జిల్లా కలెక్టర్ కు చరవాణి ద్వారా ఇక్కడ ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి జిల్లా నాయకులు పోలాగోని సర్వయ్య గౌడ్ బీజేవైఎం మండల అధ్యక్షులు దేశోజు శివశంకర్ రాములు లింగయ్య నాగరాజ్ మల్లమ్మ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో విద్యార్థుల ఆరోగ్యం, సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



- **విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వసతి కల్పనపై దృష్టి**
- **విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, డైట్ నియమాలు కచ్చితంగా అమలు**
- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి, ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి): గురుకులాల్లో విద్యార్థుల ఆరోగ్యం, సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వెల్ఫేర్ వీక్ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బ్యాక్వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్, పెద్దపల్లిని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గురుకుల పాఠశాలల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, వంటశాలలు, నిల్వ గదులు, తరగతి గదులు, వసతి గృహాలను నిరంతరం శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు హైజీన్ ప్రమాణాలు పాటించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సర ప్రారంభానికి ముందే అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని, ఎలాంటి లోపాలు లేకుండా విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యంగా ఉండాలని, పోషకాహార ప్రమాణాలను పాటిస్తూ సరైన డైట్ను అమలు చేయాలని సూచించారు. ఆహార భద్రతపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, వంట ప్రక్రియలో శుభ్రత, నాణ్యతపై రాజీ పడకూడదన్నారు.విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవసరమైనప్పుడు వెంటనే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిన్నపిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సిబ్బందికి సూచించారు.అదేవిధంగా పాఠశాలలో ఉన్న డ్రైనేజ్ సమస్యను పరిష్కరించేందుకు అవుట్లెట్ను త్వరితగతిన ఏర్పాటు చేసేలా మున్సిపల్ కమిషనర్కు ఆదేశించారు.ఈ సందర్భంగా 2026 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ గారు పతకాలు ప్రదానం చేశారు. కలెక్టర్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నందుకు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి శ్రీనాథ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్,సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

# బసవేశ్వర ఆశయాలను ఆచరిస్తే సమాజంలో సమానత్వం సాధ్యం



పెద్దపల్లి, ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి): బసవేశ్వర ఆశయాలను, ఆలోచనలను మనమందరం ఆచరిస్తే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ డి. వేణు అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వర జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ డి. వేణు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అదనపు కలెక్టర్ డి. వేణు మాట్లాడుతూ, బసవేశ్వరుడు సమాజంలో ఉన్న కుల వ్యవస్థ, అసమానతలు తొలగించేందుకు కృషి చేసిన గొప్ప సంస్కర్త అని తెలిపారు. కాయకవే కైలాసం అనే సిద్ధాంతంతో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, శ్రమకు గౌరవం ఇవ్వాలని బోధించారని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం స్థాపన కోసం బసవేశ్వరుడు అనుభవ మంటపాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తం చేసే వేదిక కల్పించారని తెలిపారు. మహిళలకు సమాన హక్కులు కల్పించేందుకు కృషి చేయడంతో పాటు, విద్య, ఆధ్యాత్మికత ద్వారా సమాజాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారని చెప్పారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందాలంటే బసవేశ్వరుని ఆలోచనలు ఎంతో అవసరమని, ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, బీసీ అభివృద్ధి శాఖ అధికారులు, సిబ్బంది, ఇతర జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల సంరక్షణ పై ప్రత్యేక కార్యాచరణ

- **చెరువుల వివరాలు, కబ్జాలపై ప్రత్యేక నిఘా**
- **చెరువు నీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు**
- **కే హైమావతి, జిల్లా కలెక్టర్**



సిద్దిపేట ఏప్రిల్ 20; మనం ప్రతినిధి వెట్ ల్యాండ్ సంరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి పేర్కొన్నారు. సిద్దిపేటలో సోమవారం జిల్లా వెట్ ల్యాండ్ మేనేజ్మెంట్ కమిటీ మీటింగ్ లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని నీటి వనరులైన చెరువులను గుర్తించి ఆయా మండలాల లోని గ్రామాల వారిగా చెరువు విస్తీర్ణం రికార్డు వెరిఫై చేసుకుని మ్యాప్ సిద్ధం చెయ్యాలని సర్వే అధికారులను ఆదేశించారు. చెరువుల మొత్తం విస్తీర్ణం, డిజిటల్ మ్యాపింగ్, లోతు, వర్షపాతం, చేపల సామర్థ్యం, గ్రౌండ్ వాటర్, చెరువు భూ రికార్డు పరిశీలన, నీటి నాణ్యత అన్ని వివరాలు అటవీ, నీటిపారుదల, మత్స్య శాఖ అధికారుల సమన్వయంతో అన్ని వివరాలు సేకరించి చెరువును సంరక్షించి పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలనీ తెలిపారు. వెట్ ల్యాండ్ ను సంరక్షించడం ఒక సామాజిక బాధ్యత గా మెలగాలనీ, నీరు కలుషితం కాకుండా, ప్రకృతిని కాపాడడం లో అందరూ భాగస్వామ్యం కావాలని అధికారులను ఆదేశించారు. అడవులను నరికివేయకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని అటవీ శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, ఇరిగేషన్, సర్వే, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కంచర్ల గ్రామంలో ఉద్రిక్తత..

భిక్కనూరు, ఏప్రిల్ 20 ( మనం న్యూస్ ) మండలంలోని కంచర్ల గ్రామంలో సోమవారం ఒక కలకలం రేగింది. ఓ ప్రజాప్రతినిధి వేధింపులు భరించలేక ఒక యువకుడు ఆత్మహత్యకు యత్నించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. సంఘటన వివరాలలోకి వెళితే గ్రామా లోని ఒక ప్రజా ప్రతినిధి తన భార్యను లైంగికంగా వేధిస్తున్నాడనే ఆరోపణతో, అదే గ్రామానికి చెందిన యువకుడు తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో, న్యాయం జరగాలంటూ ఆ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. తన కుటుంబానికి జరుగుతున్న అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేస్తూ అతను తీసుకున్న ఈ నిర్ణయం గ్రామంలో ఉద్రిక్తతకు దారితీసింది.విషయం తెలుసుకున్న భిక్కనూరు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు యత్నిస్తున్న వ్యక్తితో పోలీసులు చర్చలు జరిపారు. 'చట్టం ముందు అందరూ సమానమే అని, వేధింపులకు పాల్పడిన వ్యక్తి ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని' పోలీసులు రాకేష్కు హామీ ఇచ్చారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అదుపులోనే ఉంది. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సదరు ప్రజాప్రతినిధిపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# జీవన్ రెడ్డికి కేసీఆర్ కీలక బాధ్యతలు





- **టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి**
- **ఆశీర్వాద సభలో ప్రకటించిన టిఆర్ఎస్ అధినేత కేసీఆర్**

జగిత్యాల ఏప్రిల్ 20( మనం ప్రతినిధి ): జగిత్యాల కెసిఆర్ ఆశీర్వాద అశేష జనంతో సభా ప్రాంగణం కళకళలాడింది ఈ సభలో టిఆర్ఎస్ అధినేత కేసిఆర్ జీవన్ రెడ్డికి కేసీఆర్ కీలక బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ప్రకటించినారు. జగిత్యాల కాదు.. జగిత్యాల జిల్లా మాత్రమే కాదు.. పాత కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ బాధ్యతలు కూడా చూడాలి.. ఈ క్షణం నుంచి జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నా అని కెసిఆర్ భావోద్వేతంతో ప్రకటించినారు. జీవన్ రెడ్డి యొక్క అనుభవం వారి సూచనలు మా పార్టీకి ఎంతో అవసరమని కీలక బాధ్యతలను అప్పగిస్తున్నట్టు ప్రకటిస్తున్నాను అని అన్నారు. జీవన్ రెడ్డి రాకతో జగిత్యాల నియోజకవర్గంలో కలకలం రేకెత్తి కాంగ్రెస్ నాయకుల గుండెల్లో గుబులు మొదలైందని అని అన్నారు.

## తీవ్ర ఒత్తిడిలో హార్దిక్ పాండ్య..



అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తయారైంది ముంబయి ఇండియన్స్ పరిస్థితి. స్టార్లతో నిండిపోయిన ముంబయి ఐపీఎల్ 2026 సీజన్ లో విజయాల కోసం ఆత్రుతగా ఎదురు చూడాల్సి వస్తోంది. ఇక కెప్టెన్ హార్దిక్ పాండ్య నాయకత్వ పటిమపైనా ఇప్పటికే విమర్శలు వస్తున్నాయి. జట్టును సరిగ్గా నడిపించడం లేదని.. కనీసం సీనియర్లకు గౌరవం ఇవ్వడంలేదంటూ ఫ్యాన్స్ ఫైర్ అయిపోయారు. వెంటనే వైదొలగి రోహిత్ లేదా బుమ్రాకు కెప్టెన్సీ అప్పగించాలంటూ కామెంట్లు పెట్టారు. ఈ క్రమంలో ఇవాళ గుజరాత్ టైటాన్స్ తో మ్యాచ్ ఇటు ముంబయికి ఎంత ముఖ్యమో.. అటు హార్దిక్ కూ అంతే కీలకం.



## న్యూజిలాండ్‌కు షాకిచ్చిన బంగ్లాదేశ్

న్యూజిలాండ్ తో తొలి వన్డేలో ఎదురైన ఓటమికి బంగ్లాదేశ్ బదులు తీర్చుకుంది. సోమవారం ఢాకా వేదికగా జరిగిన రెండో వన్డేలో కివీస్ పై 6 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ ఘన విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్ ను బంగ్లా జట్టు 1-1తో సమం చేసింది. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 48.4 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది.

కివీస్ బ్యాటర్లలో నిక్ కెల్లీ (102 బంతుల్లో 83 పరుగులు, 14 ఫోర్లు) టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా కెల్లీ మాత్రం ఒంటరిపోరాటం చేశాడు. మిగితా బ్యాటర్ల నుంచి అతడి సహకారం లభించలేదు. ఈ మ్యాచ్ లో బంగ్లాదేశ్ స్పీడ్ స్టార్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. రాణా 5 వికెట్లు పడగొట్టి న్యూజిలాండ్ వెన్ను విరిచాడు. అతడితో పాటు షోర్ ఫుల్ ఇస్లాం రెండు.. రిషాద్, టాస్కిన్ అహ్మద్, సౌమ్య సర్కార్ తలా వికెట్ సాధించారు.



## బాలయ్య క్రేజీ ప్రాజెక్ట్ షురూ..

నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా నటించిన డివోషనల్ చిత్రం అఖండ 2 తర్వాత తన కెరీర్ 111వ సినిమాని తన వీరసింహా రెడ్డి దర్శకుడు గోపీచంద్ మలినేనితో చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఎప్పుడో మొదలు కావాల్సిన ఈ క్రేజీ ప్రాజెక్ట్ కొన్ని మార్పులు చేర్పులు రీత్యా కొద్దిగా ఆలస్యం అయ్యింది. ఇక ఇదిలా ఉండగా ఈ ప్రాజెక్ట్ పై సాలిడ్ అప్డేట్ ఇప్పుడు తెలుస్తుంది. మేకర్స్ నేటి నుంచే ఈ సినిమా తాలూకా షూట్ ని షురూ చేసినట్టు టాక్.

మరి ఈ సినిమా ఎప్పటికి పూర్తయ్యి విడుదలకి తీసుకొస్తారో చూడాలి. ఇక ఈ సినిమాలో బాలయ్య సరసన మరోసారి నయనతార నటిస్తుండగా సింహా, జై సింహా అలాగే శ్రీరామ రాజ్యం లాంటి సాలిడ్ ట్రాక్ రికార్డు తర్వాత మళ్ళీ వీరు కలిసి నటిస్తుండడంతో ఈ సినిమాపై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ చిత్రానికి కూడా థమన్ సంగీతం అందిస్తుండగా పెద్ద నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ వారు భారీ బడ్జెట్ తో ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు

# ‘పంజా’బ్ దెబ్బ.. ప్రత్యర్థులు కుదేల్!



ఈసారి వదిలేదే లేదంటూ పంజాబ్ కింగ్స్ అదరగొడుతోంది. ఇప్పుడు ముంబయి, చెన్నై వంటి జట్లు ఇబ్బందిపడుతూ ఉంటే.. పంజాబ్ మాత్రం అజేయంగా కొనసాగుతూ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం 6 మ్యాచుల్లో ఐదింట్లో గెలిచి.. ఒక మ్యాచ్ రద్దు కావడంతో 11 పాయింట్లు పంజాబ్ ఖాతాలో ఉన్నాయి. మిగిలిన ఎనిమిది మ్యాచుల్లో కనీసం నాలుగు గెలిచినా.. ప్లేఆఫ్స్ కు చేరుకోవడం ఖాయం. అదనంగా మరొక మ్యాచ్ లో విజయం సాధిస్తే టాప్ ప్లేస్ తో నాకౌట్ కు చేరుకోవడం తేలికవుతుంది. ఈ రెండేళ్లలో వచ్చిన మార్పులపై ఓ లుక్కేద్దాం.

**ప్రతి ఐపీఎల్ సీజన్ కు ముందు టాప్-4లో నిలిచే జట్లేవి అని చర్చకు వస్తే ఠక్కున గుర్తుకొచ్చే పేర్లు చెన్నై, ముంబయి, బెంగళూరు. నాలుగో పేరు కోసం సన్ రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ కాస్త పోటీపడతాయి. ఈ జాబితాలో లేని జట్టు పంజాబ్ కింగ్స్.**

**తొలి సీజన్ నుంచి ఆడుతున్నా.. ఒక్కసారి టైటిల్ నెగ్గని జట్లు రెండే. అవి పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్.**

**రెండుసార్లు ఫైనల్ కు వెళ్లినా.. కప్పును అందుకోలేకపోయిన జట్టు పంజాబ్ కింగ్స్.. పోయినసారి చేతివరకూ వచ్చిన కప్పును ఆర్సీబీ ఎత్తుకెళ్లిపోయింది.**

**‘సర్పంచ్ సాబ్’ ముందుండి..**

ఊరికి ఏదైనా కష్టమొస్తే ముందుండి నడిపించే నాయకుడు ‘సర్పంచ్’. పంజాబ్ కింగ్స్ కూ ఓ సర్పంచ్ సాబ్ ఉన్నాడు. అతడే కెప్టెన్ శ్రేయస్ అయ్యర్. తనకు ఈ పేరు బాగా నచ్చిందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలోనూ చెప్పిన సంగతి తెలిసిందే. ఇలా పిలుపించుకోవాలంటే ఆ వ్యక్తికి తగినంత అర్హత ఉండాలి. ఆ విషయంలో శ్రేయస్ ముందుంటాడని తన సారథ్యంతోపాటు బ్యాటర్ గానూ నిరూపించాడు. గత సీజన్ లో పంజాబ్ కింగ్స్ ఫైనల్ కు చేరడంలో శ్రేయస్ దే కీలక పాత్ర. 17 మ్యాచుల్లో 600కి పైగా పరుగులు చేసిన బ్యాటర్ అతడు. మరి ఈ ఏడాది ఏమైనా తక్కువా? అంటే అదేం కాదు. వన్ డౌన్ లేదా సెకండ్ డౌన్ లో వస్తూ ఇప్పటికే ఆరు మ్యాచుల్లో 208 పరుగులు చేసేశాడు. బ్యాటర్ గా తనపై ఎలాంటి రిమార్కులు లేవని ప్రూవ్ చేసుకున్నాడు. ఇటు కెప్టెన్ గానూ శ్రేయస్ నిర్ణయాలు అదరహో అనాల్సిందే. ఎవరిని ఏ సమయంలో వినియోగించుకోవాలో బాగా తెలుసు. బౌలర్ల విషయంలో సక్సెస్ అయిన శ్రేయస్.. పంజాబ్ వరుస విజయాల వెనక నాయకత్వ పటిమ కూడా కీలకమైందే. ఇక ఫీల్డర్ గానూ ముంబయితో మ్యాచ్ లో తన ఇంటెన్షన్ ఏంటో అభిమానులకు పరోక్షంగా చెప్పేశాడు. ప్లేయర్లకు స్వేచ్ఛ ఇస్తూ ఫలితాలను రాబట్టడం తెలివైన నాయకుడి లక్షణం. సరిగ్గా శ్రేయస్ ఇదే చేసి చూపించాడు. ఎవరైనా ఫీల్డింగ్ మిస్టేక్ లు చేసినా వెనకేసుకొచ్చాడు. బౌలింగ్ లో ఇబ్బందిపడితే మద్దతుగా నిలిచాడు. బ్యాటర్లు ఫెయిలైతే ‘నేను’ ఉన్నానంటూ ముందడుగు వేశాడు. ఇవన్నీ చేస్తే ఫలితం సానుకూలంగా రాకుండా ఉంటుందా..!

**పాంటింగ్ పదునైన వ్యూహాలు..**



ప్రతి మ్యాచ్ లోనూ ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించాలంటే ప్లేయర్ల నైపుణ్యంతోపాటు కోచింగ్ బృందం వ్యూహాలు ముఖ్యం. ఈ విషయంలో రికీ పాంటింగ్ తన బుర్రకు పదునుపెట్టాడు. గత సీజన్ లో అందకుండా పోయిన కప్పును ఈసారి ఎలాగైనా ఒడిసిపట్టాలని పంజాబ్ జట్టులోని ప్రతి ప్లేయర్ లోనూ కసిని పెంచాడు. బ్యాటింగ్ లో అవసరమైన మార్పులు చేశాడు. అందుకు ఉదాహరణ కనోలీ, శ్రేయస్ ను వన్ డౌన్, సెకండ్ డౌన్ లో జట్టుకు అవసరమైన సందర్భంలో పంపించేవాడు. ఇక ఫినిషర్ గా శశాంక్, స్టాయినిస్ కు కావాల్సినంత స్వేచ్ఛ ఇచ్చాడు. టీమ్ఇండియా టీ20 టాప్ బౌలర్ అర్ష్ దీప్ సింగ్ కు మొదట్లో వికెట్లు దక్కలేదు. భారీగానూ పరుగులు సమర్పించాడు. కానీ, ఎక్కడా ఒక్కమాట అన్నట్లు వార్తలు రాలేదు. అతడి చేతికే కొత్త బంతిని ఇచ్చి వికెట్లు తీసేలా చేయడంలో రికీ బృందం కృషి ఎనలేనిది.

**ప్లేయర్లూ తక్కువేం కాదు..**



తమను ఛాంపియన్ గా చూసుకోవాలని ఏ ఆటగాడికైనా ఉంటుంది కదా.. పంజాబ్ కింగ్స్ ప్లేయర్లలోనూ ఉంది. గత సీజన్ లో చేతివరకూ వచ్చిన కప్పు మిస్ కావడం ఈసారి ఆ క్రికెటర్లలో మరింత దూకుడు పెంచేలా చేసింది. ఎక్కువగా అభిషేక్ శర్మ - ట్రావిస్ హెడ్, యశస్వి జైస్వాల్ - వైభవ్ సూర్యవంశీ జోడీల గురించే ఎక్కువగా చర్చ జరుగుతోంది. కానీ, ప్రభ్ సిమ్రన్ - ప్రియాంశ్ ఆర్య ఓపెనింగ్ పెయిర్ కూడా డేంజరస్ అని దాదాపు ప్రతి మ్యాచ్ లోనూ నిరూపించారు. వీరిద్దరూ కనీసం ఒక్కరైనా పంజాబ్ విజయం సాధించేవరకూ క్రీజ్ లో ఉండటం మరో స్పెషాలిటీ. ఆ తరువాత కనోలీ, శ్రేయస్ తమ బాధ్యతలను నిర్వర్తిస్తే.. ఆఖర్లో అవసరమైతే శశాంక్, మార్కస్ స్టాయినిస్ బ్యాట్ ను ఝుళిపించేందుకు సిద్ధంగా ఉండటం పంజాబ్ జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్.

లీగ్ స్టేజ్లో చూపించే దూకుడును.. నాకౌట్ లోనూ కొనసాగిస్తేనే కప్పు అందుకోవడం అనే కల నెరవేరుతుంది. అప్పటివరకూ విశ్రమించకుండా ప్రత్యర్థులపై ‘పంజా’బ్ విసురుతూనే ఉండాలి.

## మరోసారి మంచి మనసు చాటుకున్న చిరంజీవి

ప్రముఖ నటుడు చిరంజీవి మరోసారి మంచి మనసు చాటుకున్నారు. ఆపదలో ఉన్న తన సిబ్బందిని ఆర్థిక సాయంతో ఆదుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. మేకప్ ఆర్టిస్ట్ శివనాథ్ హార్ట్ సర్జరీ కోసం రూ.10.5 లక్షలు, మాజీ మేనేజర్ నరసయ్య సతీమణి బైపాస్ సర్జరీకి రూ.9.5 లక్షలు అందజేశారు. సాయం చేయడమే కాదు శస్త్ర చికిత్సల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి, ఆ కుటుంబాలకు అండగా నిలిచారు.తెలంగాణ ప్రభుత్వం ఇటీవల తనకు అందజేసిన ఎన్టీఆర్ నేషనల్ అవార్డు నగదు బహుమతి రూ. 10 లక్షలని చిరంజీవి పలు సేవా సంస్థలకు విరాళంగా ఇచ్చారు. కొవిడ్, వరదలు.. ఇలా విపత్కర సమయాల్లో బాధితులకు అండగా నిలిచారు. బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ల ద్వారా ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపిన సంగతి తెలిసిందే.



## ‘ప్యారడైజ్’ తెచ్చిన తంటాలు.. మిస్ అవుతున్న ఆఫర్లు..!



ప్రస్తుతం వరుస ఆఫర్స్ తో దూసుకుపోతున్న బ్యూటీ కయాదు లోహర్ టాలీవుడ్ లో పలు క్రేజీ చిత్రాల్లో నటిస్తోంది. ఆమె ప్రస్తుతం న్యాచురల్ స్టార్ నాని సరసన ప్రెస్టీజియస్ ‘ది ప్యారడైజ్’ మూవీలో నటిస్తోంది. అయితే, ఆ సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉండబోతుందనే విషయంపై ఇప్పటికే మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కాగా, ప్యారడైజ్ చిత్రంతో కయాదు లోహర్ కు వరుస ఆఫర్లు మిస్ అవుతున్నట్లు తెలుస్తోంది. కయాదు లోహర్ చేతిలో ప్రస్తుతం ఐదుకు పైగా సినిమాలు ఉన్నప్పటికీ, ఆమె కొత్త ప్రాజెక్టులపై సంతకం చేయకపోవడానికి ప్రధాన కారణం ‘ది ప్యారడైజ్’. ఈ సినిమా ఒప్పందం ప్రకారం, షూటింగ్ ఎప్పుడు ఉన్నా ఆమె అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. దీనివల్ల ఆమె కాల్షీట్లు సర్దుబాటు చేయడం కష్టంగా మారింది. కొన్ని నిర్మాణ సంస్థలు ఆమె ఇబ్బందిని అర్థం చేసుకున్నప్పటికీ, మరికొందరు డేట్స్ సమస్య కారణంగా ఆమెను తీసుకోవడానికి వెనకాడుతున్నారు. అయినప్పటికీ, ‘ది ప్యారడైజ్’ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం ఆమె ఇన్ని అవకాశాలను వదులుకోవడం వెనుక పెద్ద ప్లానే ఉంది. ఈ సినిమా కోసం ఆమెకు భారీ రెమ్యునరేషన్ అందినట్లు సమాచారం. ఒకవేళ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధిస్తే, కయాదు లోహర్ కెరీర్ మరో స్థాయికి చేరుకోవడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా ప్యారడైజ్ మూవీపై కయాదు లోహర్ భారీ అంచనాలు పెట్టుకున్న మాట మాత్రం వాస్తవం.



## ఇది మైలురాయి మాత్రమే కాదు..: పూరి జగన్నాథ్ పై విజయ్ ప్రశంసలు

తన మార్క్ డైలాగులతో ఇండస్ట్రీలో స్టార్ దర్శకుల జాబితాలో స్థానం సొంతం చేసుకున్నారు దర్శకుడు పూరి జగన్నాథ్. ఆయన ఇండస్ట్రీకి వచ్చి నేటికి 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయ్ సేతుపతి ఆయనపై ప్రశంసలు కురిపించారు. ప్రస్తుతం వీరిద్దరి కాంబినేషన్ లో ‘స్లమ్ డాగ్’ చిత్రం రూపొందుతోంది. ఈనేపథ్యంలో ఆయనతో తనకున్న అనుబంధాన్ని, ఆయన పనితీరును కొనియాడుతూ విజయ్ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ఇది నెట్టింట వైరల్ అవుతుండగా పూరి జగన్నాథ్ అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

‘‘మీదో అద్భుతమైన ప్రయాణం. సినీ రంగంలో 26 ఏళ్లు పూర్తిచేసుకోవడం కేవలం మైలురాయి మాత్రమే కాదు.. ధైర్యం, నమ్మకం, నిర్భయంతో మీరు నిర్మించుకున్న కోట. మీ దర్శకత్వంలో ‘స్లమ్ డాగ్’లో నటించడం నాకు దక్కిన గౌరవం. నటులను నమ్మి, వారిని కంఫర్ట్ జోన్ నుంచి బయటకు తీసుకువచ్చి ప్రతిభను వెలికితీసే దర్శకుల కోసం నేను ఎప్పుడూ ఎదురుచూస్తుంటా. మీరు ఆ పనిని చాలా సునాయాసంగా చేస్తారు. మనందరికీ ఇదొక ప్రత్యేకమైన సినిమాగా నిలిచిపోతుందని నమ్ముతున్నాను. మీరు మరిన్ని విజయాలు అందుకోవాలని, ఇంకా ఎన్నో ఏళ్లపాటు మీ కథలతో మమ్మల్ని ఆకట్టుకోవాలని కోరుకుంటున్నాను’’ అని విజయ్ పోస్ట్ పెట్టారు.

# విజయ్ దేవరకొండ–శౌర్యువ్ చిత్రానికి క్లాప్ కొట్టిన నాని..!

టాలీవుడ్ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులను ప్రకటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారాడు. తాజాగా ఆయన ‘హాయ్ నాన్న’ మూవీ డైరెక్టర్ శౌర్యువ్ తో కలిసి తన కొత్త ప్రాజెక్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక ఈ ప్రాజెక్టును తాజాగా పూజా కార్యక్రమాలతో పట్టాలెక్కించారు. హైదరాబాద్ లో చిత్ర యూనిట్ సమక్షంలో ఈ సినిమా గ్రాండ్ గా ప్రారంభమైంది. వైరా ఎంటర్ టైన్ మెంట్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్ ను నిర్మిస్తోంది.



ఈ ప్రారంభోత్సవ వేడుకకు న్యాచురల్ స్టార్ నాని ముఖ్య అతిథిగా విచ్చేయడం విశేషం. విజయ్ దేవరకొండపై నాని ఫస్ట్ క్లాప్ కొట్టి చిత్ర యూనిట్ కు శుభాకాంక్షలు తెలిపాడు. ప్రస్తుతం సోషల్ మీడియాలో నాని మరియు విజయ్ దేవరకొండ కలిసి ఉన్న ఫోటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఇద్దరు స్టార్స్ ఒకే ఫ్రేమ్ లో కనిపించడంతో అభిమానులు పండగ చేసుకుంటున్నారు.

ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. విజయ్ తన ప్రస్తుత ప్రాజెక్టులను పూర్తి చేసిన వెంటనే ఈ సినిమా షూటింగ్ లో పాల్గొననున్నాడు. ‘హాయ్ నాన్న’ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందించిన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు కూడా సంగీత దర్శకుడిగా పనిచేస్తున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.